అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 03-1-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 3 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

ముచ్చటగా మూడోసారి

బ్రెజిల్ అధ్యక్షుడిగా ప్రముఖ వామపక్ష నేత లూలా ద సిల్వా

- కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రమాణస్వీకారం
- భారీగా తరలి వచ్చిన ప్రజలు, అభిమానులు



వివరాలు 2లో

రాష్ట్రానికి 3.30 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు

టీఎస్ ఐపాస్, ఐటీ అనుబంధ రంగాల్లో...

- ప్రయివేటు రంగంలో 22.50 లక్షల ఉద్యోగాల కల్పన
- అన్ని రంగాల పెట్టుబడులతో నివేదిక రూపొందించాలి
- అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడంలో తమ ప్రభుత్వం ఘన విజయాన్ని సాధించిందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె. తారకరామారావు తెలిపారు. విప్లవాత్మక విధానాలు, పారదర్శక పాలన, టీఎస్ ఐపాస్‌తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చినట్టు ప్రకటించారు. ఎనిమిదేండ్లుగా వచ్చిన పెట్టుబడులతో పాటు భవిష్యత్‌లో రానున్నవాటిపైనా పరిశ్రమలు-ఐటీ శాఖ అధికారులతో సోమవారం హైదరాబాద్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

టీఎస్‌ఐపాస్, ఐటీ - ఐటీ అనుబంధ రంగాల్లో 2014 నుంచి గతేడాది నవంబర్ వరకు దాదాపు 3 లక్షల 30 వేల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్టు మంత్రి తెలిపారు. మైనింగ్, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, ఆతిథ్య రంగంతో పాటు ఇతర రంగాల్లో వచ్చిన పెట్టుబడులన్నింటినీ కలిపితే ఈ విలువ మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. త్వరలోనే ఆయా రంగాల్లోకి వచ్చిన పెట్టుబడుల వివరాలను కూడా విడుదల చేస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని ఇప్పటిదాకా వచ్చిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పెట్టుబడులతో ప్రయివేటు రంగంలో ఇరవై రెండున్నర లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించిందన్నారు. కేవలం ఒకటి రెండు రంగాలనే కాకుండా దాదాపు 14 రంగాలను ప్రాధాన్యతా రంగాలుగా తమ ప్రభుత్వం గుర్తించి పక్కా ప్రణాళికను రూపొందించి భారీ పెట్టుబడులను సాధించిందని కేటీఆర్ తెలిపారు. ఒక్కో రంగానికి ప్రత్యేకంగా అధికారిని నియమించడంతో పాటు ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధంగా ఉన్న కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరిపి, ప్రభుత్వ విధానాలు, ఇక్కడి మౌలిక వసతుల గురించి వివరించడంతోనే ఇది ...5లో

నోట్ల రద్దుపై 4:1 తీర్పు

కేంద్ర ప్రభుత్వ చర్యను సమర్థించిన సుప్రీంకోర్టు

- ధర్మాసనంలో మిగిలిన నలుగురు సభ్యులతో విభేదించిన జస్టిస్ బి.వి.నాగరత్న
- పౌరులను తీవ్రంగా ప్రభావితం చేసింది.. కేంద్రం తీరు చట్టవిరుద్ధం..
- కేవలం 24 గంటల్లో కసరత్తు ముగించారని వెల్లడి

నోట్లరద్దుపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని 4:1 మెజార్టీతో అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. 2016లో నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం రూ.1,000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం డిసెంబర్ 7 విచారణను పూర్తి చేసి, తీర్పు రిజర్వ్ చేసింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 382 పేజీల తీర్పు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును నలుగురు న్యాయమూర్తులు సమర్థించగా, జస్టిస్ బి.వి.నాగరత్న తప్పుబట్టారు.





న్యూఢిల్లీ : నోట్ల రద్దు లక్ష్యాలు ఏమైనప్పటికీ, దానిని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం చట్టవిరుద్ధమని జస్టిస్ నాగరత్న తీవ్రంగా ఆక్షేపించారు. రూ.2వేల నోటు కూడా విడుదలైంది కాబట్టి, నోట్ల రద్దు ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యం సాధించలేకపోయిందని పేర్కొన్నారు. "దేశ ఆర్థిక వ్యవస్థకు ఆర్బీఐ రక్షణ కవచం. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద నోట్ల రద్దు చేసిన చరిత్రను ఉదహరించాను. ఆర్థిక లేదా ఆర్థిక నిర్ణయాల మెరిట్‌పై కోర్టు కూర్చోవడం కాదు. సెక్షన్ 26(2)ని పరిశీలించడం అంటే కూర్చోవడం కాదు. నోట్లరద్దు మెరిట్‌ల గురించి ఈ కోర్టు గీసిన లక్ష్మణ రేఖలో బాగానే ఉంది" అని అన్నారు. "కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నోట్ల రద్దు అనేది బ్యాంకులు చేసే దానికంటే పౌరులను ప్రభావితం చేసే చాలా తీవ్రమైన సమస్య" అని పేర్కొన్నారు. "పార్లమెంట్ లేకుండా ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందదు.. అటువంటి ముఖ్యమైన నిర్ణయాలకు పార్లమెంటు దూరంగా ఉండదు" అని ఆమె అన్నారు.

ఆర్బీఐకి స్వతంత్ర అధికారం లేదు : జస్టిస్ బి.ఆర్.గవాయ్

నోట్లరద్దును తీసుకురావడానికి ఆర్బీఐకి స్వతంత్ర అధికారం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. మెజారిటీ అభిప్రాయాన్ని జస్టిస్ గవాయ్ చదివి వినిపించారు. "ఆర్థిక ప్రాముఖ్యత కలిగిన విషయాలలో జోక్యం చేసుకునే ముందు చాలా సంయమనం పాటించాలి. కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వచ్చినందున నిర్ణయం తీసుకునే ప్రక్రియను తప్పుపట్టలేమని పేర్కొంది. మేము అలాంటి అభిప్రాయాలను న్యాయ వ్యవస్థతో భర్తీ చేయలేము" అని అన్నారు. "కేంద్రం, ఆర్బీఐ మధ్య ఆరు నెలల పాటు సంప్రదింపులు ...5లో

సుప్రీం సమర్థించిందని భావించలేం !

వివరాలు 2లో

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

మోడీది ప్రయివేటీకరణ.. మాది జాతీయీకరణ...



బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా సీఎం కేసీఆర్‌కు శాలువా కప్పి సన్మానిస్తున్న రావెల, పక్కన పార్థసారథి, తోట చంద్రశేఖర్ తదితరులు

- విశాఖ ఉక్కును ఆయన అమ్మితే.. మేం ప్రభుత్వపరం చేస్తాం...
- బీఆర్ఎస్‌లో ఏపీ నేతల చేరికల సందర్భంగా సీఎం కేసీఆర్
- ఆ రాష్ట్రంలోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వ్యాఖ్యలు
- సంక్రాంతి తర్వాత చాలా రాష్ట్రాల్లో బీఆర్ఎస్ కార్యాచరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం అటు కేంద్రంలోని బీజేపీకి.. ఇటు ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు హెచ్చరికలు జారీ చేశారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ద్వారా ఆయా పార్టీలపైన, వాటి విధానాలపైనా పోరాడతామనే సంకేతాలను ఇచ్చారు. తద్వారా దేశ రాజకీయాలను, మేధావుల దృష్టిని తన వైపునకు తిప్పుకున్నారు. సోదర తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు నేతలు సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం (తెలంగాణభవన్)లో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి పార్థసారథి, కాపునాడు జాతీయ అధ్యక్షుడు తాడిపాక రమేశ్‌నాయుడు, కాపునాడు కార్యదర్శి శ్రీనివాస్ నాయుడు, ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు, అనంతపురం జిల్లాకు చెందిన నాయకుడు టీజే ప్రకాశ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగిస్తూ... ...2లో

ప్రజలు బీజేపీని తిరస్కరించాలి

లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు ఏకం కావాలి

- నోట్ల రద్దుపై శ్వేతపత్రం విడుదల చేయాలి : సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా అన్నారు. కేంద్రంలో మోడీ సర్కారును గద్దె దింపేందుకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఏకం అయ్యి, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆకాంక్షించారు. దీనికోసం సీపీఐ తనవంతుగా ఇతర పార్టీలతో చర్చించి, ఉమ్మడి వ్యూహరచనకు కృషి చేస్తామన్నారు. సోమవారం మగ్దూం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లౌకిక, ప్రజాతంత్ర పార్టీల మధ్య చీలికలు బీజేపీకి అనుకూలంగా మారకూడదని చెప్పారు. మోడీ నేతత్వంలోని బీజేపీ ప్రభుత్వం మళ్ళీ కొనసాగితే దేశ వినాశనం తప్పదని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికలకంటే ముందు తెలంగాణ, తమిళనాడు, త్రిపుర తదితర రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల్లో కూడా బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని ప్రజలకు ...5లో

రేవంత్ అరెస్టు...

సర్పంచుల ధర్నా భగ్నం

- ఎక్కడిక్కడ కాంగ్రెస్ నేతల గృహనిర్బంధం.. అరెస్టులు
- ప్రగతిభవన్‌వైపు దూసుకెళ్లిన కాంగ్రెస్ నేతలు
- సీఎం దిష్టిబొమ్మల దహనం
- నిధులు, విధులపై సర్కారు నిర్లక్ష్యం: రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సర్పంచులకు విధులు, నిధులవ్వాలంటూ డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ తలపెట్టిన ధర్నాను సర్కారు భగ్నం చేసింది. ఎక్కడిక్కడ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టులు చేసింది. అనేక ...2లో

నేటికీ మహిళలపై వివక్ష

ఇంటా బయటా స్త్రీలకు తప్పని తిప్పలు

- పితృస్వామిక భావజాలం మహిళను అణచివేస్తున్నది
- సావిత్రి బాయి పూలే చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి : సావిత్రిబాయి పూలే జయంతి సభలో జస్టిస్ రాధారాణి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేటి ఆధునిక సమాజంలోనూ మహిళలపై వివక్ష కొనసాగుతున్నదని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి రాధారాణి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఎస్వీకే కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ అధ్యక్షతన 'భారత దేశం-మహిళా సాధికారిత' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ స్త్రీల ఆలోచనా విధానంలో మార్పు రావాలన్నారు. మహిళ స్వతంత్ర శక్తిగా ఎదగటానికి చదువు ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. చదువు వల్ల ధైర్యం వస్తుందన్నారు. ఆర్థిక ...5లో

ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక..

పాఠశాల నుంచి తప్పించుకొని రోడ్డుపై విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-కాటారం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల విద్యార్థులు వ్యాయామం చేస్తున్న సమయంలో పాఠశాల నుంచి తప్పించుకొని వచ్చి హైవే-353సీ రోడ్డుపై గారెపల్లిలో ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. తమను ప్రిన్సిపాల్ చైతన్య వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాల నుంచి చైతన్యను బదిలీ చేసేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. తమకు ...5లో

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

- పైరవీలతో ప్రయోజనముండదు
- ఉపాధ్యాయుల్లో నిరంతరం చైతన్యం పెంచాలి : టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో చుక్కా రామయ్య
- టీచర్ల ఖాళీలను భర్తీ చేయాలి : నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య చెప్పారు. పైరవీలతో ప్రయోజనముండబోదనీ, ఉపాధ్యాయులు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సోమవారం ...5లో



అడిగిందొకటి.. ఇచ్చింది మరొకటి

ఆత్మకూరులో ఆర్టీఐ చట్టానికి తూట్లు

- సరైన సమాచారం కోసం ఎంపీవో కాళ్లు మొక్కిన మాజీ ఎంపీటీసీ
- ఎంపీఓ తీరుతో అసహనానికి గురవుతున్న సర్పంచ్‌లు



నవతెలంగాణ-ఆత్మకూర్

సామాన్య ప్రజలకు సాధికారత కనిపించేందుకు తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) 2005 ఒకటి. ప్రజలకు సమాచార సేకరణలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఆర్టీఐ చట్టానికి హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల ఎంపీఓ తూట్లు పొడుస్తున్నారని ప్రతిపక్ష పార్టీకి చెందిన సర్పంచులు ఆరోపిస్తున్నారు. ఆత్మకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ పర్వతగిరి రాజు పెద్దాపూర్, అక్కంపేటతో పాటు పలు గ్రామ పంచాయతీలకు సంబంధించిన వీధిలైట్లు కొనుగోలు చేయడానికి గ్రామ పంచాయతీలో టెండర్లు ఎన్నిసార్లు చేశారో ఆ టెండర్ కాపీలు జిరాక్స్ ఇవ్వాలని గ్రామ కార్యదర్శిని కోరారు. వాటితో పాటు గ్రామ పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రూపాల్లో వచ్చిన నిధుల వివరాలు, గ్రామపంచాయతీలో ఏయే పథకాల కింద ఎన్ని నిధులు వచ్చాయి, ఎంత వ్యయం చేశారో తెలిపే వివరాలు కోరారు. అలాగే, గ్రామాల్లో వీధుల్లో పోసిన చిప్స్ మొరం, కాపిటల్ పనులు రూ.50వేలు దాటితే టెండర్ విధానాన్ని ఎన్నిసార్లు అమలు చేశారో జిరాక్స్ కాపీలు ఇవ్వాలని 2022 నవంబర్ 17న ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆర్టీఐ ద్వారా కోరారు. ఇందుకు జనవరి 2న సోమవారం రైతు వేదిక పేపర్లు, ఇంటి, నల్ల పన్నులు, ఇంటి పర్మిషన్ పేపర్లు, ఉపాధి హామీ వివరాలను పంచాయతీ కార్యదర్శి అందించారని మాజీ సర్పంచ్ రాజు తెలిపారు. ఈ విషయంపై ఇదేమి సమాచారమని పంచాయతీ కార్యదర్శులను అడుగగా.. ఎంపీఓ చేతన్‌రెడ్డి ఇవ్వమని చెప్పిందే ఇచ్చామని కార్యదర్శులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని పర్వతగిరి రాజు తెలిపారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 'ఇదేంటి సార్ అని అడగగా దాటవేసే సమాధానాలు చెప్పడంతో అసహనానికి గురైన సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ...5లో

రేవంత్ అరెస్టు...

(మొదటిపేజీ తరువాయి)

మందిని గృహ నిర్బంధం చేసింది. శనివారం పొద్దునే బంజారాహిల్స్‌లోని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నివాసం వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. ఇందిరాపార్కు ధర్నాకు వెళ్లేందుకు ప్రయత్నించిన రేవంత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, రేవంత్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఆయన నివాసం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. బలవంతంగా అరెస్టు చేసి బొల్లారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత ఆయన్ను విడుదల చేశారు. షబ్బీర్ అలీ, మహేష్‌కుమార్‌గౌడ్, మల్లురవి, నాగేష్‌ముదిరాజ్, రోహిన్‌రెడ్డి, సునీతారావు తదితరులను గృహ నిర్బంధం చేశారు. అరెస్టులకు నిరసనగా పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. గాంధీభవన్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. చరణ్‌కౌశిక్, రవళిరెడ్డి, సుధీర్‌రెడ్డి, నిజాముద్దీన్, రియాజ్ తదితరులు ప్రగతిభవన్ వైపు దూసుకెళ్లారు. వారిని అరెస్టు చేసి బేగంబజార్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ విధానాలను సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సీతక్క, చల్లా వంశీచంద్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు తీవ్రంగా ఖండించారు.

పంచాయతీల డబ్బు రూ 35వేల కోట్లు కొల్లగొట్టిన గజదొంగ సీఎం కేసీఆర్‌పై రేవంత్ ఆగ్రహం

గ్రామపంచాయితీలకు వివిధ బకాయిల కింద ఇవ్వాల్సిన దాదాపు రూ. 35వేల కోట్లను కొల్లగొట్టిన గజదొంగ సీఎం కేసీఆర్ అని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆయన్ను జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వ హయాంలో 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయితీలకు నేరుగా నిధులిచ్చి వాటిపై సర్పంచులకు సర్వాధికారాలను కట్టబెట్టారని గుర్తు చేశారు. కానీ కేసీఆర్ ఆ స్ఫూర్తి మరిచి పంచాయితీరాజ్ సంస్థలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. నెలనెలా పంచాయతీలకు చెల్లించాల్సిన కోట్ల రూపాయల నిధులను ఇవ్వకుండా మరోవైపు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఇవ్వటం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు చేరకుండా ఈ ప్రభుత్వం కొల్లగొట్టిందని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేశారంటూ విమర్శలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి...ఆయనపై విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. తండాలోని పంచాయతీలకు పక్కా భవనాలు కట్టించరా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతివనం తదితర పనులను సర్పంచులు సొంత నిధులతో చేపట్టారని గుర్తు చేశారు. సిరిసిల్ల రాజన్న జిల్లాలో ఆనంద్‌రెడ్డి అనే సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నారనీ, మునుగోడులో సర్పంచ్ బస్టాండ్‌లో బిచ్చమెత్తారనీ, సూర్యాపేట జిల్లాలో శాంతమ్మ అనే మహిళా సర్పంచి తాళిబొట్టు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ డబ్బులను మెగా కృష్ణారెడ్డి, ప్రతిమ శ్రీనివాస్ వంటి బడా కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించారని ఆరోపించారు. పోలీసులు బీఆర్‌ఎస్ సర్కారుకు కీలబొమ్మలుగా మారిపోయారనీ, డీజీపీ అంజనీకుమార్ మమ్ముల్ని అరెస్టు చేసి ప్రభుత్వానికి నజరానా ఇవ్వాలనుకున్నారని విమర్శించారు.

అయ్యప్ప విమర్శల వెనుక బీజేపీ, బీఆర్ఎస్

అయ్యప్ప స్వామిపై వస్తున్న విమర్శల వెనుక బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల కుట్ర దాగి ఉందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. డిసెంబర్ 19న కొడంగల్ నియోజకవర్గంలో మాట్లాడితే ఇన్ని రోజులు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు ప్రశాంత్ కిషోర్ కుట్ర పన్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని కేంద్రానికి కోరితే ఇప్పటివరకు స్పందన లేదన్నారు.

అతిత్వరలో బదిలీలు, పదోన్నతులు

- ఎస్టీయూటీఎస్ నేతలకు సీఎస్ హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన సంవత్సరం కానుకగా అతిత్వరలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ఎస్టీయూటీఎస్ నేతలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సోమేశ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎస్‌ను ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బదిలీలు, పదోన్నతులు చేపడతామంటూ చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏడున్నర ఏండ్లుగా పదోన్నతులు, నాలుగేండ్లుగా బదిలీల్లేక ఉపాధ్యాయులు ఎంతో ఆవేదన చెందుతున్నారని తెలిపారు.

అందమైన కంపోజిషన్‌లతో కొత్త ఏడాది ప్రారంభం



హైదరాబాద్ : శ్రీ ముత్తుస్వామి దీక్షితార్ 'పంచభూత లింగ క్షేత్ర కృతులు' సమర్పణతో కొత్త సంవత్సరం ప్రారంభమైంది. ఈ అందమైన కంపోజిషన్‌లను ఎల్. నాగవల్లి, ఆర్.శ్రీ సుధ, జే. శ్రావణి, ఊర్జిత పటేల్ చక్కగా అందించారు. కంపోజిషన్‌లకు మనోధర్మం అందించడంలో వారి కృషి ప్రత్యేక ప్రశంసలకు అర్హమైనది. ఉదయం జరిగిన ప్రధాన కచేరీలో హైదరాబాద్‌కు చెందిన యువ కళాకారిణి అంజనా తిరుమలై పాల్గొన్నారు. కదన కుతూహలంలోని వర్ణంతో కచేరీ ప్రారంభమైంది. ఇది నూతన సంవత్సర శక్తిని ప్రతిబింబించేలా, కార్యక్రమానికి ఉత్తేజకరమైన ప్రారంభాన్ని అందించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వాయిద్య విద్వాంసుడు కోలంక సాయి కుమార్ వయోలిన్‌పై శ్రద్ధ వహించడం వలన కచేరీ చాలా అభివృద్ధి చెందింది. మృదంగంపై టి.పి. బాలసుబ్రహ్మణ్యం, ఘటంపై ఎం. చంద్రకాంత్‌లు సంగీత కచేరీలో విభిన్నమైన రీతిలో సాగారు. ధని ఆవర్తనంతో పాటుగా ఆకర్షణీయంగా వారి డైనమిక్ శైలి ఈ కార్యక్రమంలో హైలైట్‌గా నిలిచింది.

స్విగ్గీ నష్టాలు రెట్టింపు

న్యూఢిల్లీ : ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ నష్టాలు రెట్టింపు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం 2021- 22లో రూ.3,629 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.1,617 కోట్ల నష్టాలు నమోదు చేసింది. గడిచిన 2021-22లో సంస్థ వ్యయాలు ఏకంగా 131 శాతం పెరిగి రూ.9,574 కోట్లకు ఎగిశాయి. అధిక నిర్వహణ వ్యయాలు, నష్టాల నేపథ్యంలో మరోసారి ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ఉండచ్చనే అంచనాలు వెలుపడుతున్నాయి. ఆ సంస్థ మాత్రం దీన్ని కొట్టిపారేస్తోంది. స్విగ్గీలో ఎలాంటి తొలగింపు ఉండబోవని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. గడిచిన అక్టోబర్‌లోనే అన్ని స్థాయిల్లో ఉద్యోగుల ప్రగతిని మదింపు చేశామన్నారు.

ముచ్చటగా మూడోసారి

బ్రసిలియా : బ్రెజిల్ దేశ అధ్యక్షుడిగా ప్రముఖ వామపక్ష నాయకుడు లూయిజ్ ఇనాసియో లూలా ద సిల్వా ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయన బ్రెజిల్ దేశ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ఇది మూడో సారి. గతంలో 2003-10 మధ్య ఆయన రెండు సార్లు అధ్యక్షుడిగా ఉన్నారు. రైట్ వింగ్ నాయకుడు అయిన జైర్ బోల్సోనారోను గత అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఓడించిన అనుభవజ్ఞుడైన వామపక్షవాది లులా ద సిల్వా ఇప్పుడు బ్రెజిల్ అధ్యక్ష పదవిని చేపట్టారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన ప్రజల మధ్య, అత్యంత పటిష్ట భద్రత నడుమ జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి కార్యాలయం ప్లానాల్టో ప్యాలెస్‌లో ఆదివారం లూలా ప్రమాణస్వీకారోత్సవానికి భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా, నాలుగేండ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉండనున్నారు. తమ అభిమాన నాయకుడి ప్రమాణస్వీకారాన్ని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఆశ.. పునర్నిర్మాణం.. : బ్రెజిల్‌కు సందేశమిచ్చిన లూలా

ఇది తన విజయం కాదనీ, ప్రజాస్వామ్య విజయం అని లూలా తన ప్రారంభోపాన్యాసంలో వెల్లడించారు. " ఓటు వేసే స్వేచ్ఛకు అత్యంత హింసాత్మకమైన బెదిరిపులను, ఓటర్లను ఇబ్బంది పెట్టడానికి పన్నిన అసత్యాలు, ద్వేషాల అత్యంత దారుణమైన ప్రచారాన్ని ప్రజాస్వామ్యం అధిగమించింది" అని ఆయన అన్నారు.బోల్సోనారో పేరు ఎత్తకుండా ఆయనను లూలా హెచ్చరించారు. "దేశాన్ని వారి వ్యక్తిగత, సైద్ధాంతిక రూపకల్పనలకు లొగదీసుకోవడానికి ప్రయత్నించినవారిపై మేము ఎలాంటి ప్రతీకార స్ఫూర్తిని కలిగి ఉండము. మేము చట్టబద్ధమైన పాలనకు హామీ ఇస్తాం" అని తెలిపారు. "ఆశ మరియు పునర్నిర్మాణం" బ్రెజిల్‌కు తన సందేశమని కొత్త అధ్యక్షుడు చెప్పారు.గత కొన్నేండ్లుగా కోల్పోయిన హక్కులు, స్వేచ్ఛ, అభివృద్ధిని మళ్లీ దక్కేలా కృషి చేస్తామన్నారు. దేశంలో పేదల జీవితాలను మెరుగుపర్చేందుకు జాతి, లింగ సమానత్వం కోసం కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు.

ఎన్నికల్లో ఓటమిని అంగీకరించని బోల్సోనారో చివరకు దేశాన్ని విడిచిపెట్టిపోయిన రెండు రోజుల తర్వాత లులా ద సిల్వా ఆ దేశ అధ్యక్ష పీఠాన్ని ఎక్కారు. గతేడాది బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు జరగగా అందులో లులాకు 50.3 శాతం ఓట్ షేర్ లభించింది. అయితే, బోల్సోనారో మాత్రం తన ఓటమిని అంగీకరించలేదు. ఆ దేశ ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ మీద అనుమానాలు లేవనెత్తారు. ఆయన ఆరోపణలతో లులా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించడానికి అవరోధాలు ఏర్పడ్డాయి. బోల్సోనారో మద్దతుదారులైతే సైనిక తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. దేశంలో సైనిక జోక్యాన్ని ప్రేరేపించేందుకు కూడా బోల్సోనారో మద్దతుదారులు కుట్రలు కూడా పన్నారు. అయితే, అవేవీ లూలా ను అడ్డుకోలేకపోయాయి.

అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బోల్సోనారో జాతీయవాదాన్ని ముందుకు తెచ్చారు. లింగ వ్యతిరేక, ఎల్జీబీటీక్యూ వ్యతిరేక భావజాలాన్ని ప్రోత్సహించారు. ఈయన పదవీ కాలంలో అమెజాన్ రెయిన్‌ఫారెస్టులో అటవీ నిర్మూలన పెరిగింది. స్థానిక భూములు, వ్యక్తులపై హింసాత్మక దాడులు ఎక్కువయ్యాయి. బోల్సోనారో ప్రస్తుతం యూఎస్ఏ లోని ఫ్లోరిడాలో ఉన్నారు.

సీఐటీయూ అంతర్జాతీయ విభాగానికి ఎనలేని సేవలు

- చైనా భాషపై పట్టున్న వ్యక్తి కామ్రేడ్ జానకి బల్లభ్
- ఆయన సేవలు వెలగట్టలేనివి : తపన్‌సేన్



న్యూఢిల్లీ : చైనా భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతిపై సుదీర్ఘకాలం కృషి చేసిన కామ్రేడ్ జానకి బల్లభ్ మృతికి సీఐటీయూ ఘనమైన నివాళి అర్పించింది. తనకున్న అంతర్జాతీయ అనుభవాన్ని సీఐటీయూ కోసం వినియోగించారని, వివిధ దేశాల ట్రేడ్ యూనియన్లతో సంబంధాలు నెరపారని 'సీఐటీయూ' ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. సీఐటీయూ అంతర్జాతీయ విభాగంలో అత్యంత సుదీర్ఘకాలం జానకి బల్లభ్ పనిచేశారని, విభాగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటంలో ఆయన కృషి ఎంతోవుందని తపన్‌సేన్ చెప్పారు. చైనీస్ అనువాద సాహిత్యంలో ఎనలేని సేవలు అందించిన జానకి బల్లభ్ 30 డిసెంబర్ 2022న కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో 94ఏండ్ల వయస్సులో ఆయన చైనాలోనే మృతి చెందారు. దశాబ్దానికిపైగా చైనాలోనే తన కుమారులతో కలిసి ఉంటున్నారు. సీఐటీయూ వర్కింగ్ కమిటీకి ఎన్నికయ్యారు.

ఉత్తరాఖండ్‌కు చెందిన జానకి బల్లభ్ 1956లో చైనాకు వెళ్లారు. అక్కడ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్‌లో పనిచేశారు. చైనీస్ రచనలను హిందీలోకి అనువదించారు. మావో జెడాంగ్‌కు చెందిన 'సెలెక్టెడ్ వర్క్స్', చైనీస్ క్లాసిక్ నవల 'జర్నీ టు ది వెస్ట్', ప్రముఖ చైనీస్ రచయిత లు జున్ రచనల్ని హిందీలోకి అనువదించారు. ఇటీవలి కాలంలో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ పుస్తకం 'ది గవర్నెన్స్ ఆఫ్ చైనా' మొదటి, రెండవ సంపుటాన్ని హిందీలోకి రచించారు.

కామ్రేడ్ బల్లభ్ భారత్‌లోని చైనా రాయబార కార్యాలయంలో పనిచేశారు. ఆ తర్వాత కామ్రేడ్ ఎం.కె.పాండే, సీఐటీయూతో సన్నిహితంగా ఉన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆయనకున్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని 'సీఐటీయూ'లో అంతర్జాతీయ వ్యవహారాల బాధ్యతల్ని అప్పగించారు. కామ్రేడ్ పాండే మార్గదర్శకత్వంలో సీఐటీయూ అంతర్జాతీయ విభాగాన్ని అభివృద్ధి చేశారు. వివిధ దేశాల ట్రేడ్ యూనియన్ ఉద్యమంతో సంబంధాలు ఏర్పరచుకోవడంలో సీఐటీయూకి సహాయం చేశారని బల్లభ్ చేసిన కృషిని సీఐటీయూ గుర్తుచేసుకుంది. ఆయన మృతికి ఘనమైన నివాళి అర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది.

శాటిలైట్ రిమోట్ సెన్సింగ్‌తో రోడ్ల మ్యాపింగ్

ట్రాక్ 'లో రోడ్ల రికార్డులు : ప్రణాళికా సంఘం వైస్‌చైర్మెన్ వినోద్‌కుమార్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్





రాష్ట్రంలోని రోడ్లన్నింటినీ శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సిస్టం(ట్రాక్)తో మ్యాపింగ్ చేయనున్నట్టు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ అదనపు డైరెక్టర్ జనరల్ జి శ్రీనివాస్‌రెడ్డి నేతత్వంలో సైంటిస్టులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయా అంశాలపై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీరాజ్, రోడ్లు - భవనాలు, స్టేట్ హైవేస్, నేషనల్ హైవేస్ వంటి నాలుగు రకాల రోడ్లు ఉన్నాయనీ, ఈ రోడ్ల పొడవు, వెడల్పు స్థితిగతులను, రోడ్డు మార్గమధ్యంలో కల్వర్టులు, బ్రిడ్జిల అవశ్యకతను శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ సిస్టం ద్వారా మ్యాపింగ్ చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా రాష్ట్రస్థాయిలో డబుల్ రోడ్లు, నాలుగు లైన్ల రోడ్లు ఉన్నాయన్నారు.

ప్రతి గ్రామానికి రోడ్డు కనెక్టివిటీ సౌకర్యం ఉందని వివరించారు. భవిష్యత్తులో షార్ట్‌కట్ రోడ్లు కనెక్టివిటీ సిస్టం కోసం శాటిలైట్ మ్యాపింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సిస్టం రోడ్ మ్యాపింగ్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికకు గైడ్‌గా ఉపయోగపడుతుందని అన్నారు. నిర్ణీత గడువులోగా రోడ్డు శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ట్రాక్ సంస్థ ఏడీజీ శ్రీనివాస్‌రెడ్డితోపాటు అధికారులు రాజోజు నరసింహచారి, మోహన్‌రెడ్డి, బాలకష్ణ, గౌతమ్, ప్రకాష్, భాస్కర్‌రెడ్డి, అశ్విన్, కమలాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఎదిరించాలి



- అధికారులు పేదల పక్షాన ఉండాలి: సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా
- కాకి మాధవరావు ఆత్మకథ సంపుటి ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్

రాజ్యాంగంలోని ప్రాథమిక లక్షణాలైన లౌకిక, ప్రజాస్వామిక, సమైక్య, సంక్షేమానికి నేడు ముప్పు వాటిల్లిందని, అందువల్ల అప్రజాస్వామిక.. మతోన్మాద ప్రభుత్వాన్ని ఎదిరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా అన్నారు. మార్క్సిస్టులు అంబేద్కరిస్టులు ఐక్యంగా లాల్ నీల్ జెండాగా కలిసి ఈ ప్రభుత్వాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కులం, వర్గం, పితృస్వామ్యం దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలని, వీటి నిర్మూలనకు స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు రచించిన 'సంకెళ్లను తెంచుకొంటూ' ఆత్మకథ సంపుటి హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై సోమవారం లతా రాజా ఫౌండేషన్, ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హెల్ప్ డెస్క్ నిర్వహణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. కాకి మాధవరావు ఆత్మకథ కోట్లాది మంది జీవిత కథ లేనని అన్నారు. ఆయన జీవిత కథకు తన జీవిత కథకు సామ్యత ఉందన్నారు. విద్య వల్లనే ఎన్నో అవరోధాలను ఎదుర్కొనే శక్తి వచ్చిందని చెప్పారు. శంకరం వంటి అధికారి మాధవరావుకు స్ఫూర్తిప్రధాత అని వివరించారు.

మాధవరావును నాటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని, నేడు సమస్యలపై ప్రశ్నిస్తే వారిని అర్బన్ నక్సలైట్, దేశ ద్రోహిగా ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సర్వీసు అధికారులు వారి ఉనికి కోసం, వారి వారి అవసరాల కోసం కాకుండా పేదల పక్షాన పని చేస్తే దేశంలో ఎన్నో మార్పులు సాధ్యమని, మాధవరావు ఆత్మకథ ఇదే చెబుతుందని తెలిపారు.అధ్యక్షత వహించిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల పట్ల అంకిత భావం ఉన్న అధికారులు ఎలా పని చేయవచ్చన్న దానికి శంకరం మాధవరావు వంటి వారు ఉదాహరణ అన్నారు. రచయిత్రి వోల్గా, ప్రొఫెసర్ హరగోపాల్, సుజాతరావు, సతీష్ చందర్, విద్యా సాగర్ తదితరులు గ్రంథ సమీక్ష చేశారు.

ఎస్‌సీఈఆర్టీ కార్యాచరణ విద్యార్థులకు శరాఘాతం

- విద్యాశాఖ కార్యదర్శికి ఆర్‌యూపీపీటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన 40 రోజుల కార్యాచరణపై అభ్యంతరాలున్నాయని ఆర్‌యూపీపీటీఎస్ తెలిపింది. సీసీఈ నిబంధనలకు విరుద్ధంగా తయారు చేయడం సరైంది కాదని విమర్శించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలకు తేడా ఉంటుందని తెలిపారు. ఎస్‌సీఈఆర్టీ ప్రకటించిన కార్యాచరణ విద్యార్థుల పాలిట శరాఘాతంగా ఉందని విమర్శించారు. ఆదివారం, రెండో శనివారం కూడా వదిలిపెట్టకుండా ఏదో యుద్ధానికి పిల్లలను తయారు చేస్తున్నట్టు సీసీఈ పద్ధతికి వ్యతిరేకంగా ఈ కార్యాచరణ ప్రకటించడాన్ని ఖండించారు. ఉత్సాహపూరిత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు తయారు కావాలనీ, భయం ఉండొద్దని సీసీఈ చెప్తున్నదని గుర్తు చేశారు. పిల్లలకు భయం లేకుండా విరామం ఉండేలా చదువుకునే అవకాశం కల్పించాలని సూచించారు. విద్యార్థుల ఆహారవిషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకే బడులకు రావాలనీ, తిరిగి సాయంత్రం 5.30కు వెళ్లాలని పేర్కొన్నారు. అమ్మాయిలు ఉదయం, సాయంత్రం వారి ఇండ్ల నుంచి రావడం, తిరిగి వెళ్లేందుకు అనేక చోట్ల రక్షణ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వల్పంగా రవాణా సౌకర్యం ఉంటుందనీ, మహిళా ఉపాధ్యాయులు సెలవుల్లో ఒంటరిగా ప్రయాణించడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ కార్యాచరణ మొక్కుబడిగా హడావుడిగా చేసినట్టుగా ఉందనీ, ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతుందని పేర్కొన్నారు. ప్రయివేటు స్కూళ్లను చూసి ప్రభుత్వ బడులు అనుకరిస్తున్నట్టుగా ఉందనీ, ఎక్కడా నాణ్యత కనిపించడం లేదని విమర్శించారు.

ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు కాంగ్రెస్ ప్లీనరీ

- వేదిక కానున్న రాయపూర్...

సీడబ్ల్యూసీ ఎన్నిక...ఆరు అంశాలపై చర్చ : కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ వెల్లడి



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయని కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైరాం రమేష్‌తో కలిసి మాట్లాడారు. ఏఐసీసీ 85వ ప్లీనరీ ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. రాజకీయాలు, ఆర్థికం, అంతర్జాతీయ వ్యవహారాలు, రైతులు, వ్యవసాయం, సామాజిక న్యాయం, సాధికారిత, యువకులకు ఉపాధి కల్పించడం, విద్యకు సంబంధించిన ఆరు అంశాలుపై చర్చ జరుగుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం ప్రకారం ప్లీనరీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)ని ఎన్నుకుంటారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ సవరణలపై కమిటీ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ భద్రతపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మౌనంగా ఉన్నారని విమర్శించారు. అత్యున్నత నిర్ణయాధికారం బాడీ(సీడబ్ల్యూసీ)లో పార్టీ అధ్యక్షుడితో సహా 25 మంది సభ్యులు ఉండగా.. పన్నెండు మందిని పార్టీ అధినేత నామినేట్ చేస్తారు. 12 మందిని ఏఐసీసీ సభ్యులు ఎన్నుకుంటారు. అక్టోబర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 47 మంది సభ్యులతో కూడిన స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

సుప్రీం సమర్థించిందని భావించలేం !

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : పెద్ద నోట్లను రద్దు చేస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు ఈ చర్యను న్యాయ స్థానం సమర్థించినట్లుగా భాష్యం చెప్పలేమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చర్యపై 4:1 మెజారిటీతో ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు, ఇటువంటి నిర్ణయం తీసుకునే చట్టబద్ధమైన హక్కు కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే వుందంటూ దాన్ని ప్రత్యేకంగా పరిగణించింది. 1934 నాటి ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 26(2)ను ఇది ఉల్లంఘించడం లేదని స్పష్టం చేసింది. అయితే పెద్ద నోట్ల రద్దును చేపట్టాలని ఆర్‌బీఐ, ప్రభుత్వానికి సిఫార్సు చేయాలంటూ ఆర్‌బీఐ చట్టంలోని ఈ సెక్షన్ పేర్కొంటోందంటూ సుప్రీం న్యాయమూర్తుల్లో ఒకరు వ్యతిరేక అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆర్‌బీఐ అభిప్రాయాన్ని కోరిన కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అందువల్ల, ఈ నిర్ణయం అమలు చేయడానికి ముందుగా పార్లమెంట్ ఆమోద ముద్రను తీసుకోవాల్సి వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు నిర్ణయానికి, ఆ చర్య వల్ల సాధించాలనుకున్న లక్ష్యాలకు మధ్య సహేతుకమైన సంబంధముందని మెజారిటీ తీర్పు వ్యాఖ్యానించింది. అయితే, ఈ లక్ష్యం నెరవేరిందా లేదా అనేదానితో సంబంధం లేదని పేర్కొంది. ఇటువంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి చట్టబద్ధమైన హక్కు వుందని సమర్థిస్తూ ఇచ్చిన ఈ మెజారిటీ తీర్పు, ఈ నిర్ణయం వల్ల కలిగే ప్రభావం గురించి అస్సలు మాట్లాడలేదు. ఈ పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో కోట్లాదిమంది ప్రజలకు ఉపాధి కలిగించే దేశ అసంఘటిత రంగం తీవ్రంగా విధ్వంసానికి గురైంది. చిన్న తరహా పారిశ్రామిక రంగాన్ని స్తంభింపజేసింది. కోట్లాదిమంది జీవనోపాధులను దెబ్బతీసింది. 2016లో ఈ నిర్ణయం తీసుకున్న ఒక నెలలోనే 82మంది తమ ప్రాణాలు కోల్పోయారని వార్తలందాయి. పైగా, నల్ల ధనాన్ని వెలికి తీయడం, విదేశీ బ్యాంక్‌ల నుండి ఆ మొత్తాలను వెనక్కి రప్పించడం, నకిలీ కరెన్సీ సమస్యను తుదముట్టించడం, తీవ్రవాదానికి నిధులు అందకుండా చేయడం, అవినీతిని నిర్మూలించడం, ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణిని తగ్గించడమన్నవి ఈ వినాశకర నిర్ణయాన్ని సమర్థిస్తూ పేర్కొన్న లక్ష్యాలని, కానీ వాటిల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ప్రజల్లో చలామణిలో వున్న కరెన్సీ, పెద్ద నోట్ల రద్దు సందర్భంగా రూ.17.7లక్షల కోట్ల నుండి ఇప్పుడు రూ.30.88 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్‌బీఐ పేర్కొంది. అంటే 71.84శాతం పెంపు నమోదైంది. సుప్రీంకోర్టు ఇచ్చిన మెజారిటీ తీర్పు, ఇటువంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి గల హక్కును మాత్రమే సమర్థించింది, అంతేకానీ ఇటువంటి నిర్ణయం తీసుకోవడం వల్ల తలెత్తే పర్యవసానాలను ఏ రకంగానూ సమర్థించలేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

మోడీది ప్రయివేటీకరణ.. మాది జాతీయీకరణ...

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తూర్పారబట్టారు. అధికారంలోకి రావడమే బీఆర్‌ఎస్ లక్ష్యం కాదనీ, భారతదేశ పురోగమనాన్ని మార్చడమే తమ అసలు సిసలు లక్ష్యమని తెలిపారు. కొన్ని పార్టీల నేతలు ఎన్నికలు వచ్చినప్పుడు ఏదో చెప్పి పబ్బం గడిపేస్తున్నారని విమర్శించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం మతపిచ్చిని సృష్టిస్తే దేశం ఏమైపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మతవిద్వేషాల వల్ల హత్యాకాండ జరిగితే దేశం, ప్రజలు ఏమైపోవాలి? అని ప్రశ్నించారు. మేక్ ఇన్ ఇండియా అంటూ కొన్ని పార్టీల నేతలు గొంతు చించుకుంటున్నారంటూ బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. చిన్నపిల్లలు ఆడుకునే వస్తువుల నుంచి కరోనా కాలంలో వైద్యులు వేసుకునే కిట్ల వరకు చైనా నుంచే మనకు వస్తున్నాయని గుర్తు చేశారు. దేశంలో వీధివీధికీ ఒక చైనా బజార్లు ఏర్పడ్డాయని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా అనేది నిజమైతే ఇన్ని చైనా బజార్లు ఎందుకు పుట్టుకొచ్చాయని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజకీయాలు అంటే ఒక కార్యాచరణ.. కానీ కొందరు దాన్ని ఆటగా మార్చారంటూ కేసీఆర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని ఉజ్వలంగా తయారు చేయటంలో ఏపీ ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌గా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నామనీ, ఆ ప్లాంటును మోదీ అమ్మితే.. తాము మళ్లీ ప్రభుత్వ రంగంలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. మరోవైపు సంక్రాంతి తర్వాత చాలా రాష్ట్రాల్లో తమ పార్టీ కార్యాచరణను ప్రారంభిస్తామనీ, బీఆర్‌ఎస్‌ను ఉరుకులు పరుగులు పెట్టిస్తామని వ్యాఖ్యానించారు. తమ పార్టీలో చేరిన ఎవరికైనా స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన గౌరవాన్ని ఇస్తామని తెలిపారు. మహారాష్ట్ర, కర్నాటకకు చెందిన పలు సరిహద్దు గ్రామాల ప్రజలు తమ ప్రాంతాలను తెలంగాణలో కలపాలంటూ కోరుతున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో వేల మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే సాధ్యమన్న కేసీఆర్...ఆయా ప్రాంతాలతోపాటు దేశంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ కార్యాచరణను చేపడతామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు దేశాన్ని అన్ని రంగాల్లో దివాళా తీయించారని విమర్శించారు. విద్యుత్, సాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో మనకున్న వనరులు, వాటి పరిస్థితి, వాటిని ఉపయోగించుకోలేని వైనాన్ని ఆయన ఈ సందర్భంగా సోదాహరణంగా వివరించారు. బీఆర్‌ఎస్‌కు అధికారమిస్తే రెండేండ్లలో వెలుగుజిలుగుల భారత్‌ను నిర్మిస్తామని చెప్పారు. దేశం మొత్తం రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం అసాధ్యమేమీ కాదనీ, రూ.1.45 లక్షల కోట్లతో ఆ పని చేయొచ్చని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే దేశం మొత్తం దళితబంధు అమలు చేస్తామని హామీనిచ్చారు. ఆ క్రమంలో ఏటా 25 లక్షల మందికి చొప్పున ఆ పథకాన్ని అమలు చేస్తామని కేసీఆర్ వివరించారు.

ఏపీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్ నియామకం...

ఆంధ్రప్రదేశ్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని కేసీఆర్ ప్రకటించారు. ఢిల్లీ కేంద్రంగా రావెల కిశోర్‌బాబు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. ఏపీలోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని సీఎం వెల్లడించారు.

భగీరథ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ఇంటింటికీ తాగు నీరు ఇస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలి

- ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులివ్వాలి : సీఐటీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించిన భగీరథ కార్మికులు



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

భగీరథ కార్మికులకు కనీస వేతనం, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను మిషన్ భగీరథ కార్మికులు ముట్టడించారు.

ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్మికులు.. పలు డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ.. కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనం రూ. 24 వేల ఇవ్వాలన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఇంటికీ నీరు ఇవ్వకపోతే ఓటు అడగనని హామీ ఇచ్చి రెండో సారి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. కానీ దాని కోసం కష్టపడ్డ కార్మికులకు మాత్రం అరకొర వేతనాలు ఇస్తూ కాంట్రాక్టర్ల ద్వారా ఇష్టానుసారంగా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు వస్తున్న వేతనం అతి తక్కువ ఉండటం వల్ల వారి జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య సమస్యలు వస్తే ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి లేదన్నారు. నిర్ణీత పని గంటలు లేక రోజుకు 12 గంటలు పనిచేయాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పని ఒత్తిడిని తగ్గించడంతో పాటు వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ బృందంతో కలిసి కార్మికులు అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందజేసి, తమ సమస్యలను వివరించారు. సానుకులుంగా స్పందించిన ఆయన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జగదీశ్, ఏ.రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి దివ్య ప్రతాప్, యూనియన్ నాయకులు వెంకటేష్, రవి, యాదయ్య, వెంకటేష్, బాలరాజ్, కార్మికులు పాల్గొన్నారు.

వీఆర్ఏల హామీల అమలుకు కృషి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ-పటాన్‌చెరు

వీఆర్ఏలకు అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయడానికి తమవంతు కృషి చేస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్‌తో కలిసి తమ్మినేని సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో సీఎం ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గతేడాది వీఆర్ఏలు 80 రోజులు సమ్మె చేయగా.. సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ సాక్షిగా సీఎం హామీ ఇచ్చారన్నారు. కాగా ఇప్పటివరకు హామీలు నెరవేర్చలేదని.. వాటి అమలుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన తమ్మినేని.. గత నవంబర్‌లో వీఆర్ఏల సమస్యల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ నాయకులు రవి, లక్ష్మణ్, శ్రీనివాస్, బాల్ రాజ్ వంశీ, జ్యోతి, జయరాజ్, వాజిద్ అలీ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రైతు సేవకే తొలి ప్రాధాన్యమివ్వండి

- క్యాలెండర్ ఆవిష్కరణలో నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతుల సేవకే ఉద్యోగులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు. గత ఎనిమిదేండ్లలో పెరిగిన పంటలు, విస్తీర్ణం, ఉత్పత్తితో మార్కెటింగ్ ఉద్యోగులపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. పంటల కొనుగోళ్లలో మార్కెటింగ్ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో టీఎన్జీవో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం 2023 డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ళ రాజేందర్, ప్రతాప్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అడిషనల్ డైరెక్టర్లు లక్ష్మణుడు, రవికుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షులు చిలక నరసింహారెడ్డి, కార్యదర్శి ఫసుద్దీన్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సెంట్రల్ ఫోరం కార్యవర్గం సభ్యులు, మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎం.శ్రీధర్‌రెడ్డి మృతికి సీఎం కేసీఆర్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, ఉస్మానియా యూనివర్సిటీ నాటి విద్యార్థి సంఘం నేత ఎం.శ్రీధర్ రెడ్డి మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి, మలి దశల్లో తెలంగాణ ఉద్యమానికి శ్రీధర్ రెడ్డి చేసిన కృషిని స్మరించుకున్నారు. తాను నమ్మిన విలువల కోసం శ్రీధర్‌రెడ్డి కట్టుబడి, రాజీపడకుండా పనిచేశారని గుర్తుచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీధర్‌రెడ్డి మృతిపట్ల టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె.కేశవరావు, టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మలి విడత ఉద్యమం లోనూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో శ్రీధర్‌రెడ్డి తనదైన పాత్ర పోషించారని కేకే పేర్కొన్నారు. తనపై ఆయన ప్రభావం ఉందని తెలిపారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితులకు రిమాండ్ పొడిగింపు

- జనవరి 5న అనుబంధ చార్జిషీటు దాఖలు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టు అయిన శరత్ చంద్రా రెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్ బాబు, విజయ్ నాయర్లకు రౌస్ ఎవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టు మరో ఏడు రోజుల జ్యూడీషియల్ రిమాండ్ పొడిగించింది. మద్యం కుంభకోణంలో ఈడీ, సీబీఐ అరెస్ట్ చేసిన ఈ నలుగురు నిందితులు ప్రస్తుతం తీహార్ జైల్‌లో ఉన్నారు. గతంలో కోర్టు ఈ నలుగురికి విధించిన జ్యూడీషియల్ రిమాండ్ సోమవారంతో ముగిసింది. దీంతో శరత్ చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, విజయ్ నాయర్‌లను ఈడీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబిఐ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకె నాగ్‌పాల్ ముందు హాజరుపరిచారు. ఈడి తరపు సీనియర్ అడ్వకేట్ నవీన్ కుమార్ మట్ట వాదనలు వినిపిస్తూ దర్యాప్తు కీలక దశకు చేరుకున్నదనీ, దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని నివేదించారు. నిందితులు కస్టడీలో అనేక విషయాలపై స్పష్టత ఇచ్చారనీ, ఈ కేసు దర్యాప్తు కీలకంగా సాగుతున్నదనీ, రిమాండ్ పొడిగించాలని కోరారు. దీంతో నలుగురు నిందితులకు మరో ఏడు రోజుల పాటు జ్యూడీషియల్ కస్టడీ పొడిగించారు. తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా వేశారు.

5న అనుబంధ చార్జిషీటు

జనవరి 5న మనీ లాండరింగ్ కేసులో అనుబంధ (సప్లిమెంటరీ) చార్జిషీటు దాఖలు చేయనున్నట్టు ఈడీ తరపు న్యాయవాది తెలిపారు. అయితే నిందితులపై విడివిడిగా కాకుండా అందరిపై ఒకే చార్జిషీటు దాఖలు చేయనున్నట్టు తెలిసింది. మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో తొలుత అరెస్ట్ అయిన సమీర్ మహేంద్రుపై గతేడాది నవంబర్ 26న ఈడీ తొలి చార్జిషీటు దాఖలు చేసింది. ఈ చార్జిషీటును డిసెంబర్ 20న సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకున్నది.

తెలంగాణలో నిరుద్యోగ రేటు 4.1 శాతం

- పది నెలల్లో అత్యంత తక్కువగా నమోదు : సీఎంఐఈ స్పష్టం

న్యూఢిల్లీ : డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు 4.1 శాతం నమోదు అయిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తెలిపింది. ఈ మేరకు సీఎంఐఈ దేశంలోని అన్ని రాష్ట్రాల నిరుద్యోగ రేటును ప్రకటించింది. తెలంగాణలో డిసెంబర్ నెలలో 4.1 శాతం నిరుద్యోగ రేటు నమోదు అయిందనీ, ఇది గత పది నెలల్లో అత్యంత తక్కువగా నమోదు అని పేర్కొంది. నవంబర్‌లో 6 శాతం నమోదు అయిన నిరుద్యోగ రేటు, డిసెంబర్ నాటికి 4.1 శాతానికి తగ్గిందని తెలిపింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ రేటు 7.7 శాతం నమోదు అయింది. అయితే గతనెల నవంబర్ కంటే డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు తగ్గిందని పేర్కొంది. ఏపీలో గతనెల నవంబర్‌లో 9 శాతం నిరుద్యోగ రేటు నమోదు అయిందని తెలిపింది.

CMIE

ఎక్కడికక్కడ సర్పంచుల అరెస్ట్

పోలీసు స్టేషన్లకు కాంగ్రెస్ నాయకుల తరలింపు

- దిష్టిబొమ్మలు దహనం

గ్రామపంచాయతీల నిధుల మళ్లింపుకు నిరసనగా.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌లు సోమవారం చేపట్టిన చలో ఇందిరాపార్కు ధర్నాకు వెళ్లకుండా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. జిల్లాల్లో ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. అదేవిధంగా, వారికి మద్దతుగా ధర్నాకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. ఈ క్రమంలో పలుచోట్ల తోపులాట జరిగింది. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు.



నవతెలంగాణ- విలేకరులు

వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పెద్దపల్లి జిల్లా ఓదెల, జూలపల్లి, రామగిరి ఎలిగేడ్, మంథని, సిరిసిల్ల జిల్లా కొనరావుపేట, కరీంనగర్ జిల్లాలోని గంగాధర, హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల్లో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

సర్పంచుల పెండింగ్ బిల్లులు రిలీజ్ చేయాలని వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు పట్టణంలో నిరసన తెలిపిన కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. పెబ్బేరు నుంచి ధర్నాకు వెళుతున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఇందుకు నిరసనగా నేతలు స్టేషన్‌లో బైటాయించారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ పార్టీ రాములు యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

గ్రామపంచాయతీల నిధుల సమస్యపై కాంగ్రెస్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లో జిల్లా కేంద్రంలో పోలీసుల తీరును నిరసిస్తూ బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేసే యత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల తీరును ఖండిస్తూ నాయకులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కాగజ్‌నగర్‌లో ధర్నాకు వెళ్లకుండా కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ముందస్తు అరెస్టులను నిరసిస్తూ ఉట్నూర్ మండల కేంద్రంలో టీపీసీసీ కార్యదర్శి వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రామకృష్ణాపూర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సర్పంచుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండల సర్పంచులు వెళ్తుండగా అరెస్టు చేశారు.

అనంతరం విడుదలైన వారు ఇందిరాపార్కు వద్ద ధర్నాకు తరలివెళ్లారు. నల్లగొండ జిల్లా క్లాక్ టవర్ సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. పెద్దవూర, తిరుమలగిరిసాగర్, చిట్యాల మండల సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, సూర్యాపేట మండలాలకు చెందిన సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కార్పొరేటర్ విజయారెడ్డిని బంజారాహిల్స్‌లో అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అక్కడ ఆమె నిరసన తెలిపారు. తనతో ఇన్‌స్పెక్టర్ దురుసుగా మాట్లాడారని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ సి.రోహిన్ రెడ్డిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేటలోని అల్కపురికాలనీలో దేప భాస్కర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో ములుగు-పరకాల ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో దహనం చేశారు.

స్త్రీ, శిశు సంక్షేమ అధికారి పోస్టులకు నేడు రాతపరీక్ష

- 75 కేంద్రాలు ఏర్పాటు: టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో స్త్రీ, శిశు సంక్షేమ అధికారి పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్ష మంగళవారం జరగనుంది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 17 జిల్లాల్లో 75 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పోస్టులకు 19,812 మంది దరఖాస్తు చేశారని వివరించారు. 13,954 మంది ఇప్పటి వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.15, మధ్యాహ్నం 2.15 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నియోజకవర్గాల ముఖ్యనేతతో తరుణ్‌చుగ్, బన్సల్ వీడియోకాన్ఫరెన్స్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల ముఖ్య నేతలతో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీలు సునీల్ బన్సాల్, తరుణ్‌చుగ్ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, ఐటీ సెల్ కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పాలక్, ప్రభారీలు, కన్వీనర్లు, విస్తారక్‌లతో వేర్వేరుగా వర్చువల్ సమావేశాలను చేపట్టారు. ఈ నెల ఏడోతేదీన చేపట్టే 34,600 బూత్ కమిటీలకు చెందిన 7,26,600 మందితో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా నిర్వహించనున్న వర్చువల్ సమావేశంపై ప్రధానంగా చర్చించారు. పలు సూచనలు చేశారు. సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దుగ్యాల ప్రదీప్‌కుమార్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శృతి, తదితరులు పాల్గొన్నారు.

ఫౌవేసియాను సొంతం చేసుకున్న టఫే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఫ్రెంచ్ అంతర్జాతీయ ఆటోమోటివ్ సరఫరాదారు ఫోర్వియాకు భారతీయ ఇంటీరియర్ సిస్టమ్స్ వ్యాపారం చేసే ఫౌవేసియాను టఫె సొంతం చేసుకున్నది. ఇటీవల ముగిసిన ఒప్పందంలో భాగంగా భారతదేశంలో ఆటోమోటివ్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ ఆటోమోటివ్ ఇంజినీర్డ్ ప్లాస్టిక్ విడిభాగాలను అందించే సుప్రసిద్ధ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ వ్యాపార సంస్థగా గుర్తింపు పొందిన అంతర్జాతీయ ట్రాక్టర్ సంస్థ అయిన టఫె ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్.. మోబిక్ కియాబీ, మోబిస్-హ్యుందాయ్, ఫోక్స్‌వేగన్, ఎఫ్‌సీఏ, టాటా సహా సుప్రసిద్ధ ఆటోమోటివ్ సంస్థలకు సేవలందించే ఫోర్వియా యొక్క భారతీయ ఇంటీరియర్ బిజినెస్ ఫౌవేసియాను సొంతం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా మహారాష్ట్రలోని చకన్, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ మరియు తమిళనాడులో ఉన్న ఫౌవేసియా యూనిట్లు కూడా టఫె వశం కానున్నాయి. టఫె చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికా శ్రీనివాసన్ మాట్లాడుతూ.. "ఈ విలీనం అందించే శక్తివంతమైన సమన్వయ అవకాశాలతో టఫె మరింత ముందుకెళ్లనున్నది. మా వినియోగదారులతో మా బంధానికి మేము అత్యున్నత సేవలను అందిస్తున్నాం. వారు అందిస్తున్న ప్రోత్సాహం, మద్దతుకు ధన్యవాదాలు. డిజైన్‌లో అత్యున్నత నాణ్యత ప్రమాణాల దిశగా మా వినియోగదారులకు కట్టుబడి ఉంటామని పునరుద్ఘాటిస్తున్నాను. సాంకేతికత, ఆవిష్కరణ, తయారీ పరంగా శ్రేష్టతలు మా ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లనున్నాయి" అని అన్నారు.

కేరళ సీపీఐ(ఎం) నేతపై ఫేక్ న్యూస్

- అయ్యప్పను అవమానించాడన్న ఇండియా టుడే
- ట్వీట్‌ను ఆలస్యంగా తొలగించిన ఛానెల్

న్యూఢిల్లీ : దేశంలోని ప్రముఖ ఇంగ్లీష్ టీవి ఛానల్ ఫేక్‌న్యూస్‌ను ప్రసారం చేసింది. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం రావులపల్లిలో శబరిమల అయ్యప్పపై వివాదాస్పద ప్రసంగం చేసిన నాస్తిక సమాజం నేతని కేరళకు చెందిన సీపీఐ(ఎం) నేతగా ఇండియా టుడే న్యూస్ ఛానల్ తప్పుగా ప్రసారం చేసింది. అయ్యప్ప జననంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ కేరళకు చెందిన సీపీఐ(ఎం) నేతగా చిత్రీకరించారు. ఇండియా టుడే ఛానెల్ ఈ ఫేక్ న్యూస్‌ను ఇంగ్లీష్ న్యూస్ బులెటిన్‌లో ప్రసారం చేసిన వీడియోను ట్వీట్ కూడా చేసింది. కేరళలో బైరి నరేష్ అనే సీపీఐ(ఎం) నాయకుడు లేడనీ, కేరళకు చెందిన సీపీఐ(ఎం) కార్యకర్తలతో పాటు పలువురు ట్విట్టర్‌లో స్పందించారు.

అయితే ఛానెల్ వార్తను సరిచేయలేదు. ఇంతలో బీజేపీ అనుకూల సోషల్ మీడియా ఖాతాలతో ఈ అబద్ధం దేశవ్యాప్తంగా వ్యాపించింది. ఛానెల్ వీడియోను అప్‌లోడ్ చేసి ప్రచారం చేస్తోంది. ట్వీట్ చాలా ఆలస్యంగా తొలగించబడినప్పటికీ, ఈ ఫేక్‌న్యూస్ ప్రసారంపై ఇండియా టుడే ఛానెల్ ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు. బైరి నరేష్‌కి కేరళతో, సిపిఎంతో ఎటువంటి సంబంధం లేకపోయినా, ఆయనను సీపీఐ(ఎం) కేరళ లీడర్‌గా ఇండియా టుడే ఛానెల్ ప్రసారం చేసింది. ఇది ఎలా జరిగిందనే దానిపై ఛానెల్ ఇంకా వివరణ ఇవ్వలేదు.

సమిష్టిగా పనిచేయండి

వినూత్నంగా ఆలోచించండి

- ఆర్టీసీ అభివృద్ధికి సహకరించండి:
- ఉద్యోగులతో ఎమ్‌డీ సజ్జనార్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సమిష్టితత్వం, వినూత్న ఆలోచనలతో ఆర్టీసీని అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఎవరూ తమ శక్తి సామర్థ్యాలను తక్కువ అంచనా వేసుకోవద్దని చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం బస్‌భవన్‌లో ఆయన కేక్‌కటింగ్ చేశారు. గత ఏడాది ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు ఇచ్చిన సలహాలు, సూచనలతోనే సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. కొత్త సంవత్సరంలో సంస్థ సాధించాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. సాంకేతికత నుంచి తప్పించుకునే పరిస్థితులు ప్రస్తుతం లేవని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. ఆర్టీసీకి భవిష్యత్‌లో ఐటీ, ఇంజనీరింగ్ విభాగాలు కీలకం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీవోవో డాక్టర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వినోద్ కుమార్, మునిశేఖర్, మెడికల్ అడ్వైజర్ సైదిరెడ్డి, సీఎంఈ రఘునాథ రావు, సీటీఎం జీవన్‌ప్రసాద్, సీటీఎం (మార్కెటింగ్ అండ్ కమర్షియల్) విజయ్‌కుమార్, సీసీవోఎస్ విజయ భాస్కర్, సి.ఇ (ఐటీ) రాజశేఖర్, సీఎఫ్ఎం విజయపుష్ప తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోడీ "ప్రతిభ"

మనం ఎక్కడ ఉన్నాం, ఎంత ఎదగాలి? "ఆసియా-పసిఫిక్ కరెన్సీలో ఉత్తమ ప్రతిభ చూపుతున్న రూపాయి". 2014 మే 25వ తేదీన టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ఒక విశ్లేషణకు పెట్టిన శీర్షిక ఇది. అదే పత్రిక 2022 డిసెంబరు 30వ తేదీన "ఆసియన్ కరెన్సీలో చెత్త ప్రదర్శనతో ముగిసిన రూపాయి" అనే శీర్షికతో వార్తను ఇచ్చింది. నాడు వార్త రాసినప్పుడు

> మన్మోహన్‌సింగ్ పాలనలో 2013లో మన కరెన్సీ విలువ దారుణంగా పతనమైంది. ఆ తరువాత 2022లో 11.3శాతం పతనంతో నరేంద్ర మోడీ తనదైన రికార్డు నెలకొల్పారు. వచ్చే ఏడాది కొంత మేర విలువ పెరగవచ్చనే ఆశాభావంతో పాటు ఇంకా పతనం కావచ్చనే హెచ్చరికలూ వెలువడుతున్నాయి. మన దేశం అమెరికా, చైనాలను దాటి వద్ధి సాధించేందుకు పోటీ పడాలని ఎవరైనా కోరుకోవటం తప్పు కాదు. కానీ మనం ఎక్కడ ఉన్నాం, ఎంత ఎదగాలి?

డాలరుకు రూపాయి మారకం రేటు రూ.58.52 కాగా 2022 డిసెంబరు 30న ముగిసిన రేటు రూ.82.72. ఎంత పతనం?

2014 జనవరి ప్రారంభంలో రూ.61.80గా ఉన్న రూపాయి విలువ కొత్త ప్రభుత్వం వస్తుందన్న ఉల్లాసం, విదేశాల నుంచి డాలర్ల ప్రవాహంతో ఆరు నెలల్లో 58.52కు పెరిగింది, 328 పైసలు లాభపడింది. అలాంటి ఉల్లాసానికి కారకుడైన నరేంద్ర మోడీ ఏలుబడిలో ఇప్పటికి 2,420 పైసల నీరసం మిగిలింది. గతేడాది చివరిలో రూ.74.33గా ఉన్నది కాస్తా పన్నెండు నెలల్లో రూ.82.72కు అంటే 839 పైసలు దిగజారింది. రూపాయి పతనంతో దిగుమతులు భారమై కష్టాలు పెరిగాయి. పోనీ వాటికి విరుగుడుగా తన పలుకుబడితో ఎగుమతులు పెంచారా అంటే అదీ లేదు.

మన్మోహన్‌సింగ్ పాలనలో 2013లో మన కరెన్సీ విలువ దారుణంగా పతనమైంది. ఆ తరువాత 2022లో 11.3శాతం పతనంతో నరేంద్ర మోడీ తనదైన రికార్డు నెలకొల్పారు. వచ్చే ఏడాది కొంత మేర విలువ పెరగవచ్చనే ఆశాభావంతో పాటు ఇంకా పతనం కావచ్చనే హెచ్చరికలూ వెలువడుతున్నాయి. జనవరి-మార్చి నెలల్లో రూ.81.50 నుంచి 83.50 మధ్య రూపాయి విలువ ఉండవచ్చని కొందరి అంచనా. తీవ్రమైన అనిశ్చితి. ధనిక దేశాల్లో మాంద్య తీవ్రత ఎలా ఉంటుంది, ఎంత కాలం కొనసాగుతుంది అన్నది ఎవరికీ అంతుబట్టటం లేదు. ఇప్పటికే మన ఎగుమతులు అధోముఖంగా ఉన్నాయి.




నరేంద్ర మోడీ పాలన పదవ ఏటలో ప్రవేశించే ముందు రూపాయి పతనంలోనే కాదు, ఇంకా అనేక రికార్డులు నెలకొల్పుతున్నారు. 2022-23వ సంవత్సరం రెండవ త్రైమాస కాలం (జులై-సెప్టెంబరు)లో దిగుమతులు-ఎగుమతుల్లో (దీనిని కరంట్ ఖాతా అంటారు) 36.4బిలియన్ డాలర్లు లోటు ఉంది. ఇది జీడీపీలో 4.4శాతానికి సమానం. గతేడాది ఇదే కాలంలో ఉన్న లోటు 9.7బి.డాలర్లు మాత్రమే. మన దేశం నుంచి వస్తువులతో పాటు సేవల ఎగుమతులు కూడా ఉన్నాయి. వస్తు లావాదేవీల లోటు గతేడాది 44.5 బి.డాలర్లు కాగా ఈ ఏడాది 83.5 బి.డాలర్లకు పెరిగింది. వస్తు సేవలకు సంబంధించి మిగులు 25.6 నుంచి 34.4బి.డాలర్లకు పెరిగింది. ఇది కాస్త ఊరట కలిగిస్తోంది. 2012లో అక్టోబరు-డిసెంబరు మాసాల్లో వాణిజ్యలోటు 32.6 బి.డాలర్లు ఒక రికార్డు కాగా నరేంద్రమోడీ దాన్ని బద్దలు కొట్టారు. ఈ ఏడాది అక్టోబరు-డిసెంబరు వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. సెప్టెంబరు తరువాత పరిస్థితి దిగజారింది తప్ప మెరుగుపడింది లేదు.

డిసెంబరు 15న కేంద్ర ప్రభుత్వం వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఎగుమతి-దిగుమతి లావాదేవీల వివరాలను వెల్లడించింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మన ఎగుమతులు 424.45 నుంచి 499.67 బి.డాలర్లకు (17.72 శాతం) పెరగ్గా దిగుమతులు 471.68 నుంచి 610.7 బి.డాలర్లకు (29.47 శాతం) పెరిగాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో తొలి ఎనిమిది నెలల్లో మన వాణిజ్యలోటు అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 47.23 నుంచి 111.02 బి.డాలర్లకు పెరిగింది. 2022 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యలోటు అంతకు ముందు ఏడాదితో పోల్చితే 102.63 బి.డాలర్ల నుంచి 192.41 బి.డాలర్లకు పెరిగింది. ఈ లెక్కన 2023 మార్చితో ముగిసే సంవత్సరంలో ఎంతకు చేరుతుందో చూడాల్సి ఉంది.

ప్రకటిత లక్ష్యం కనుచూపు మేరలో కనిపించకున్నా ఇంకా మన నేతలు 2025 నాటికి దేశ జీడీపీని ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామని చెబుతూనే ఉన్నారు. శుక్రవారం నాడు విదేశాంగ మంత్రి జైశంకర్ సైప్రస్‌లో మాట్లాడుతూ ఇదే చెప్పారు. 2025 మార్చి నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు, 2033-34 నాటికి పది లక్షల కోట్ల డాలర్ల సాధిస్తామని 2019లో ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. ప్రస్తుత అంచనా 2022 ప్రకారం 3.3లక్షల కోట్ల డాలర్లు. కరోనా తదితర కారణాలను చూపుతూ 2025 గడువును 2027కు పెంచినట్లు కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ చెప్పారు. వచ్చే ఐదు సంవత్సరాల పాటు సగటున ఏటా తొమ్మిది శాతం వృద్ధి సాధిస్తే 2028-29నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లను సాధించగలమని రిజర్వుబాంకు మాజీ గవర్నర్ డి.సుబ్బారావు 2022 ఆగస్టులో చెప్పారు. ఇలా ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ తమ సంపదల మాదిరి దేశ జీడీపీ కూడా పెరుగుతుందని జనాన్ని నమ్మమంటున్నారు. ప్రపంచ జీడీపీలో మొత్తం సంపదలో చూస్తే అగ్ర స్థానంలో ఉన్న అమెరికా తలసరి జీడీపీలో ఏడవ స్థానంలో ఉంది. రెండవదిగా ఉన్న చైనా 77వ స్థానం, ఐదవదిగా ఉన్న మన దేశం 128వదిగా ఉంది. మన దేశం అమెరికా, చైనాలను దాటి వద్ధి సాధించేందుకు పోటీ పడాలని ఎవరైనా కోరుకోవటం తప్పు కాదు. కానీ మనం ఎక్కడ ఉన్నాం, ఎంత ఎదగాలి?

వ్యవసాయ సంక్షోభం - సామ్రాజ్యవాదం



ప్రభాత్‌పట్నాయక్

దక్షిణాది భూగోళంలోని వర్ధమాన దేశాల్లో ఉత్పన్నమయ్యే వ్యవసాయ సంక్షోభానికి సామ్రాజ్యవాదపు ఆధిపత్యంతో అనివార్యమైన లింకు ఉంది. ఇంకోవిధంగా చెప్పాలంటే... ఇక్కడ తలెత్తే వ్యవసాయ సంక్షోభం సామ్రాజ్యవాదపు ఆధిపత్యానికి మరో ముఖం మాత్రమే. మన దేశ వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే ఇది స్పష్టంగా కనిపిస్తుంది. మన దేశం వలస పాలనలో మగ్గుతున్న కాలంలో వ్యవసాయ సంక్షోభం నిరంతరమూ కొనసాగుతూనే ఉండేది. పదే పదే తలెత్తే కరువుల రూపంలో ఇది వ్యక్తం అయేది. 1765లో మొఘల్ చక్రవర్తి షా ఆలం నుండి బెంగాల్ ప్రాంతంలో భూమి శిస్తు వసూలు చేసే హక్కును ఈస్ట్ ఇండియా కంపెనీ కొనుక్కుంది. ఐదేండ్లు తిరిగేసరికి, 1770 నాటికల్లా బెంగాల్ కరువులతో నాశనం అయిపోయింది. 1770 నాటి కరువులో కంపెనీ అధికారుల అంచనాలను బట్టే ఒక కోటి మంది బెంగాల్ ప్రజలు మరణించారు. అప్పటి బెంగాల్ మొత్తం జనాభాయే 3కోట్లు! బహుశా ప్రపంచ చరిత్రలోనే ఇది అత్యంత భయంకరమైన కరువుగా పేర్కొనవచ్చు. బ్రిటిష్ వాళ్ళ పాలన ముగింపునకు వస్తున్న

> నయా ఉదారవాద విధానాల అమలు మొదలైంది. నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం అంటేనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని అంగీకరించి దానికి లోబడి వ్యవహరించడం. ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో భారత దేశపు పెట్టుబడిదారీ వర్గం సన్నిహితంగా కలిసిపోయి వ్యవహరిస్తోంది. దాంతో పరిస్థితులు మారిపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మీద సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల ఆధిపత్యం మళ్ళీ మొదలైంది. దాంతోబాటు వ్యవసాయ సంక్షోభమూ మొదలైంది.

కాలంలో, 1943-44 నాటి బెంగాల్ కరువులో 30లక్షల మందికి పైగా మరణించారు.

బ్రిటిష్ పాలన మొదలయ్యేటప్పటి కరువుకు కారణం కంపెనీ విధించిన అత్యధికమైన భూమి శిస్తు. మళ్ళీ బ్రిటిష్ పాలన ముగిసే ముందటి కరువుకు కూడా కారణం అప్పటి ప్రభుత్వం ప్రజల నుండి అత్యధికంగా వివిధరూపాల్లో వసూలు చేసిన పన్నులు, మోపిన భారాలు. విపరీతమైనలోటు బడ్జెట్ కారణంగా పెద్దఎత్తున తలెత్తిన ద్రవ్యోల్బణం ఒకవైపు, దక్షిణాసియాలో ఆనాడు మిత్ర రాజ్యాల కూటమి సాగిస్తున్న యుద్ధానికి కావలసిన నిధుల కోసం ప్రజల మీద మోపిన అదనపు భారాలు మరోవైపు ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేశాయి. ఇక కరువు అనేది ఎప్పుడొచ్చినా, దానికి ముందు బలి అయేది గ్రామీణ పేదలే కదా! అందులో ముఖ్యంగా పేదరైతులు, వ్యవసాయ కూలీలు బలిపశువులవుతారు. ఈ కరువు భారాలతోబాటు, వలస పాలనలో రుణభారం, దారిద్ర్యం, ఉన్న భూములను కోల్పోవడం అనేవి పరిపాటి అయిపోయాయి.

ఈ విధమైన క్రూర పాలన వలస పాలకులకు యాదృచ్ఛికంగా సంక్రమించిన లక్షణం కాదు. బ్రిటన్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడానికి, ఇక్కడ సాగిన క్రూర దోపిడీకి లింకు ఉంది. ఇది బ్రిటన్ కే కాదు, తక్కిన సామ్రాజ్యవాద దేశాల విషయంలోనూ వర్తిస్తుంది. ఆ దేశాలలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందాలంటే అందుకు వివిధ రకాల ముడిసరుకులు, ఆహారధాన్యాలు అవసరం. అవి ఆ దేశాల భూముల్లో పండవు. కొన్ని రకాల పంటలను అక్కడ పండించినా, అవి అన్ని కాలాల్లోనూ అక్కడ పండవు, పండినా, ఆ పంటలు వాళ్ళ అవసరాలకు చాలవు.

ప్రపంచంలో మనకు తెలిసిన చమురు నిల్వలలో కేవలం 11శాతం మాత్రమే శీతల దేశాల్లో ఉన్నాయి. కాని ఆ ప్రాంతమే ప్రపంచ పెట్టుబడికి కేంద్ర స్థానంగా ఉంది. ఆ విషయం గురించి మనం తరచూ మాట్లాడుకుంటాం. కాని ఆ దేశాలు వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తుల కోసం తక్కిన ప్రపంచంలోని ఉష్ణ, సమశీతోష్ణ ప్రాంతాల మీద ఆధారపడి ఉన్నాయన్న వాస్తవాన్ని పెద్దగా పట్టించుకోం.

18వ శతాబ్దం రెండో భాగంలోను, 19వ శతాబ్దం మొదటి భాగంలోను సంభవించిన పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధిపత్యం సాధించగలిగింది. అప్పుడు పరిశ్రమలకు కేంద్ర స్థానంలో జౌళి పరిశ్రమ ఉండేది. ఆనాటి పారిశ్రామిక విప్లవానికి మొనగాడుగా ఉండిన బ్రిటన్‌లో అసలు పత్తి అనేది పండనే పండదు! ఉష్ణ, సమశీతోష్ణ ప్రదేశాల నుండి పత్తిని బ్రిటన్ దిగుమతి చేసుకోవలసి వచ్చేది. తమ దిగుమతి అవసరాలను ఆ ఉష్ణ, సమశీతోష్ణ ప్రాంతాలలోని దేశాలు తీర్చాలంటే ముందు ఆ దేశాల్లో వ్యవసాయంలో సరుకుల ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టవలసిన అగత్యం బ్రిటన్‌కు ఏర్పడింది. సరుకుల ఉత్పత్తి విధానం అంటే అన్నింటికన్నా ముందు మార్కెట్ సంకేతాలను బట్టి ఉత్పత్తికి సంబంధించిన నిర్ణయాలు జరగడం. స్థానికంగా ఆయా దేశాల ఆహార లభ్యత, అక్కడి ప్రజల అవసరాలు అనేవాటితో ఈ నిర్ణయాలకు ఏ మాత్రమూ సంబంధం ఉండదు. ముందు మార్కెట్‌కు అవసరమైన (సంపన్న దేశాలలోని పెట్టుబడిదారులకు అవసరమైన) సరుకుల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి, ఇంకా మిగిలిన భూభాగంలో మాత్రమే ఆ యా దేశాల స్థానిక అవసరాలను తీర్చే ఉత్పత్తులను (ఆహార ధాన్యాలను) పండించాలి.

వలస పాలనలో అమలు జరిపిన పన్నుల విధానంతో ఈ రెండు లక్ష్యాలనూ సామ్రాజ్యవాదులు సాధించు కోగలిగారు. అంతకు మునుపు మొఘల్ చక్రవర్తుల పాలనలో పండిన పంటలో ఒక భాగం పన్నుగా వసూలు చేసే పద్ధతి ఉండేది. డబ్బు రూపంలో చెల్లించాలన్న నిబంధన ఉండేది కాదు. ఆ తర్వాత వలస పాలనలో డబ్బు రూపంలో భూమిశిస్తు చెల్లించాలన్న నిబంధనను ఖచ్చితంగా అమలు చేశారు. దాంతో రైతులు వడ్డీ వ్యాపారుల నుండి రుణాలు తీసుకుని భూమి శిస్తు చెల్లించడం మొదలుపెట్టారు. ఆ వడ్డీ వ్యాపారులు రైతులకు రుణాలు ఇచ్చేటప్పుడే దానిని తిరిగి చెల్లించడానికి ఏ పంట పండించాలో ముందే షరతు పెట్టేవారు. ఆ పంటకు చెల్లించే రేటును కూడా ముందే నిర్ణయించేవారు. ఆ విధంగా వ్యవసాయంలో సరుకుల ఉత్పత్తి క్రమం ఈ దేశంలో ప్రవేశించింది. ఈ పని నేరుగా వలస పాలకులు చేయలేదు. వ్యాపారుల ద్వారా చేయించారు. ఆ వ్యాపారులు మార్కెట్ సంకేతాలకు అనుగుణంగా వ్యవహరించడం జరిగేది. అదే సమయంలో రైతుల మీద

> మోడీ ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ వత్తిడికి అనుగుణంగా మార్పులు చేయడానికి పూనుకుంది. దానికి తోడు కరోనా మహమ్మారి ఆవరించడంతో తన పని తేలికగా అయిపోతుందని అనుకుంది. అందకోసమే హడావుడిగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలనూ తీసుకొచ్చింది. ఆ చట్టాల ద్వారా ఆహార ధాన్యాలకు మద్దతు ధరను గ్యారంటీ చేసే విధానం రద్దు అయిపోయి వ్యవసాయరంగ కార్పొరేటీకరణకు మార్గం సుగమం అయిపోతుందని తలిచింది.కాని ఈ దేశ రైతాంగం పట్టుదలగా సాగించిన పోరాటం మోడీ ప్రభుత్వ కుట్రలను సాగనివ్వలేదు. ఇప్పుడు ప్రభుత్వం వెనిక్క తగ్గడం కేవలం తాత్కాలిక ఎత్తుగడ మాత్రమే. నయా ఉదారవాద విధానాల అమలుకు మోడీ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడివుంది. అందుచేత వ్యవసాయ సంక్షోభం నుండి బైట పడాలన్నా, ఆహార భద్రతను కాపాడుకోవాలన్నా, దేశ రైతాంగం సామ్రాజ్యవాదుల డిమాండ్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఎక్కుపెట్టక తప్పదు.

పన్నుల భారాన్ని విపరీతంగా పెంచారు. మరోవైపు పెట్టుబడిదారీ దేశాల నుండి యంత్రాల మీద తయారైన ఉత్పత్తులు పెద్దఎత్తున మన దేశంలోకి దిగుమతి కావడంతో ఇక్కడి స్థానిక వృత్తులన్నీ దెబ్బ తిన్నాయి. దేశీయ పరిశ్రమలు చితికిపోయాయి. దాని ప్రభావం వలన ప్రజల కొనుగోలుశక్తి బాగా క్షీణించింది. అందువలన ఇక్కడ సరుకులు అమ్ముడుపోవడం తగ్గిపోయింది. అప్పుడు సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు ఇక్కడి నుంచి కావలసిన ముడిసరుకులను కారుచవకగా పట్టుకుపోవడానికి మార్గం తేలికైపోయింది. ఆ విధంగా ఇక్కడ అనుసరించిన పన్నుల విధానం ద్వారా వలస పాలకులు తమ లక్ష్యాలను నెరవేర్చుకున్నారు.

వలసపాలన అంతం కావడంతో ఈ ఏర్పాటు కొనసాగడానికి వీలు లేకుండా పోయింది. దానికి తోడు కొత్తగా ఏర్పడిన స్వతంత్ర ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో పోషించిన పాత్ర ఇక్కడ చిరకాలంగా కొనసాగిన వ్యవసాయ సంక్షోభం బారి నుండి రైతాంగానికి ఊరట కల్పించింది.



అయితే భూ కేంద్రీకరణ మాత్రం దాదాపు అదే విధంగా కొనసాగింది. ఇక్కడ భూస్వాములు చాలామంది పెట్టుబడిదారీ భూస్వాములుగా పరిణామం చెందారు (ప్రష్యాలోని భూకామందుల మాదిరిగా). రైతాంగం మీద సాగిన దోపిడీ మాత్రం కొనసాగింది. కాని వ్యవసాయ సంక్షోభ లక్షణాలైన నిరంతర కరువులు, నడ్డి విరిగే రుణ భారం, పట్టణాలకు వలసలు పోవడం, సామూహిక ఆత్మహత్యలు వంటివి ఆ కాలంలో ఆగిపోయాయి.

ఆ తర్వాత నయా ఉదారవాద విధానాల అమలు మొదలైంది. నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం అంటేనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని అంగీకరించి దానికి లోబడి వ్యవహరించడం. ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో భారత దేశపు పెట్టుబడిదారీ వర్గం సన్నిహితంగా కలిసిపోయి వ్యవహరిస్తోంది. దాంతో పరిస్థితులు మారిపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మీద సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల ఆధిపత్యం మళ్ళీ మొదలైంది. దాంతోబాటు వ్యవసాయ సంక్షోభమూ మొదలైంది. అయితే, ఈ మారు అది కరువుల రూపంలో రాలేదు. కాని రైతులు దివాలా ఎత్తడం, భరించలేని రుణభారం, దాని పర్యవసానంగా ఆత్మహత్యలకు పాల్పడడం, పట్టణాలకు వలసలు పెద్దఎత్తున పోవడం, వ్యవసాయం ఏ మాత్రమూ గిట్టుబాటు కాని వ్యాపకంగా దిగజారడం వంటి రూపాల్లో వచ్చింది. దానికి తోడు అత్యవసర సేవలైన విద్య, వైద్యం ప్రయివేటుపరం కావడం, ఆ సేవల ఖరీదు తలకు మించిన భారం కావడం రైతాంగానికి తలకు మించిన భారం అయిపోయింది.

స్వతంత్ర భారతదేశంలో తొలి దశాబ్దాలలో అమలు జరిగిన వ్యవసాయ విధానం నుండి ఈ విధమైన మార్పు జరగడం వెనుక కారణాలు ఏమిటి? చిన్న తరహా ఉత్పత్తి విధానంలోకి చొరబడడానికి, చిన్నరైతుల వ్యవసాయాన్ని చేజిక్కించుకోడానికి బడా పెట్టుబడి తహతహలాడుతూ వుంటుంది. నయా ఉదారవాద విధానాలు దాని వాంఛ నెరవేరే అవకాశాన్ని కల్పించాయి. ఇంకోపక్క సామ్రాజ్యవాదం మనదేశపు వ్యవసాయ రంగాన్ని తన సరుకుల ఉత్పత్తి చట్రం పరిధిలోకి మళ్ళీ లాక్కురావడానికి ప్రయత్నిస్తోంది. ఆ విధంగా మళ్ళీ జరిగితేనే సంపన్న దేశాల పెట్టుబడిదారుల అవసరాలు (ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు కారుచవుకగా మనవద్ద నుండి కాజేయడం) నెరవేరుతాయి. అది జరగాలంటే దేశీయంగా వాటికి ఉన్న డిమాండ్‌ను కుదించాలి. అందుకోసం విశాల ప్రజానీకపు కొనుగోలుశక్తిని కుదించివేయాలి. అందుకోసమే ఐఎంఎఫ్ ద్వారా పొదుపు చర్యల పేరుతో ప్రజా సంక్షేమానికి కోతలు విధించడం జరుగుతోంది. అయితే వలస పాలన కాలంలో వొట్టినే ఇక్కడి సరుకులను దోచుకుపోయినట్టు ఇప్పుడు పట్టుకుపోవడం సాధ్యం కాదు (అసమాన మారకపు రేట్లు, పేటెంట్ హక్కుల పేరుతో అదనంగా వసూలు చేయడం తదితర పద్ధతులతో దోచుకోవడం జరుగుతోంది). కానీ ఆ సంపన్న పెట్టుబడిదారీ దేశాల అవసరాలకు సరిపడా సరుకులు ఇక్కడినుంచి లభ్యమవుతున్నాయి. పైగా ఈ అసమాన వ్యాపారం కారణంగా ద్రవ్యోల్బణం మీద ఏ ప్రభావమూ పడడంలేదు.

ఇక రెండో విషయం: తమ దేశాలలో ఏ సరుకులు అవసరమో వాటిని ఇక్కడ మన దేశాల్లో ఉత్పత్తి చేసే విధంగా నియంత్రించగలగడం. దాని వలన మన దేశపు ఆహార భద్రత లక్ష్యం దెబ్బ తింటోంది. గతానికి ఇప్పటికి ఇంకొక తేడా ఉంది. అప్పటితో పోల్చితే ఇప్పుడు సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఆహారధాన్యాల ఉత్పత్తిలో మిగులును సాధించాయి. వాటిని అమ్ముకోవాలంటే వర్ధమాన దేశాలలో ఆహార స్వయంసమృద్ధి అనేది ఉండకూడదు. అందుకే మన ప్రభుత్వాన్ని తన విధానాలను మార్చుకునేలా వత్తిడి చేస్తాయి. ఇప్పటికే వ్యాపార పంటల (కాఫీ, తేయాకు, రబ్బరు, పొగాకు వంటివి) విషయంలో కనీస మద్దతు ధర గ్యారంటీ చేయడం నుంచి ప్రభుత్వం వెనక్కి తప్పుకుంది. ఇప్పుడు ఆహార పంటల విషయంలో సైతం ధాన్య సేకరణ బాధ్యత నుండి, ప్రజా పంపిణీ నిర్వహణ బాధ్యత నుండి, కనీస మద్దతు ధరను గ్యారంటీ చేసే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవాల్సిందేనని ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి చేస్తోంది. అయితే ఆ దిశగా మన ప్రభుత్వం ధైర్యం చేయలేకపోతోంది. నిజానికి ఏ ప్రభుత్వమూ ఆ ధైర్యం చేయజాలదు.

అయితే మోడీ ప్రభుత్వం తన విచ్ఛిన్నకర హిందూత్వ ఎజండాను ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని పక్కకు మరల్చి ప్రపంచ వాణిజ్య సంస్థ వత్తిడికి అనుగుణంగా మార్పులు చేయడానికి పూనుకుంది. దానికి తోడు కరోనా మహమ్మారి ఆవరించడంతో తన పని తేలికగా అయిపోతుందని అనుకుంది. అందకోసమే హడావుడిగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలనూ తీసుకొచ్చింది. ఆ చట్టాల ద్వారా ఆహార ధాన్యాలకు మద్దతు ధరను గ్యారంటీ చేసే విధానం రద్దు అయిపోయి వ్యవసాయరంగ కార్పొరేటీకరణకు మార్గం సుగమం అయిపోతుందని తలిచింది. దాని కుట్రను కప్పిపుచ్చడానికి ఈ చట్టాలు రైతుల సంక్షేమం కోసమేనంటూ ప్రచారం కూడా చేసింది. కాని ఈ దేశ రైతాంగం పట్టుదలగా సాగించిన పోరాటం మోడీ ప్రభుత్వ కుట్రలను సాగనివ్వలేదు.

ఇప్పుడు ప్రభుత్వం వెనిక్క తగ్గడం కేవలం తాత్కాలిక ఎత్తుగడ మాత్రమే. నయా ఉదారవాద విధానాల అమలుకు మోడీ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడివుంది. ఆహారధాన్యాల వ్యాపారంలో ప్రభుత్వం ఏ విధంగానూ జోక్యం చేసుకోకుండా ఉండడానికే ప్రయత్నిస్తోంది. ఆ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు సమర్పించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం. అందుచేత అవకాశం చిక్కిన వెంటనే మళ్ళీ ఆ చట్టాలను ఏదో ఒక విధంగా ముందుకు తెస్తుంది. "దేశభక్తి" నినాదంతో సామ్రాజ్యవాదుల డిమాండ్లకు పూర్తిగా తలొగ్గడం మోడీ విధానం. అయితే ఆ విధానాలు దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తిని బాగా తగ్గించి వేస్తాయి. దాంతోబాటు ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా రద్దైపోతుంది. ఆహారధాన్యాలను విదేశాల నుండి దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చాక ఇక ప్రజా పంపిణీ వ్యవస్థ నడపడం అనేది సాధ్యపడే విషయం కాదు. ఆఫ్రికా దేశాల అనుభవాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఆ దేశాలలో ఆహార స్వయంసమృద్ధిని కోల్పోవడం వలన అక్కడ ప్రజా పంపిణీ వ్యవస్థలు మూలపడ్డాయి. ఆ దేశాలు ఆహార అవసరాలకోసం విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధం వలన విదేశాల దిగుమతులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆ దేశాలు కరువు ముంగిట నిలుచున్నాయి. అందుచేత వ్యవసాయ సంక్షోభం నుండి బైట పడాలన్నా, ఆహార భద్రతను కాపాడుకోవాలన్నా, దేశ రైతాంగం సామ్రాజ్యవాదుల డిమాండ్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఎక్కుపెట్టక తప్పదు.

(స్వేచ్ఛానువాదం)

చదువులమ్మ వెలుగులో...



టి.స్కైలాబ్‌బాబు
9177549656

మూడువేల ఏండ్లుగా శూద్రులకు, మహిళలకు చదువును నిషేధించిన మనుస్మృతిని ఛేదించిన చదువుల తల్లి సావిత్రి బాయి ఫూలే. 1831 జనవరి 3న మహారాష్ట్రలోని నయగావ్ గ్రామంలో జన్మించింది. సావిత్రిబాయి తన 9వ ఏటనే మహాత్మా జోతిబాఫూలేను వివాహమాడింది. తన భర్త వద్దనే అక్షరజ్ఞానం నేర్చుకొని సమాజంలో అత్యంత ఎక్కువ వివక్ష, అవమానాలు భరిస్తున్న మహిళలకు చదువు నేర్పిన మొట్టమొదటి భారతీయ ఉపాధ్యాయిని ఆమె. ఆ వెలుగులో దేశం ఇంతకాలం ముందుకు నడుస్తూనే ఉంది. కానీ ఇప్పుడు తిరిగి వెనక్కి నడిపించే కుట్రలు మొదలయ్యాయి.

నేటి కేంద్ర బీజేపీ సర్కార్ పార్లమెంట్‌లో ఎలాంటి చర్చకు తావియ్యకుండా దొడ్డిదారిన తన మంద బలంతో నూతన జాతీయ విద్యావిధానం 2020 బిల్లును ఆమోదించుకుంది. మూడువేల ఏండ్ల కిందట చదువును మెజార్టీ ప్రజలకు దూరం చేయడం ఎలా జరిగిందో, తిరిగి అలా చేయడమే ఈ బిల్లు అసలు లక్ష్యం. విద్యారంగాన్ని మొత్తం కార్పొరేట్ శక్తులకు అప్పగించి కొనగలిగిన కొందరికే చదువును కట్టబెట్టడడం దాని ఉద్దేశ్యం. నిరుపేదలు, దళితులు చదువులు కొనలేక ఉన్నత విద్యకు దూరం కావడం తప్ప ఈ బిల్లు వల్ల వారికొరిగేదేమీ లేదు. అబద్దాలు మూఢవిశ్వాసాలు తిరోగమన భావాలతో విద్యార్థుల భవిష్యత్‌ను పాడుచేయడం, విద్యార్థులలో మతోన్మాద ఛాందస భావాలు పెంచడం వంటి దుశ్చర్యలు బీజేపీ తెచ్చిన ఈ బిల్లులో ప్రధానాంశాలుగా ఉన్నాయి. నూతన జాతీయ విద్యావిధానం అమలు చేయడం ద్వారా కేంద్ర బీజేపీ సర్కార్ ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ వంటి లక్ష్యాలు సాధించాలని భావిస్తున్నది. అందువల్ల జాతీయ విద్యా విధానం సావిత్రిబాయి ఆశయాలకు, ఆకాంక్షలకు ద్రోహమే చేయనుంది. దీనిని వ్యతిరేకించడం ద్వారా మాత్రమే సమాజంలో మెజార్టీ ప్రజల భవిష్యత్‌ని మనం నిర్మించు కోగలం. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చాలా ముందుచూపుతో విద్య, వైద్యం, సంక్షేమరంగంలో మాత్రమే ఉండాలని చెప్పిన మాటలు పాలకులు పట్టించుకోకుండా ఈ రెండు రంగాలనూ కార్పొరేట్ శక్తులకే కట్టబెడుతున్నారు. దీనివల్ల పేదలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారుతున్నాయి.

మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో విద్యా రంగానికి 6శాతం నిధులు కేటాయించాలని, ఆయా రాష్ట్రాలు తమ రాష్ట్ర బడ్జెట్‌లలో 30శాతం నిధులు కేటాయించి దేశంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలని, శాస్త్రీయ విలువలను పెంచుకోవాలని పలువురు విద్యారంగ నిపుణులు అనేక ఏండ్లుగా సూచనలు చేస్తూనే ఉన్నారు. కానీ పాలకులు పెడచెవిన పెట్టారు. దీనివల్ల దేశం అనేక రంగాల్లో నేటికీ వెనుకబడే ఉంది. 75ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా కేవలం 64శాతం మాత్రమే అక్షరాస్యత సాధించాం అంటే విద్య పట్ల పాలకుల శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

మెజార్టీ ప్రజలకు అక్షరజ్ఞానం లేకపోవడం వల్లే దేశం అభివృద్ధికి నాగరికతకు ఆమెడ దూరంలోఉందని ఆరోజుల్లోనే ఫూలే దంపతులు గ్రహించారు. అందుకోసమే అస్పృశ్యులకు, బాలికలకు మొట్టమొదట 1848లో మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఒక బాలికా పాఠశాల

> అందరికి విద్య అందడం అసమానతలు అంతం కావడమే ఫూలే దంపతుల లక్ష్యం. ఆ లక్ష్యం కోసమే వారు కొవ్వొత్తిలా కరిగి తమ సర్వస్వాన్ని ధారపోసి సమాజ ప్రగతికోసం తుదిశ్వాస వరకు నిర్విరామ కృషి చేశారు. వారి ఆశయాలను మనం ఆచరించాలి. అందుకు విరుద్ధమైన నేటి కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి. విద్యారంగ ప్రయివేటీకరణ కార్పొరేటీకరణను సంపూర్ణంగా వ్యతిరేకించాలి.

ప్రారంభించారు. కేవలం 9మందితో పాఠశాల ప్రారంభమైంది. ఫూలే దంపతులు శూద్రులకు చదువు చెప్పడాన్ని భరించలేని మహారాష్ట్ర బ్రాహ్మణులు చివరికి ఫూలే దంపతులను



హత్యగావించడానికి కూడా వెనుకాడలేదు. ఇద్దరు కిరాయి గుండాలను చెరో రూపాయి ఇస్తాం ఫూలే దంపతులను చంపండని ఇంటిపైకి దాడికి పంపారు. అర్ధరాత్రి తమను చంపడానికి వచ్చిన ఆ కిరాయి గుండాలను పిలిచి అన్నం పెట్టి "మమ్మలను చంపడం ద్వారా మీ కుటుంబ పోషణ సాగుతుంది. కాబట్టి ఇగ నరకండి" అని వాళ్లెదుట నిలబడ్డారా దంపతులు. వాళ్ళు తమ వెంట తెచ్చుకున్న మారణాయుధాలను కింద పడేసి ఫూలే దంపతులకు సాష్టాంగ నమస్కారం చేసి వెనక్కి తిరిగివెళ్లిపోయారు. సావిత్రిభాయి చదువు చెప్పడానికి వెళితే ఆమెపై రాళ్లు, పేడ మట్టి చల్లారు. పాత చీర కట్టుకొని సంచిలో మరో చీర పెట్టుకొని వెళ్లి అస్పృశ్యులకు, మహిళలకు చదువు నేర్పింది. నేటి సమాజ నాగరికతకు ఆమె నాటిన విత్తనాలమే మనమంతా... వారికి మన దేశం ఎంతో రుణపడి ఉంది. ఫూలే దంపతుల జీవిత లక్ష్యం దేశంలో మెజార్టీ ప్రజలకు చదువు సర్వసంపదలు సమంగా పంచడమే. నేటి పాలకులు ఆ లక్ష్యాలను నెరవేర్చరని 75ఏండ్లుగా మన అనుభవం చెపుతున్నది. మన తరాలు మారుతున్నాయి కానీ మన తల రాతలు మారడంలేదు. మారక పోవడానికి కారణాలను అతీతశక్తులపైకి నెట్టేసి పాలకులు చేతులు దులుపుకుంటున్నారు. మన దేశంలో ఈ వెనుకబాటు తనానికి చదువు అందరికి దక్కకపోవడం కూడా ఓ ప్రధాన కారణం.

సావిత్రిభాయి ఫూలే జీవితం మనకు రెండు పాఠాలు నేర్పుతుంది. ఒకటి, చదువు యొక్క ఆవశ్యకతా అస్పృశ్యతా నిర్మూలన. రెండు, లక్ష్య సాధనకు అలుపెరుగని పోరాటం. అందుకే వారు గడిపిన జీవితం, వారు నడిపిన సామాజిక సేవా కార్యక్రమాలు సమాజంపై తీవ్రమైన ప్రభావం వేశాయని మనం గమనించాలి. 1873న ఏర్పాటు చేసిన సత్యశోధక్ సమాజ్ సుమారు 150 శాఖలుగా విస్తరించింది. సత్యశోధక సమాజ్ జరిపిన వితంతువు పునర్వివాహాలు, పూలదండల పెళ్లిళ్లు, నెలకొల్పిన పాఠశాలలు, హాస్పిటళ్లు, శరణాలయాలు, ఇతర పేదల సేవా కేంద్రాలు మహారాష్ట్రలో మెజార్టీ ప్రజలను ప్రభావితం చేశాయి. మహారాష్ట్రలో తీవ్ర కరువు సంభవించిప్పుడు వారు అంబలి కేంద్రాలు సైతం ఏర్పాటు చేశారు. ప్లేగు వ్యాధి సోకినప్పుడు వారు నిర్వహించిన మెడికల్ క్యాంపులు, ఆమె స్వయంగా ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సేవలందించడం చూసే పేదల పట్ల ఆమెకు ఉన్న ప్రేమ మనకు విధితమవుతుంది. 1890 నవంబర్ 28న మహాత్మా జోతిబాఫూలే కన్ను మూశారు. తన భర్త చితికి తానే నిప్పంటించారు. ఆ తరువాత కూడా తాను మరణించే వరకూ సుమారు ఏడేండ్లు సత్యశోధక్ సమాజ్‌ను తన ప్రాణ స్నేహితురాలు ఫాతిమా షేక్ సహకారంతో ముందుకు నడిపించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు సేవలు చేస్తూ చివరికి అదే ప్లేగు వ్యాధితో 1897 మార్చి 10న ఆమె కన్నుమూసారు.

ఆ మాతృమూర్తి మన దేశ సామాజిక మార్పుకు మార్గం చూపిన మొట్టమొదటి ఉపాధ్యాయిని. వేల సంవత్సరాలుగా మూఢత్వం వేళ్లూనుకొని ఉన్న ఛాందస సమాజం స్త్రీని ద్వితీయ శ్రేణి పౌరురాలిగా చిన్నచూపు చూస్తున్న తరుణంలో... ఒక మహిళగా తను నాటి సమాజం అభ్యున్నతి కోసం చేసిన నిర్విరామ కృషి నేటి తరానికి గొప్ప స్ఫూర్తిదాయకం. అందరికి విద్య అందడం అసమానతలు అంతం కావడమే ఫూలే దంపతుల లక్ష్యం. ఆ లక్ష్యం కోసమే వారు కొవ్వొత్తిలా కరిగి తమ సర్వస్వాన్ని ధారపోసి సమాజ ప్రగతికోసం తుదిశ్వాస వరకు నిర్విరామ కృషి చేశారు. వారి ఆశయాలను మనం ఆచరించాలి. అందుకు విరుద్ధమైన నేటి కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి. విద్యారంగ ప్రయివేటీకరణ కార్పొరేటీకరణను సంపూర్ణంగా వ్యతిరేకించాలి. కామన్ స్కూల్ విద్యా విధానం కోసం ఉద్యమించాలి. నేడు సావిత్రిబాయి పుట్టిన రోజున అందుకు దీక్ష బూనుదాం. జనవరి 3ను బాలిక అక్షరాస్యత దినంగా పాటించాలని, టీచర్స్ డేగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేద్దాం...



లక్ష్యాలతో కలుద్దాం !

హ్యాపీ న్యూ ఇయర్.. ఎవడో ఇస్తే..
నోట్లో వేసుకునే మిఠాయి కాదు
ఒక కొత్తదనం.. ఇంకో జవసత్వం
జనం గుండె గొంతుక నుంచి ధ్వనించాలి
దేశం దేహ భక్తి ఒంటి నిండా నింపుకుంటూ
గుండె గదుల్లో చెరగకుండా హత్తుకుంటూ
రండి.. కదం తొక్కండి.. పిడికెళ్ళెత్తి కదలండి

ఆడపిల్ల సింబల్ ఆఫ్ సెక్సు కాదనీ - నీ బతుకునిచ్చిన జన్మ చిహ్నామనీ
గర్వంగా జాతి జెండాగా ఎగరేద్దాం - మత్తు మురాల్లో మృగాళ్ల నేరేద్దాం
రేపుల్లేని హ్యాపీ న్యూగా ప్రకటిద్దాం - రండి.. లెగవండి.. ఇక చాటింపేద్దాం

పాలక విధానాల కత్తిపోట్లకు గురై -
ఎరువైన రైతన్న వెన్నెముకను తీసి
నాగలిగా మారుద్దాం .. పొలాన్ని దున్నేద్దాం
చెమట ధారల ఒడిసిపట్టి చేలంతా చల్లేద్దాం
భూమి, పంట, ధర.. రైతు హక్కని ప్రకటిద్దాం
రండి.. కదలండి.. పచ్చ తివాచీలు పరుద్దాం

ప్రజల చెమటే ప్రభుత్వ రంగంగా పెంచినోటిని
కమ్మేసిన కార్పొరేట్ రాబందుల గుంపునకు
కారు చౌక వేలంతో అప్పనంగా అమ్మేస్తుంటే
చూస్తుండే శవాలు లేవిక్కడని చాటింపేద్దాం
అది జనం గుత్త సొత్తని ప్రకటిద్దాం సాధిద్దాం
ఇదే కొత్త సంవత్సర లక్ష్య పతాకగ ఎగరేద్దాం

అప్పుడందాం.. హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్
ఇక భవిష్యత్తు.. మనదే మనదే డియర్ అని!

- ఉన్నం వెంకటేశ్వర్లు





ఓ తల్లి కన్నీటి కథ

వాషింగ్టన్‌లో చినుకులు పడే డిసెంబర్ సాయంత్రం... కింబర్లీ మాతా రూబియో... టెక్సాస్‌లోని ఉవాల్డే నుండి తమ కుటుంబాలతో కలిసి యూనియన్ స్టేషన్ నుండి కాపిటల్ హిల్‌కు నిశ్శబ్దంగా కవాతు చేశారు. మే 24న రాబ్ ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఆమె 10 ఏండ్ల కూతురు లెక్సీ రూబియో హత్యకు గురైంది. ఈ కాల్పులకు ముందు మాతా రూబియో ఎప్పుడూ విమానంలో ప్రయాణించలేదు. అలాంటిది వాషింగ్టన్‌కు ఇది ఆమె ఏడవ పర్యటన. ఆయుధాలపై ఆంక్షలు విధించమని చట్టసభ సభ్యులపై పోరాటం చేస్తున్న ఓ తల్లి కన్నీటి కథ గురించి ఈ రోజు మానవిలో తెలుసుకుందాం....

"ఆయుధాలు నా కుమార్తె లెక్సీని తీసుకువెళ్ళాయి" అనే బోర్డుని ఆ తల్లి అక్కడకు తీసుకువెళ్ళింది. క్యాపిటల్ భవనం ముందు మార్చ్ ముగించుకొని 33 ఏండ్ల మాతా రూబియో ఏడుస్తూ నిలబడింది. ఇలాంటి ఓ పోరాటం తాను చేస్తానని మాతా-రూబియో ఎప్పుడూ ఊహించలేదు. కానీ ఇప్పుడు ఇదే ఆమె భవిష్యత్తు. శాసనసభపై పోరాటాలను చేపడుతున్నప్పుడు ఆమె తన సంక్లిష్టమైన, బాధాకరమైన అనుభవాలను పంచుకుంది. ఆమె తన కూతురిని కోల్పోయిన దుఃఖంలో ఉంది. ఆమె తన కుటుంబాన్ని కోల్పోయింది. "లెక్సీ మరణించిన క్షణంలో నేను తన ముందు ఉన్నాను" అని మాతా-రూబియో డిసెంబరు 8న యు.ఎస్.లో వెలుపల మధ్య చట్టసభలో బెంచ్‌పై ఉన్న సభ్యుల మధ్య కూర్చొని చెప్పారు.

నా బాధను ఊహించగలరు

యు.ఎస్.లో సామూహిక కాల్పులు సర్వసాధారణంగా మారిపోయాయి. మే 24న ఉవాల్డేలో జరిగిన విషాదంలో 400 కంటే ఎక్కువ మంది ఉన్నారు. గన్ వయలెన్స్ ఆర్కైవ్ ప్రకారం ఆమె వేదన ఇతర తల్లిదండ్రులకు కూడా సంబంధించినదని ఆమె స్పష్టంగా చెప్పారు. "నేను వ్యాఖ్యలను స్వీకరిస్తాను, మీరు ఏమి చేస్తున్నారో నేను ఊహించలేను. ఒక తల్లిగా లేదా ఓ తండ్రిగా మీరు నా బాధను ఊహించగలరు. నా బాధను మీరు ఊహించినప్పుడే మీరు నాతో కలిసి పోరాటంలో పాల్గొంటారు" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టంలో మార్పులు ఏవి?

లెక్సీతో పాటు మరో 18 మంది పిల్లలు, ఇద్దరు ఉపాధ్యాయులు కాల్పులకు గురై ఇప్పటికి ఏడునెలలు అయ్యింది. సాధారణంగా క్రిస్మస్ సమయంలో లెక్సీ తన తండ్రి ఫెలిక్స్ రూబియోకు ఇంటి బయట అలంకరించుకోవడానికి సహాయం చేస్తుంది. వారు మార్ష్‌మాల్లోలతో వేడి చాక్లెట్‌లు తాగుతారు. క్రిస్మస్ సినిమాలను కలిసి చూస్తారు. అలాంటి కుటుండం ఈ సంవత్సరం లెక్సీ సమాధిని క్రిస్మస్ లైట్లు, మిఠాయితో అలంకరించింది. దశాబ్దాలుగా ఇటువంటి సామూహిక కాల్పులు జరుగుతున్నా చట్టంలో ఎలాంటి మార్పులను చేయలేదు. ఇప్పటి ఈ పోరాటమైనా తుపాకీ పాలసీలో మార్పులకు దారితీస్తుందని చాలా మంది చట్టసభ సభ్యులు, న్యాయవాదులు భావించారు. కానీ ఉవాల్డే భిన్నంగా ఉంది.

అధ్యక్షుడు జో బిడెన్ జూన్‌లో దాదాపు మూడు దశాబ్దాలలో అత్యంత ముఖ్యమైన తుపాకీ సంస్కరణ బిల్లుపై సంతకం చేశారు. ఇది యువ తుపాకీ కొనుగోలుదారుల తనిఖీలను మెరుగుపరుస్తుంది. అలాగే ప్రజల మానసిక ఆరోగ్య కార్యక్రమాల కోసం నిధులు సమకూరుస్తుంది.

హృదయ విదారకం

ఉవాల్డే షూటర్ తన తుపాకీని పొందకుండా ఆ చట్టం నిరోధించకపోవచ్చు. అయితే ఇది సరిపోదని మాతా రూబియో అన్నారు. సామూహిక కాల్పుల బాధితుల తల్లిదండ్రుల మాదిరిగానే ఆమె బిడ్డను పోగొట్టుకున్న బాధ అంతం కాదు. అధికారంలో ఉన్నవారు యు.ఎస్. తుపాకీ చట్టాలను మార్చడానికి చాలా ఇష్టపడరు. మాతా రూబియో కాంగ్రెస్ ముందు సాక్ష్యమివ్వడం, చట్టసభ సభ్యులతో నేరుగా మాట్లాడడం, ఆస్టిన్‌లో ర్యాలీలలో పాల్గొనడం, జాతీయ మార్పును ప్రేరేపించడానికి ట్విట్టర్‌లో దాదాపు 19,000 మంది అనుచరులతో తన హృదయ విదారకాన్ని పంచుకోవడం ద్వారా ప్రంచానికి తెలిసారు.



వారికి కఠినమైన వారాలు

డిసెంబరులో డి.సి.కి ఆమె పర్యటన సందర్భంగా ఉవాల్డే షూటింగ్, ఇతరత్రా వంటి కొన్ని దాడి ఆయుధాలపై నిషేధాన్ని పునరుద్ధరించే బిల్లును ఆమోదించాలని ఆమె సెనేట్‌ను కోరారు. (హౌస్ జూలైలో బిల్లును ఆమోదించింది.) కానీ రిపబ్లికన్‌లు జనవరి 3న హౌస్‌పై నియంత్రణ సాధించకముందే సెనేట్ నాయకత్వం బిల్లును ఓటింగ్‌కు తీసుకురావడంతో చట్టం ఆమోదం ముందుకు వచ్చింది. "ఇవి చాలా కఠినమైన రెండు వారాలు" మాతా రూబియో డి.సి లో మార్చ్ తర్వాత కొన్ని రోజులకు టైం పత్రికకు ఒక ఇంటర్యూలో చెప్పారు. ఆమె థాంక్స్ గివింగ్‌కు ముందు వాషింగ్టన్ పర్యటనకు కట్టుబడి ఉన్నారు. కానీ సెలవుదినం నుండి ఆమె సంతాపం కొత్త రూపం తీసుకుంది. "మేము సాధారణంగా చేసే ఆ సంప్రదాయాలు ఇప్పుడు చేయడం లేదు" అన్నారు ఆమె.

లెక్సీ ఫొటోతో...

డి.సి. ట్రిప్ తర్వాత ఒక వారం లోపే మాతా రూబియో సెయింట్ మేరీస్ యూనివర్శిటీ ప్రారంభోత్సవ వేడుకలో బ్యాచిలర్ డిగ్రీని అందుకోవడానికి క్యాప్, గౌనుతో వేదిక మీదుగా నడిచారు. ఆమె "A" అనే అక్షరంతో కూడిన హారాన్ని ధరించింది. లెక్సీ పూర్తి పేరు అలెగ్జాండ్రియా అనియా రూబియో. లెక్సీ పెద్ద ఫోటో అక్కడ ఒక సీటును నింపింది. ఇది ఒక భావోద్వేగ అనుభవం అని మాతా రూబియో చెప్పారు. ఆమె తన భర్తతో కలిసి ఉవాల్డే కౌంటీ షెరీఫ్ కార్యాలయంలో లెక్సీ ఐదుగురు తోబుట్టువులను టెక్సాస్ నుండి తరలించాలని కోరుకున్నారు. మాతా రూబియో స్థానికంగా వారానికి రెండుసార్లు వచ్చే ఉవాల్డే లీడర్ న్యూస్‌లో రిపోర్టర్‌గా పని చేసేవారు. కానీ ఆమెకు హైస్కూల్ డిప్లొమా మాత్రమే ఉంది. 2019లో ఆమె తన బ్యాచిలర్ డిగ్రీని విడిచిపెట్టి FBIలో ఉద్యోగం పొందడానికో, జర్నలిజంలో ఇతర అవకాశాలను తెరవడానికి సహాయపడుతుందని ఆమె భావించింది. "నేను ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. ఏమైనప్పటికీ నా పిల్లలను ఉవాల్డే నుండి బయటకు తీసుకురావడానికి, భిన్నమైనదాన్ని అనుభవించండి ఇది నాకు ముఖ్యమైనది" అంటున్నారు ఆమె. ప్రస్తుతం కుటుంబం వాషింగ్టన్ రాష్ట్రానికి వెళ్లాలని ఆలోచిస్తోంది. లేదా ఏదైనా చల్లటి ప్రదేశానికి వెళ్లాలని ఆలోచిస్తోంది. లెక్సీకి చల్లని వాతావరణమంటే ఇష్టం.

కుమార్తెను కోల్పోయి

లెక్సీని ఖననం చేయడానికి కేవలం మూడు రోజుల ముందు మాతా రూబియో తుపాకీ హింస గురించి మొదట సాక్ష్యమిచ్చారు. "లెక్సీ దృఢంగా, సూటిగా, కదలని స్వరంతో ఉంది. ఈ రోజు మేము లెక్సీ కోసం నిలబడతాము. ఆమె గొంతుగా మేము ఈ పోరాటం చేస్తున్నాము" అని మాతా రూబియో హౌస్ ఓవర్‌సైట్ కమిటీ ముందు తన వాంగ్మూలంలో చెప్పారు. ఆమె స్వరం వణుకుతున్నప్పటికీ బలంగా ఉంది. మాతా రూబియో తన కుమార్తెను కోల్పోయినప్పటి నుండి పాఠశాల కాల్పులకు గురైన అనేక ఇతర తల్లిదండ్రుల కంటే ఇప్పటికే మరిన్ని మార్పులను చూసింది. ఇప్పుడు ఆమె దృష్టి దాడి ఆయుధాల నిషేధంపై ఉంది.

ఆయుధం ఉండకూడదు

మాతా-రూబియో రాబ్ ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగిన సంఘటనలపై కొనసాగుతున్న దర్యాప్తుపై వ్యాఖ్యానించలేదు కానీ ఇలా అంటున్నారు, "300 మందికి పైగా అధికారులు దాడి చేసే ఆయుధంతో ఒక వ్యక్తిని మించిపోయారని భావిస్తే అప్పుడు సగటు పౌరుడికి అలాంటి ఆయుధం ఉండకూడదు". ఆమె కోరుకునే సంస్కరణలకు కొంత వ్యతిరేకత ఆమె సొంత ప్రజాప్రతినిధుల నుంచే వస్తోంది. డిసెంబర్ 8న టైంతో మాట్లాడిన కొద్దిసేపటికే మాతా రూబియో, ఆమె భర్త టెక్సాస్‌కు చెందిన రిపబ్లికన్‌కు చెందిన సేన్.జాన్ కార్నిన్ కోసం ఒక సిబ్బందిని కలిశారు. మాతా రూబియో ప్రకారం ఆయుధాలను నిషేధించే బిల్లును ఏడాది ముగిసేలోపు ఓటు వేయడానికి సెనేట్ నాయకత్వాన్ని ఒప్పించేందుకు కార్యాలయం ఏమీ చేయదని సిబ్బంది ఆమెకు చెప్పారు.

కొత్త చట్ట సభల కోసం

ఆమె వాషింగ్టన్ పర్యటన తర్వాత ఏమి చేయాలో అర్థం కాక లెక్సీ లేకుండా తన మొదటి క్రిస్మస్ బాధను భరించడానికి ఉవాల్డేకి తిరిగి వచ్చారు. ఆమె లీడర్ న్యూస్‌లో తిరిగి పని చేయాలనుకుంటుంది. అయితే ఆమె మొదటి ప్రాధాన్యం మాత్రం పోరాటానికి. వచ్చే ఏడాది కొత్త కాంగ్రెస్‌తో తుపాకీ భద్రత చట్టం, వాషింగ్టన్‌లో కొత్త శక్తి సమతుల్యత, దుఃఖాన్ని ఎదుర్కొనేందుకు కొత్త చట్టసభల కోసం కొత్త పోరాటం ఉంటుంది. ఈలోగా మాతా రూబియో, ఆమె కుటుంబం ప్రతిరోజూ లెక్సీ సమాధిని సందర్శిస్తారు. "మేము ఈ రోజుల్లో ముందుగా అక్కడికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాము. ఎందుకంటే అది త్వరగా చీకటిగా మారుతుంది. నా బిడ్డను చీకటిలో వదిలివేయడం కష్టం" అని మాతా రూబియో చెప్పారు.

ఇలా అధిగమించండి



ఇది పోటీ ప్రపంచం. ఎవరికి వారు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పరుగులు పెడుతుంటారు. అయితే ఇందులో అమ్మాయిలకు ఎదురయ్యే అడ్డంకులు చాలానే. వాటిని అధిగమించాలంటే వీటిని పాటించాలి.

- లక్ష్యాలను పెట్టుకోవడం తప్పు కాదు... అయితే అవి వాస్తవికంగా ఉండేలా చూసుకోవాలి. ముందు మనలో ఉన్న శక్తి సామర్థ్యాలను, మనకి ఉండే ప్రతికూలతల్ని అంచనా వేసుకుని ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- సరైన ప్రయత్నం చేయకుండానే గమ్యం చేరాలని తహతహలాడే వారు కొందరైతే. సరైన ప్రణాళిక లేకుండానే విజయానికి చేరువకాలేకపోతున్నామని బాధపడేవారు మరికొందరు. లక్ష్యం నిర్దేశించుకున్న తర్వాత ప్రారంభించిన మీ పయనం సాగుతున్న తీరుని పట్టికలో ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ ఉండండి. ఇది ఆచరణలో జరుగుతున్న లోపాలతో పాటు భవిష్యత్తుకి మార్గదర్శకంగా పనిచేస్తుంది. అందుకే అనుభవజ్ఞుల సలహాలూ తీసుకోండి. ఇవన్నీ మిమ్మల్ని సరైన దారిలో నడిపిస్తాయి.
- ఎవరి సామర్థ్యం మేరకు వారు పని చేస్తారు. ఇతరులతో పోల్చుకోవడం వల్ల ప్రతికూల ఆలోచనలు పెరుగతాయే తప్ప గమ్యం చేరుకోలేరనే విషయాన్ని మొదట గుర్తించండి. దానికి బదులు ఇతరులను ప్రేరణగా తీసుకుని ఎదిగే ప్రయత్నం చేయడం వల్ల ఫలితం ఉంటుంది.గెలుపోటములు సహజమనే విషయాన్ని ముందు అంగీకరించగలగాలి. అలాగని విజయం ఎప్పుడూ ఒకరి సొంతమే కాదు. ఎదుటివారితో పోల్చుకోవడం మంచిదే కానీ అసూయతోనో, కోపంతోనో కాకూడదు. ఆ పోలిక మనలో ఉన్న లోపాల్ని సరిదిద్దుకుని సరైన ప్రణాళిక వేసుకునేందుకు సాయం చేసేలా ఉండాలి. ఎవరిలో ఉండే ప్రత్యేకతలను వారు గుర్తించి సానపెట్టుకోగలిగితే లక్ష్యాన్ని చేరుకోవడం సులువే.

రాష్ట్రానికి 3.30 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యమైందన్నారు. భారీగా పెట్టుబడులు తీసుకురావడంలో విజయం సాధించిన పరిశ్రమలు-ఐటీ శాఖలోని ప్రతి ఒక్క అధికారినీ, వారి బందాలనూ అభినందించారు. పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రభుత్వ విధానాలను రూపొందించడంతో పాటు అవసరమైన పారిశ్రామిక పార్కులు, మౌలిక వసతుల కల్పనను తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావించిందన్నారు. ఫలితంగానే భారీగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని తెలిపారు. ఈ పెట్టుబడులతో లక్షలాది మందికి ఉపాధి లభించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎన్నో ఏండ్లుగా అగ్రస్థానంలో ఉన్న దేశంలోని ఇతర నగరాలను హైదరాబాద్ దాటిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆ దిశగా ముందుకెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రానున్న సంవత్సర కాలానికి చేపట్టనున్న వివిధ కార్యక్రమాలు, ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు తదితర అంశాల పైన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్ఐఐసీ ఎమ్‌డీ వెంకట నరసింహారెడ్డి, వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమల శాఖ, ఐటీ శాఖ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజలు బీజేపీని తిరస్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. మోడీ పాలనలో దేశంలో ఆర్థిక సంక్షోభం తారాస్థాయికి చేరిందనీ, నిరుద్యోగ రేటు 18 నెలల్లో అత్యధికంగా 8.5 శాతానికి పైగా నమోదైందన్నారు. ద్రవ్యోల్బణం పెరిగి, వ్యవసాయం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయని చెప్పారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు సహా అన్నీ పెరిగాయనీ, పేదలు నిరుపేదలుగా మారితే, అదానీ, అంబానీ వంటి కొందరు కార్పొరేట్ల సంపద మరింత పెరిగిందని చెప్పారు. పార్లమెంటు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై జాతీయ లా కమిషన్ రాజకీయపార్టీల అభిప్రాయాలు కోరుతూ లేఖ రాసిందని తెలిపారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనేది బీజేపీ విధానమనీ, బహుళ రాజకీయ పార్టీల వ్యవస్థ కలిగిన భారతదేశంలో ఇది అసాధ్యమనీ, ఆచరణయోగ్యం కాదని స్పష్టం చేశారు. స్థిరమైన ప్రభుత్వమా...జవాబుదారీ ప్రభుత్వమా అనే చర్చ జరిగినప్పుడు తాను జవాబుదారీ ప్రభుత్వాన్నే కోరుకుంటానని భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. భారత ఎన్నికల విధానంలో సమూల మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఎలక్టోరల్ బాండ్స్‌తో బీజేపీ కార్పొరేట్ సంస్థల నుండి భారీగా నగదు పోగుచేసుకొని, ప్రతిపక్షపార్టీలను అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. సమగ్ర ఎన్నికల సంస్కరణలు, దామాషా ప్రాతినిధ్య ఎన్నికల విధానం అవసరమని చెప్పారు. వలస కూలీలు ఎక్కడి నుంచైనా ఓటు వేసే అంశాన్ని ఎన్నికలు కమిషన్ ఇప్పుడు తెరపైకి తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నోట్లరద్దుపై సుప్రీంకోర్టు ఇచ్చింది ఏకగ్రీవ తీర్పు కాదన్నారు. నోట్లరద్దుపై కేంద్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ రాష్ట్రాల హక్కుల్ని కాలరాస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో గవర్నర్ల పాత్రను తప్పుపట్టారు. దీనిపై సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేశ్, కలవేన శంకర్, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బాలనర్సింహా, వి.ఎస్.బోస్, ఇ.టి.నర్సింహా పాల్గొన్నారు. అంతకుముందు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఆ సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శిని-39ని చుక్కా రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో బలమైన ఉపాధ్యాయ ఉద్యమం నిర్మితమైందనీ, ఆ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించటానికి ఈ డైరీ కరదీపికగా ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యకర్తల మధ్య ఉండటమే తనకు సంతోషమనీ, కార్యకర్తల మధ్యనే తుదిశ్వాస విడవాలనుకుంటున్నానని అన్నారు. అందుకే తనకు ఓపిక లేకపోయినా టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పిలవకపోయినా ఈ కార్యక్రమానికి వచ్చానని వివరించారు. తుది వరకూ యూటీఎఫ్‌నకు విశ్వాసంతో ఉంటానన్నారు. ఉద్యమాలను నిర్మించడంలో రాజీపడొద్దని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలనీ, కార్మికుల హక్కుల కోసం అండగా ఉండాలని సూచించారు. పోరాటాలతోనే ఉపాధ్యాయులకు అనేక హక్కులొచ్చాయని గుర్తు చేశారు. వారిలో నిరంతరం సమస్యలపై పోరాడే చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. యూటీఎఫ్‌లో తనకున్న బంధాన్ని, అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ డైరీలో పొందుపరచిన 90 పేజీల సమాచారం ఎంతో విజ్ఞానదాయకంగా ఉందన్నారు. ఉపాధ్యాయులకే కాకుండా పాత్రికేయులు, సాధారణ ప్రజలందరికీ ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో బదిలీలు, పదోన్నతులు, నియామకాల్లేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైనా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేక సిలబస్ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం నూతన కొత్త ఏడాదిలోనైనా ఉపాధ్యాయుల ఖాళీల భర్తీపై దృష్టి సారించాలన్నారు. మన ఊరు-మన బడి, సమాంతర ఇంగ్లీషు మీడియం వంటి పథకాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వ కాలేజీలను స్థాపించాలని సూచించారు.

13,14 తేదీల్లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు : చావ రవి

ఈనెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా సాగర్ రోడ్ మన్నెగూడలో బీఎంఆర్ సార్థా కన్వెన్షన్‌లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభలు జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి చెప్పారు. ముఖ్యఅతిథిగా విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి హాజరవుతారని అన్నారు. కేరళ మాజీ మంత్రి కెకె శైలజ టీచర్ ప్రారంభోపన్యాసం చేస్తారని వివరించారు. అతిధులుగా ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఆహ్వానసంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్ హాజరవుతారని అన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు ఈ గాలయ్య, శారద, ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం వెంకటప్ప, శ్యామ్ సుందర్, గోపాల్ నాయక్, కల్పన, జగన్నాథ్, అశోక్, మస్తాన్ రావు, దత్తు, గణేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేటికీ మహిళలపై వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్రం పెరుగుతుందని తెలిపారు. ఇది గమనించే..స్త్రీలకు చదువు అక్కరలేదని సమాజం భావిస్తున్నదన్నారు. పూర్తిగా ఇది పితృస్వామిక భావజాల రూపమేనని తెలిపారు. కనిపించని రూపంలో ఈ భావజాలం ప్రతి ఒక్కరిలోనూ ఉందన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే..సావిత్రి బాయి పూలే కాలంలో ఈ భావజాల ప్రభావం ఎలా ఉందో ఊహించుకోవచ్చన్నారు. మహిళలు చదువుకోకూడదు, అందునా..అంటరాని దళితులు విద్యనభ్యసించటం మహానేరంగా భావిస్తున్న రోజుల్లోనే..సావిత్రిబాయి పూలే పూనేలో 12 పాఠశాలలు ప్రారంభించి అంటరాని వారికి, మహిళలకు విద్యనందించిందని గుర్తుచేశారు. పూలే కృషి ఫలితమే..నేడు మనం ఈ మాత్రం స్వేచ్ఛను పొందుతున్నామని చెప్పారు. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సామాజిక సేవా ధృక్పథం పెరగటమే కాక, మానవ విలువలు పెంపొందుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే డిగ్రీలు పొందటంతోనే సరిపోదనీ, సమాజాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించాలంటే స్త్రీ, పురుషుల ఆలోచనల్లో మార్పు రావాలని ఆకాంక్షించారు. వెనకబడ్డ ఆలోచనలతో అమ్మాయిలు ఆ బట్టలెందుకేసుకున్నారు? అర్ధరాత్రి బయటకెందుకొచ్చారు? ప్రశ్నిస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి వ్యాఖ్యానాలు సమాజ పురోగమనానికి ఉపయోగపడవన్నారు. చిన్నపిల్లలనుంచి పండు ముసలోళ్లపై కూడా



లైంగిక దాడులు జరుగుతున్న ఘటనలు చూస్తున్నామని గుర్తుచేశారు. ఒక్క తెలంగాణలోనే ఏడాదికి రెండు వేల లైంగిక దాడులు జరుగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చాన్నారు. నిర్భయ చట్టాలొచ్చినా.. ఎందరు పోలీసులను పెట్టినా..భావజాలంలో మార్పురాకుండా ఇవి ఆగవన్నారు. స్త్రీని రెండోతరగతి పౌరురాలుగా చూసినంతకాలం ఈ అఘాయిత్యాలు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. మతం ముసుగు మనిషిలోని ప్రశ్నను చంపేస్తుందన్నారు.ఆలోచనను అణచేస్తుందన్నారు. వెనక్కి లాగేవారున్నంత కాలం సమాజం ముందుకు పోదన్నారు. సమాజంలో సగ భాగంగా ఉన్న స్త్రీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తేనే..దేశ జీడీపీ పెరుగుతుందని తెలిపారు. తప్పుడు భావాలు, ఆచారాల పేరుతో సాగుతున్న దుష్ప్రభావాలను అర్థం చేసుకోవటమంటే సావిత్రి భాయి చూపిన చదువు ఒక్కటే మార్గమని నొక్కి చెప్పారు.

డాక్టర్ బీఆర్అంబేద్కర్ లా కళాశాల ప్రిన్స్‌పల్ డాక్టర్ డి సృజన మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే ఆనాడు పడ్డ సంఘర్షణను అర్థం చేసుకోవటం అంతసులువైన విషయం కాదన్నారు. సామాజికంగా అణగదొక్కబడుతున్న వారికే విద్యనందించాలని భావించటం గొప్ప విషయమన్నారు. ఈ క్రమంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. నేటి సమాజంలో చాలా చోట్ల బాగా చదువుకున్న కుటుంబాల్లో సైతం ఆడపిల్లలను విద్యకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భౌతిక దాడులు, అవమానాలు ఎన్నెదురైనా తన లక్ష్యం మరవకుండా చివరి వరకు తన కృషి కొనసాగించిందని చెప్పారు.

ఎస్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేకు అనేక ప్రత్యేకతలున్నాయని చెప్పారు. మొట్టమొదటి సారిగా బాలికలకు పాఠశాల ఏర్పాటు చేయటమేకాక, అతిశూద్రులకు, మహిళలకు చదువు నేర్పించే కార్యక్రమానికి పూనుకున్నదని చెప్పారు. ఆ రకంగా అనేక పాఠశాలలు నెలకొల్పిందన్నారు. దళితులు, మహిళలను చదువు దూరంగా ఉంచాలని మనుస్మృతి చెబుతుందని గుర్తుచేశారు. దీనికి భిన్నంగా సావిత్రి బాయిపూలే చదువుల తల్లిగా మారిందని చెప్పారు. వితంతువులను, గర్భందాల్చిన మహిళలకు ఆశ్రమాలను ఏర్పాటు చేసిందన్నారు. చివరకు ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవచేస్తూనే చనిపోయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్వీకే బాధ్యులు జి బుచ్చిరెడ్డి, ఎస్ సోమయ్య, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

నోట్ల రద్దుపై 4 :1 తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

జరిగాయి. అటువంటి చర్యను తీసుకురావడానికి సహేతుకమైన సంబంధం ఉంది. దామాషా సిద్ధాంతం వల్ల పెద్ద నోట్ల రద్దు జరగలేదు" అని పేర్కొన్నారు. నోట్లరద్దు నోటిఫికేషన్ చెల్లుబాటు అవుతుందని, నోట్ల మార్పిడికి 52 రోజుల వ్యవధి అసమంజసమని చెప్పలేమని పేర్కొన్నారు. ఆర్‌బిఐతో సంప్రదింపులు జరిపి ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2) కింద నోట్ల రద్దును కేంద్రం తీసుకురావచ్చని అన్నారు. నోట్లరద్దు లక్ష్యాలు నెరవేరాయా? లేదా? అన్నది ముఖ్యం కాదని పేర్కొన్నారు.

చట్టవిరుద్ధం : జస్టిస్ బి.వి.నాగరత్న

నోట్లరద్దు చర్య నోటిఫికేషన్ చట్ట విరుద్ధమని జస్టిస్ బి.వి.నాగరత్న అన్నారు. ధర్మాసనంలోని మిగిలిన నలుగురు సభ్యుల అభిప్రాయాలతో జస్టిస్ నాగరత్న విభేదించారు. ప్రతి ప్రశ్నకు సమాధానాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ భిన్నమైన అసమ్మతి తీర్పును వెలువరించారు. "రిజర్వ్ బ్యాంక్ తగిన శ్రద్ధ చూపలేదు. కేవలం 24 గంటల్లోనే కసరత్తును ముగించారు. దీన్ని ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2) ప్రకారం సిఫార్సుగా భావించలేం. నోట్ల రద్దు ప్రతిపాదనను పరిశీలిస్తున్నప్పుడు ఆర్‌బీఐ దృష్టిలో ఎటువంటి దరఖాస్తు లేదు. ఆర్‌బిఐ పత్రాల్లో 'కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం" అని ఉంది. దీనినిబట్టి ఈ విషయంలో ఆర్‌బీఐకి స్వతంత్ర ఆలోచన లేదని తెలుస్తోంది. రిజర్వ్ బ్యాంక్ చట్టం ప్రకారం ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు స్వతంత్రంగా నోట్ల రద్దును సిఫారసు చేసి ఉండాలి. ఇది ప్రభుత్వం సూచనల ప్రకారం అమలు జరపకూడదు" అని అన్నారు.

ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక..

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యం సరిగ్గా లేకున్నా ఇంటికి పంపించడం లేదని వాపోయారు. బాత్‌రూమ్, పాఠశాల గదులను తమతో కడిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే పట్టించుకునే నాధుడే లేడని ఆరోపించారు. అత్యవసర సరిస్థితుల్లో హాస్టల్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడిపించుకుంటూ తీసుకెళ్తున్నారని వాపోయారు. ఇలాంటి ప్రిన్సిపాల్ తమకు వద్దని చెప్పారు. కాగా విద్యార్థులకు స్థానిక నాయకులు అండగా నిలిచారు. జాతీయ రహదారిపై సుమారు గంటసేపు ధర్నా నిర్వహించారు. కాటారం ఎస్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇదే విషయమై ప్రిన్సిపాల్ చైతన్యను వివరణ కోరగా.. విద్యార్థులు ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో తమకు అర్థం కావట్లేదని చెప్పారు. విద్యార్థులను బాగానే చూసుకుంటున్నామని, ప్రభుత్వ నిబంధన మేరకే పనిచేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి డీజే పెట్టాలని విద్యార్థులు కోరగా తిరస్కరించినట్టు చెప్పారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన ఎన్నోసార్లు దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించినట్టు వివరించారు. విద్యార్థులను కావాలనే పలువురు పక్కదోవ పట్టించారని అన్నారు. అనంతరం ఎంపీపీ పంతకాని సమ్మయ్య జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు ఫోన్ ద్వారా సమస్యను విన్నవించారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

అడిగిందొకటి.. ఇచ్చింది మరొకటి

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం ఇవ్వండి మహాప్రభో అని ఎంపీఓ చేతన్‌రెడ్డి, ఎంపీడీవో కాళ్లపై పడి మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ ఎంపీఓ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అధికారులపై కోర్టులో ఫిర్యాదు చేస్తా : పర్వతగిరి రాజు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా నాయకులు

గ్రామ పంచాయతీలో జరిగిన పనులపై సమాచారం ఇవ్వాలని ఆర్‌టీఏ ద్వారా కోరగా.. మరో సమాచారం ఇచ్చారని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఎంపీఓ ఇవ్వమన్న సమాచారమే ఇచ్చాం, మాదేముంది అంటూ పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. కార్యదర్శులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఆర్టీఐ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఆర్టీఐ సమాచారం నాకు 2,3 రోజులు ఇవ్వకుంటే సంబంధిత అధికారులపై కోర్టులో ఫిర్యాదు చేస్తాను.

ఆర్టీఐ ద్వారా అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే : శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో

ఫిర్యాదుదారులు ఆర్టీఐ ద్వారా అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే. ఒక వివరణ కోరగా సంబంధంలేని మరో వివరణ ఇచ్చారని పర్వతగిరి రాజు తెలిపారని, త్వరలో అడిగిన పూర్తి సమాచారం ఇస్తాం.

వనస్థలిపురం సీఐ సత్యనారాయణకు ఫిట్ ఇండియా అభినందన



నవతెలంగాణ-వనస్థలిపురం

నేర నియంత్రణలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ తెలంగాణలో 17, రాచకొండ కమిషనరేట్‌లో 10వ స్థానంలో ఠాణా నిలిచినందున సీఐ సత్యనారాయణను, సిబ్బందిని ఫిట్ ఇండియా ఫౌండేషన్ మీడియా ఇన్‌చార్జి తలారి గణేష్ సోమవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో అభినందించారు. వారికి ఫౌండేషన్ తరపున శుభాకాంక్షలు తెలుపుతూ గులాబీ, ఇండోర్ మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు స్వామి, జగన్, పరమేష్, వెంకటేశ్వర్లు, ఏఎస్సై లాలయ్య, మహిళా ఏఎస్సై మేఘమాల, హెడ్ కానిస్టేబుల్ లలిత, కానిస్టేబుల్స్ ధనలక్ష్మి, రూప్సీ, శైలజ, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నేత పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-హయత్‌నగర్

బీఆర్ఎస్ నేత హయత్‌నగర్ డివిజన్ సీనియర్ నాయకుడు భాస్కర్ సాగర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఆయన నివాసంలో కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు గుడాల మల్లేష్, బాలక్రిష్ణ, బాలు నాయక్, వెంకటేష్, కృష్ణ, నగేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని వినతి

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

నూతన సంవత్సరం 2023ను పురస్కరించుకుని ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రికి ఎల్బీనగర్‌లోని పలు సమస్యలను వివరించారు. దశాబ్దాల కాలంగా రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గత కొన్ని రోజుల క్రితం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్యలను తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కారం కోసం 118 జీ.ఓ. తీసుకొచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. అందులో కొన్ని సవరణలు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఓపెన్ ప్లాట్స్ ఉన్న వారికి కూడా రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. అలాగే కొంతమంది నోటరీ ద్వారా ఇండ్లు కొనుగోలుచేయడం జరిగిందని అన్నారు. నోటరీ



డాక్యుమెంట్ ఉన్న వారికి కూడా రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. అలాగే లీగల్ ఎయిర్ సర్టిఫికెట్ లేనివారు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చేవిధంగా అనుమతించాలని కోరారు. అలాగే విదేశాల్లో ఉన్న వారికి కూడా ఆన్‌లైన్ లేదా వారి బంధువులు ద్వారా నమోదు చేసుకునే విధంగా అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే మరో పది, పదిహేను కాలనీల పేర్లు కూడా నమోదు చేయాలని కోరారు. ఫ్రూట్ మార్కెట్ రెండు ఎకరాల స్థలంలో 3000 గజాల స్థలంలో పోలీస్ స్టేషన్, 1200 గజాల స్థలంలో సబ్ స్టేషన్, 3000 గజాల స్థలంలో పార్క్, 500 గజాల స్థలంలో వాటర్ రిజర్వాయర్, 1500 గజాల స్థలంలో ఫైర్ ఇంజిన్ కోసం జీ.ఓ. ఇవ్వాలని కోరారు. అలాగే ఎల్.బి.నగర్ పోలీస్ స్టేషన్ మరియు నాగోల్ నందు నూతనంగా ఏర్పాటు కాబోతున్న పోలీస్ స్టేషన్ గురించి స్థలాల మంజూరు కోసం జీ.ఓ. ఇవ్వాలని కోరారు. వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ పక్కనే ఉన్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని మరియు పలువురు అధికారులను పిలిపించి వెంటనే జీ.ఓ. విడుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జీ.ఓ. రావడం వల్ల రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుంది అని తెలిపారు.

జలమండలిలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా తాను బాధ్యతలు చేపట్టి 7ఏండ్లు అవుతోందని, దీన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నానని ఎండీ దానకిశోర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ (జేఈఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఎండీ ముఖ్య అతిథిగా హాజరై జేఈఏ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ జలమండలి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వినియోగదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది సుంకిశాల శంకుస్థాపన, 31 కొత్త ఎస్టీపీల నిర్మాణం, ఓఆర్ఆర్ ఫేజ్-2 తదితర ముఖ్యమైన ప్రాజెక్టులు చేపట్టామన్నారు. తొందర్లోనే వీటిని పూర్తి చేస్తామని తెలిపారు. స్పెషల్ ప్రొటెక్షన్ టీమ్ (ఎస్‌పీటీ), యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం (ఏఎంఎస్), జియో ట్యాగింగ్ వంటి సంస్కరణలు చేశామని పేర్కొన్నారు. గుత్తేదారులను ఒకే తాటిపై తీసుకొచ్చి పనులు వేగంగా జరిగేలా చూశామన్నారు. సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వం, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం మరిన్ని నూతన ప్రాజెక్టులకు శ్రీకారం చుడతామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం బోర్డుపై నమ్మకముంచి అనేక బాధ్యతలు అప్పగించిందని, వాటిని జలమండలి సమర్థంగా నిర్వహించిందన్నారు. జలమండలి అధికారులు, ఇంజినీర్లు సమష్టి కృషితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్.ప్రవీణ్ కుమార్, ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, సీజీఎంలు, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి హరిశంకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శివాలయం పైకప్పు నిర్మాణానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా దేవాలయం పైకప్పు నిర్మాణానికి సహకార సంఘం చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డి సొంత డబ్బులు ఇవ్వడం హర్షనీయమని సర్పంచ్ తుడుం మల్లేష్ అన్నారు. సోమవారం గౌరెల్లి గ్రామం పంచాయతీ పరిధిలో స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం పక్కన ఉన్న శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా దేవాలయం పై కప్పు పనులను రైతు సేవ సహకార సంఘం చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డి, సర్పంచ్ తుడుం మల్లేష్‌లు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుడుం మల్లేష్ మాట్లాడుతూ దేవాలయం పునర్నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజేసిన లెక్కల విఠల్‌రెడ్డికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, సహకార సంఘం చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డిల సహకారంతో గ్రామ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు. అందుకు గ్రామస్తులు మరింత సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. దేవాలయ అభివృద్ధి కోసం విరాళాలు గాని, మొక్కుబడి కానుకలు ఇచ్చేవారు గుడి కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడి చైర్మెన్ శంకర్ యాదవ్, వైస్ చైర్మెన్ గ్యార ఆది స్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఎంపీటీసీ శుభాకాంక్షలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సోమవారం లష్కర్‌గూడ ఎంపీటీసీ సీక సాయికుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన అడుగుల్లో అడుగై ప్రజా సంక్షేమం కోసం తమ వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చక్రపాణి, నాతి ప్రసాద్, లింగం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీఐటీయూ కార్యకర్త మృతి



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం లేబర్ అడ్డా మాజీ అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్జీవోస్ కాలనీ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ సోమవారం ఉదయం తెల్లవారుజామున మూడున్నర గంటలకు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మరణించారు. ఆయన మృతి పట్ల సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య, సీపీఐ(ఎం), బి.ఎన్.రెడ్డి శాఖ కార్యదర్శి గణేష్‌గౌడ్ సంతాపం ప్రకటించారు. సత్యనారాయణ మరణం సీఐటీయూ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. పేదల కోసం జరిగే పోరాటాలలో పాల్గొన్న వ్యక్తి సత్యనారాయణ అన్నారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాల కొరకు డబుల్ బెడ్ రూమ్‌ల కొరకు పోరాటంలో పాల్గొని ఆ ఉద్యమాన్ని జయప్రదం చేశారని అన్నారు. వనస్థలిపురం గుడిసెల పోరాటంలో పాల్గొని పేదల పక్షాన పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనియన్ కార్యదర్శి ఆంజనేయులు, లేబర్ అడ్డా అధ్యక్షులు అంజయ్యగౌడ్, కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు మాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్‌లో శ్రీ సాయి హాస్పిటల్ వారి సౌజన్యంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని తుర్కయాంజల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనూరాధ రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 150 మంది తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. రోగులకు షుగర్ టెస్ట్, ఈసీజీ మెడిసిన్‌లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్, టీపీసీసీ సభ్యులు కొత్తకుర్మ శివకుమార్, కోఆప్షన్ సభ్యులు కుతుబ్ అలీ, కృష్ణవేణి స్కూల్ డైరెక్టర్ భవిత, మనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డా.రమేష్, డా.నిఖిత్ రెడ్డి, కాలనీవాసులు సంజీవన్‌రెడ్డి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హౌస్ అరెస్ట్



నవతెలంగాణ-ఎల్బీనగర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామపంచాయతీలకు నిధులు రాక సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని సోమవారం టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే ధర్నా కార్యక్రమానికి వెళుతున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు అల్కపురి కాలనీలో తన నివాసంలో మహేశ్వరం నియోజకవర్గం దేప భాస్కర్‌రెడ్డిని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, నల్లెంకి ధనరాజ్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ యాదవ్, తలటి రమేష్, బొడ్డుపల్లి మహేందర్, కల్యాణ్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రేమ్ నాయక్, భాస్కర్ నాయక్, సంతోష్, జంహగీర్, అనుదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు స్వాధీనం చేసుకోవాలి







నవతెలంగాణ-హయత్‌నగర్

గతంలో మంచి నీటి కుళాయిలు తక్కువగా ఉన్నాయని కొన్ని చోట్ల చేతి పంపులు కూడా ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు అధికారులు. తెలంగాణ వచ్చాక మిషన్ భగీరథ పేరుతో ఇంటింటికి నల్లా ఉండడంతో చేతి పంపుల వాడకం పూర్తిగా తగ్గిపోవడం జరిగింది. దీంతో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకోవాలని, లేకపోతే అవి చోరీకి గురయ్యే అవకాశాలు ఉన్నాయని కాలనీ వాసులు చెబుతున్నారు. హయత్‌నగర్‌లో కుమ్మరికుంట చెరువులో నీటిలో మునిగిపోయి ఒకటి, మాల బస్తీలో ఒకటి, మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ బస్తీలో రెండు చోట్ల చేతి పంపులు పడివున్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పత్రికలు నిజాలు తెలుసుకుని వార్తలు రాయాలి

ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

పత్రికలు నిజాలు తెలుసుకుని వార్తలు రాస్తేనే పాఠకులు అలాంటి పత్రికలను ఆదరిస్తారని ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఎల్బీనగర్‌లో ఉన్న ఆయన కార్యాలయంలో నవతెలంగాణ సంస్థ నిర్వాహకులు, తోటి ఎస్ఐలతో కలిసి 2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరిపైన అయినా వార్తలు రాసే సమయంలో ఇరువురు సమాచారం తీసుకోవాల్సిన అవసరం రిపోర్టర్‌కు ఉందన్నారు. ఆయన వెంట క్రైమ్



ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు, ఎస్ఐలు రవికుమార్, లింగారెడ్డి, మధుకుమార్, శంకర్, ఉమాశంకర్, నాగరాజు, ప్రతాప్‌రెడ్డితోపాటు నవతెలంగాణ సిటీ ఏడీవీటి ఇన్‌చార్జి భరత్ నాయక్, హయత్‌నగర్ ఏడీవీటి ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డిలు వున్నారు.

బార్లపై ఉన్న సోయి పాఠశాలలపై లేకపాయే

- ఫీజుల బకాయిలు విడుదల చేయకుండా బీసీలను విద్యకు దూరం చేసేందుకు కుట్ర
- విద్య, వైద్యాన్ని జాతీయం చేయకపోతే ప్రభుత్వాన్ని వదిలి పెట్టం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

నవతెలంగాణ-బోడుప్పల్



తెలంగాణ రాష్ట్రంలో గల్లికో బార్ షాపు ఏర్పాటు చేసేందు సుముఖత వ్యక్తం చేసే తెలంగాణ సర్కారుకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో చేపట్టిన బీసీ పోరు యాత్రలో భాగంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు వర్కల శివకిశోర్ గౌడ్ అధ్యక్షతన పీర్జాదిగూడ బండి కన్వెన్షన్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే విద్యను, వైద్యాన్ని జాతీయం చేస్తామని, కార్పొరేట్ విద్యను నియంత్రించి కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు చేసి అన్ని వర్గాలకు సమానమైనటువంటి అవకాశాలు కల్పిస్తామని గొప్పగా చెప్పినటువంటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నేటికి తెలంగాణ రాష్ట్రం వచ్చి 9 సంవత్సరాల అయినప్పటికీ ఇచ్చిన హామీని అమలు చేయకుండా, ఇదే పాలకులు విద్యను, వైద్యాన్ని వ్యాపారం చేస్తూ అంగట్లో సరుకుల్లా వేలం వేస్తున్నారని అన్నారు. బీసీలకు రాజ్యాంగపరంగా దక్కాల్సిన అన్ని హక్కుల సాధన కోసం బీసీ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పాలమూరు నుండి పట్నం వరకు 33 జిల్లాలు, 80 నియోజకవర్గాలు, 36 రోజులపాటు కొనసాగుతున్నటువంటి బీసీల పోరుయాత్ర నేడు మేడ్చల్ జిల్లాకు చేరుకుందని అన్నారు.

గత మూడున్నర సంవత్సరాలుగా ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడంలేదని, స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు పెరిగిన ధరల ప్రకారం పెంచడం లేదన్నారు. రాష్ట్రంలోని 12 లక్షల మంది ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం హరిగోస పెడుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాడు కాలేజీలకు తాళాలు పెట్టి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నటువంటి, పాఠశాలలు కళాశాలలు, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం ఫీజులు ఇవ్వకపోవడంతో కాలేజీలు నడిపించలేక తెచ్చిన అప్పులకు, వడ్డీలకు వడ్డీలు చెల్లించలేక మళ్ళీ నేడు కళాశాలలకు తాళాలు వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేటి విద్యార్థులే రేపటి పాలకులు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు శేఖర్ మామ, బీసీ విద్యార్థి సంఘం, కేంద్ర అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, బీసీ నాయకులు కుందారం గణేష్ చారి, బూదాని సదానందం, ఇంద్రం రజక, వరికుప్పల మధు, పానుగంటి విజయ్, ఆంజనేయులు యాదవ్, బండిగారి రాజు, మహేష్ గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమిష్టిగా జీఎస్ఐ అభివృద్ధికి కృషి చేయాలి

అదనపు డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్

నవతెలంగాణ-నాగోల్

సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అంతా సమిష్టిగా పనిచస్తూ జీఎస్ఐ అభివృద్ధికి కృషి చేయాలని జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్‌ఓడీ జనార్ధన్ ప్రసాద్ కోరారు. సోమవారం నాగోల్ డివిజన్లోని బండ్లగూడలో గల జీ.ఎస్.ఐ యూనిట్ పార్క్ ప్రాంగణంలో అఖిలభారతీయ జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు సౌత్ రన్ రీజియన్ చైర్మెన్ ఆదర్ల మహేష్, రీజినల్ కార్యదర్శి మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో చేయించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం నూతన సంవత్సర కేకును కోసి అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు అందించారు. ఈ సంవత్సరం అందరికీ మంచి జరగాలని సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మరియు



ఇన్‌చార్జి డీడీజీటీ అజయ్ కుమార్, ఏఈ పక్కి వరప్రసాద్, ఆదర్ల మహేష్, మధిర సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసురావు, ఆనంద్‌కుమార్‌లతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు వెంటనే అమలు చేయాలి

మహాజన ఉద్యమనేత మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ వచ్చిన తొలి నాళ్ళలో రాష్ట్రంలో అనాథ పిల్లల భవిష్యత్తుపై మాట్లాడుతూ అనాథ పిల్లలంటే ఎవరో కాదని, వారు ప్రభుత్వ బిడ్డలేనని, అనాథ పిల్లలకు తల్లి, తండ్రి ప్రభుత్వమేనని, వారికి ప్రతి జిల్లాలో వారికి ఒక ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని, మొదటి రెసిడెన్షియల్ పాఠశాలను యాదాద్రిలో నిర్మించి, భారత రాష్ట్రపతితో ప్రారంభిస్తామని 2015 జూన్ 23న ప్రకటించిన హామీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అనాథల పట్ల అంతనిర్లక్ష్యం పనికిరాదని, వారి సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మహాజన ఉద్యమనేత మందకృష్ణ మాదిగ గుర్తుచేశారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ముషీరాబాద్‌లోని అమన్ వేదిక స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న అనాథ పిల్లల వసతి గృహాన్ని ఆయన సందర్శించి, అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశృత సంస్థ ప్రోగ్రాం మేనేజర్ పర్వతాలు, అనాథ హక్కుల నాయకులు వెంకటయ్య, ఎమ్మెస్పీ నాయకులు మంథని సామ్యెల్ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకులు గండి కృష్ణ మాదిగ, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గజ్జల రాజశేఖర్ మాదిగ, సీనియర్ నాయకులు సిపెల్లి అశోక్ మాదిగ, గడ్డం శ్రీకాంత్ మాదిగ, అల్వాల సురేష్ మాదిగ, కుంబర్తి శివ మాదిగ, బుగ్గ రాజు మాదిగ పాల్గొన్నారు.



సీఎండీ ప్రభాకర్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ట్రాన్స్ కో అండ్ జన్‌కో సీఎండీ ప్రభాకర్‌కు విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అంజయ్య, ప్రెసి డెంట్ అశోక్, వైస్ ప్రెసి డెంట్ షరీఫ్, సభ్యులు వెంకటేశ్వర్లు, పరమేశ్, వీరాస్వామి, అనిల్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



తండ్రి మందలించాడని అన్నదమ్ముల అదృశ్యం

నవతెలంగాణ-జవహర్‌నగర్

తండ్రి మందలించాడనే కోపంతో ఇంటి బయటకు వెళ్ళిన ఇద్దరు అన్నదమ్ములు అదృశ్యమయ్యారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ వివరాల ప్రకారం యాప్రాల్‌లోని మణి ఎన్‌క్లేవ్ ప్రాంతంలో సుర్జీవ్‌కుమార్ మజీహి కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుర్జీవ్ కుమార్ మజ్హి చిన్న కుమారుడు బ్రిజేష్ కుమార్ బొల్లారంలోని కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా కుమారుడి వ్యవహారశైలిలో మార్పు వస్తుందని తండ్రి మందలించాడు. దీంతో బ్రిజేష్ కుమార్ మజా అతని బాబాయ్ కుమారుడు ప్రిన్స్ మాజీ వెంట పెట్టుకుని ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.17,500లను తీసుకుని సోమవారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'ప్రజావాణి' వినతులను వెంటనే పరిష్కరించేలా చర్యలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య

జిల్లా వ్యాప్తంగా 69 వినతుల స్వీకరణ

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం శామీర్‌పేటలోని కలెక్టరేట్



ప్రజావాణి హాల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి వచ్చిన 69 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి వీలైతే అక్కడికక్కడే పరిష్కరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వచ్చే ప్రజలకు అధికారులపై మరింత నమ్మకం పెరగడంతో పాటు ప్రజావాణిలో సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది

ఈఎస్‌సీఐ 2023 లక్ష్యాల సాధనకు ప్రణాళిక



డైరెక్టర్ జి.రామేశర్‌రావు వెల్లడి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త సంవత్సరంలో అనేక లక్ష్యాలు పెట్టుకున్నా మనీ, వాటిని సాధించడాని కి చర్యలు తీసుకుంటున్నట్టు ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు తెలిపారు. వాటిలో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

1.నైపుణ్యాలు, వ్యవస్థాపక సామర్థ్యాలను బలోపేతం చేయడం ద్వారా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉపాధిని మెరుగుపరచడం.

2.సమానత్వాన్ని పెంచడం, సాంకేతిక విద్యను పొందడం, మహిళలు, సామాజికంగాను, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలపై దృష్టి సారించడం, వృత్తి నైపుణ్యాన్ని బలోపేతం చేయడం.

3.మెరుగైన అవగాహన కోసం మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు తీసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించడం.

4.జ్ఞాన మార్పిడిని మెరుగుపరచడానికి ప్రతి ఏడాదీ ఇతర సంస్థలతో జ్ఞాన-భాగస్వామ్య వర్క్‌షాప్‌లను నిర్వహించడం.

5.శిక్షణ/ఇంటర్న్‌షిప్/ప్లేస్‌మెంట్ కోసం ప్రత్యేక ప్రయత్నాలు, మహిళలతో సహా బలహీన విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం.

6.స్టార్టప్‌లు, చిన్న, సూక్ష్మ సంస్థల కోసం ఈఎస్‌సీఐ క్యాంపస్‌లో ఇంక్యుబేషన్, కో-వర్కింగ్ స్థలాన్ని సృష్టించండి.

7.మల్టీ డిసిప్లినరీ విద్యను అందించడానికి, సాంకేతిక, ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనను మెరుగుపరచడానికి ప్రయత్నం.

8.విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి మానవ సామర్థ్యాల పెంపుదల, జెండర్ సెన్సిటైజేషన్ కార్యక్రమాలతో పాటు బోధనా శిక్షణ, అక్రిడిటేషన్, ప్రాయోజిత పరిశోధన, ఐపీఆర్, ఆవిష్కరణ, వ్యవస్థాపకత వంటి కార్యక్రమాలను నిర్వహించడం.

9.ఊరు-మన బడి 17 జిల్లాల్లో ఈ ఏడాది థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సర్వీసెస్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్లాన్, పెయింటింగ్, డ్యూయల్ డెస్క్ సరఫరా, వంటి వస్తువుల కోసం కొనసాగుతున్న, పూర్తయిన పనుల నాణ్యత తనిఖీ/పరీక్షల నిర్వహణ, గ్రీన్ చాక్ బోర్డ్, ఫర్నిచర్స్ వస్తువులు అంటే టీచింగ్ స్టాఫ్, లాబొరేటరీ, లైబ్రరీ ఫర్నిచర్ వంటి వాటిని పరిశీలించనున్నారు.

10.వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, ఐటీఐల ఫ్యాకల్టీలకు డొమైన్ నిర్దిష్ట, తరగతి గది నిర్వహణ శిక్షణ.

11.ఎంఎస్‌ఎంఈ ద్వారా ఎస్సీ, ఎస్టీ నిధుల కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు/నిరుద్యోగ యువత కోసం నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, అంచనాలు.

క్రీడాకారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 7, 8వ తేదీ వరకు బుడాపెస్ట్, హంగేరి దేశంలో జరిగే ఎఫ్ఐఈ జూనియర్ ఫెన్సింగ్ ఎస్ఏబీఆర్ ఈ వరల్డ్ కప్ పోటీలకు భారత్ తరపున ఆడేందుకు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ క్రీడాకారిణులు ఎం.బేబీరెడ్డి, కె.గౌరీ ఎంపికైన సందర్భంగా రాష్ట్ర అబ్కారీ, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా టోర్నమెంటుకు ఎంపికైన క్రీడాకారిణులకు క్రీడాశాఖ తరుపున ఆర్థిక సాయం రూ.3 లక్షలా 20 వేల చెక్కును అందజేశారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఫెన్సింగ్ స్టేట్మెంట్‌లో స్టేట్ మీట్‌లో బాలుర విభాగంలో పార్థసారథి బంగారం, ప్రకాష్‌కు కాంస్యం, బాలికల విభాగంలో అంజలికి బంగారం, హేమ వెండి, సాయి శరణ్య కాంస్యం, సిరివెన్నెల కాంస్యం, నందిని కాంస్యం, త్రివేణి కాంస్య పతకాలు సాధించిన సందర్భంగా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ డాక్టర్ హరికృష్ణ, స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్ కుమార్ బోస్, కోచ్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.



రాచకొండ సీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్ చౌహాన్‌ను సోమవారం స్టేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు వై.గోపిరెడ్డి, ఆ సంఘం హైదరాబాద్ అధ్యక్షులు ఎస్.శంకర్‌రెడ్డి, సైబరాబాద్ అధ్యక్షులు భద్రారెడ్డితోపాటు తదితరులు కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

నవోత్సవం అందరి జీవితాల్లో వెలుగులు తేవాలి

ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నవోత్సవం అందరి జీవితాల్లో వెలుగులు తేవాలి అని తెలంగాణ ఐటీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ సెక్రెటరీ జయేశ్ రంగన్ అన్నారు. బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో జరిగిన ఆసియా బిగ్గెస్ట్ న్యూ ఇయర్ బాష్ 2023 వేడుకల్లో జయేష్ రంజన్ కొత్త హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆయన రాజీవ్ రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జయేష్ మాట్లాడుతూ కోవిడ్‌తో గడిచిన రెండేండ్లు ప్రతి ఒక్కరూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ 2023 కొత్త సంవత్సరం అందరికీ నవోత్సవం నింపుతూ.. సరి కొత్త ఆశయాలతో సాగాలని ఆకాక్షించారు. కంట్రీ క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలీడేస్ సీఎండీ వై.రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరం.. సరి కొత్త ఆశయాలతో సాగేందుకు కంట్రీక్లబ్ 15వ ఎడిషన్‌గా ఈ ఆనందాల వేడుక జరుపుకుందన్నారు. దేశ వ్యాప్తంగా



హైదరాబాద్‌తోపాటు ముంబాయ్, ఢిల్లీ, కోల్‌కత్తా, అహ్మదాబాద్, సూరత్, బెంగళూర్, చెన్నై నగరాల్లోని తమ కంట్రీ క్లబ్‌లో ఈ వేడుకలను అత్యంత వినోదాత్మకంగా జరిగాయన్నారు అంతకు ముందు అలోహా థీమ్‌తో సాగిన ఈ వేడుకలో టాలీవుడ్ సినీ నటి స్నేహా గుప్తా వంటి తారలతో జరిగిన నృత్య ప్రదర్శనలు.. డీజే ఆసిఫ్ సంగీత హోరుతో యువతను హుషారెక్కించారు. టాలీవుడ్, బాలీవుడ్ మ్యూజిక్ సంగీత హోరులో వీక్షకులు డ్యాన్సులు.. కేరింతలతో ఉల్లాసంగా గడిపారు.

గంగపుత్ర సంఘం, సబ్జిమండి నూతన అధ్యక్షునిగా ఆనందేశి విజయ్ కిషోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



గంగపుత్ర సంఘం, సబ్జిమండి నూతన అధ్యక్షునిగా ఆనందేశి విజయ్ కిషోర్ ఎన్నికయ్యారు. సంఘం 202 3-24 సంవత్సరానికి గాను అధ్యక్ష ఎన్నికలు నిర్వహిం చారు. ఈ ఎన్నికలు ఎలక్షన్ కమిటీ చైర్మెన్ గాండ్ల నిరంజన్ బాబు, గుడుమని సదానంద్, మురారి రాంబాబు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో గంగపుత్ర సంఘం సర్వ సభ్యులు 95 శాతం మంది పాల్గొని నూతన అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ఎలక్షన్ చైర్మెన్, మాజీ అధ్యక్షులు గుడుమని అశోక్ కుమార్, సలహాదారులు, పెద్దలు కట్ట రాజయ్య, గుడబోయిన శివ రత్నం, కట్ట శివరాజ్, గుడమని అభిమన్యు, సంఘం సర్వ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్షునికి అభినందనలు తెలియజే యడంతోపాటు ఘనంగా సన్మానించారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

నవతెలంగాణ-బేగంపేట

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాలను సందర్శించిన రామ్‌గోపాల్‌పేట కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సికింద్రాబాద్ జనరల్ బజార్‌లో..

సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని శ్రీ లక్ష్మి నారాయణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, గుమిడెల్లి రవీందర్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కొమ్మాలు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు.

సికింద్రాబాద్ శ్రీ లక్ష్మీ నారాయణ దేవస్థానంలో



ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సికింద్రాబాద్ శ్రీ లక్ష్మీ నారాయణ దేవస్థానంలో కోనేరు వీధిలోని శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వసంత నర్సింగరావు, నాయకులు దయానంద రావు, సీ.కే.నరసింగ రావు, అంబాల ఈశ్వర బాబు.

కాప్రా : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మల్లాపూర్ డివిజన్, సూర్య నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలోని శ్రీ



వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించిన స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ ఆలయ కమిటీ సభ్యులు గౌరీశంకర్, పద్మారెడ్డి, అంజయ్య నర్సింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పవన్, పైళ్ల ప్రవీణ్, కుందన్, తదితరులు పాల్గొన్నారు.

మంగాపురం కాలనీలో..

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి పూజలు చేశారు. అనంతరం స్వామి వారి దర్శనం చేసుకున్న కుషాయిగూడ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సాయి కుమార్, అశోక్ రెడ్డి, ఉపేందర్ యాదవ్, స్థానిక నాయకులు.

ఏకాదశి వేడుకల్లో 'బొంతు' దంపతులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామిని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్-చర్లపల్లి కార్పొరేటర్



శ్రీదేవి యాదవ్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వీరేశం, ఆలయ అధికారులు, డివిజన్ నాయకులు నాగిళ్ళ బాల్‌రెడ్డి, విద్యాసాగర్, కనకరాజ్ గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ప్రభు గౌడ్, కొమ్ము సురేష్, జయ కృష్ణ, సంపత్, శ్రీకాంత్ రెడ్డి, దనుంజయ్ గౌడ్, సత్తిరెడ్డి, రాజు గౌడ్, నర్సింహ వంశరాజ్, సురేష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కనకయ్య సదానందం, సాయికిరణ్ గౌడ్, బాను, వంజరి ప్రవీణ్, ముత్యాలు, నజీర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మంగపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగపురం వెంకటేశ్వర స్వామి ఆలయం, కుషాయిగూడ, మల్లాపూర్, సూర్యనగర్ కాలోనీల్లో పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ ప్రభుదాస్, గొల్లూరి అంజయ్య, మాజీ డివిజన్ ప్రెసిడెంట్ వంజరి ప్రవీణ్, జలగం వెంకటేష్, సముద్రాల కృష్ణమూర్తి, పెరికె రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

కుషాయిగూడలో..



వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ కుషాయిగూడలోని శ్రీ వెంకటేశ్వర ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు డినాదం, చర్లపల్లి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కె.సురేందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ కన్వీనర్ ఎస్సీ సెల్ కొమ్ము నరసింహరావు, ఉప్పల్ అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్ తాళ్ల ఆనంద్ గౌడ్, ఉప్పల అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ ఎం.లక్ష్మణ్‌గౌడ్, మేడ్చల-మల్కాజిగిరి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్ : వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని చీర్యాల లక్ష్మీ నసింహ్మా స్వామి ఆలయంలో భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి లక్ష పుష్పార్చన, తులసి అర్చన పూజ కార్యక్రమాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ దంపతులు, సినీ నటుడు బాబు మోహన్‌ను ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ, ధర్మకర్త శ్రీవారి గౌడ్ పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతించారు.













నేషనల్ బౌల్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో సత్తా



నవతెలంగాణ-బంజారాహిల్స్

స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలోని న్యూ స్టార్ క్రికెట్ అకాడమీ వేదికగా నిర్వహించిన 'నేషనల్ బౌల్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ అండ్ ఫెడరేషన్ కప్ 2022'లో తెలంగాణ అథ్లెటిక్ క్రీడాకారులు సత్తా చాటారు. ఉమెన్స్ టీమ్‌లో శాలిని, పద్మ, భవ్య, జ్వలిత, ఆశారాణి, రాధారాణి, కవిత సిల్వర్ మెడల్స్, పురుషుల టీమ్‌లో ఎస్.వంశీధర్, వరుణ్‌కుమార్, పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, జలేంధర్, రాజ్‌కుమార్ భాస్కర్, జేపీ గౌతమ్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బౌల్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు డా.వంశీధర్ అథ్లెట్లకు అభినందనలు తెలిపారు.

కల్పనకు 'స్ఫూర్తి సేవారత్న' అవార్డు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త టి.కల్పనా 'స్ఫూర్తి సేవారత్న' అవార్డు అందుకున్నారు. స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో వ్యవస్థాపకుడు అధ్యక్షుడు ఆకుల రమేష్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మహిళలకు కౌన్సెలింగ్, స్కాలర్‌షిప్‌లపై అవగాహన కల్పించడం ద్వారా సామాజిక సేవలో కల్పనా సింగ్ చేసిన సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో గూడూరి చెన్నా రెడ్డి, జి. విజయలక్ష్మి, జి. శ్రీధర్ రెడ్డి, సి. శోభా రెడ్డి, బేబీ ఇషానీ సింగ్, జి. కల్యాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్
- 2023 క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ధూల్‌పేట్

మైనార్టీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆవాజ్ 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఇగ్బాల్ జావీద్, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు ఎం మీనా, శ్రావణ్ కుమార్ ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ సత్తార్, నగర నాయకులు షేక్ యాకూబ్, మహమ్మద్ కలిముద్దీన్, గులాం నసీర్, మహమ్మద్ ఫహీం, మహమ్మద్ అయుబ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన పెంపొందించాలి

- విజ్ఞానదర్శిని మహిళా టీచర్ల ఫెస్ట్-2023 ప్రారంభోత్సవంలో వక్తలు
- ఓయూలో సావిత్రిబాయి పూలే 192వ జయంత్యుత్సవాలు



నవతెలంగాణ-ఓయూ

విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించాలని వక్తలు సూచించారు. సావిత్రిబాయి పూలే 192వ జన్మదినాన్ని పురస్కరించుకొని విజ్ఞాన దర్శిని సంస్థ మూడేండ్లుగా నిర్వహిస్తున్న ఉమెన్స్ టీచర్స్ ఫెస్ట్ 2023 కార్యక్రమాన్ని సోమవారం ఓయూ మెకస్టర్ ఆడిటోరియంలో ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి మహిళా ఉపాధ్యాయులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇక్కడికి వచ్చారు. ఈసమావేశానికి విజ్ఞాన దర్శిని సంస్థ అధ్యక్షులు టి. రమేష్ అధ్యక్షత వహించారు. వక్తలుగా సీసీఎంబీ సైంటిస్ట్ వి.రాధా, మహాత్మా గాంధీ హెల్పింగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు గంటా రవీందర్, ప్రొ.బి.ఎస్.రెడ్డి, ప్రొ.కె.సుజాత హాజరై ప్రసంగించారు. సీసీఎంబీ సైంటిస్ట్ వి.రాధా మాట్లాడుతూ విద్యార్థుల్లో నేడు సృజనాత్మకత లోపిస్తుందని, సొంతంగా ఆలోచించే శక్తి సామర్థ్యాలు కోల్పోతున్నారన్నారు. ఇప్పుడు వస్తున్న ఆధునిక గ్యాడ్జెట్ల వల్ల వాటికి బానిసలుగా మారడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గమనించి ఎదుర్కోవాలని విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి సమాజానికి మంచి వైజ్ఞానిక దృక్పథం గల వ్యక్తులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు.

మహాత్మాగాంధీ హెల్పింగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు గంటా రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యనే గాక సమాజం పట్ల బాధ్యత సేవా తత్పరత తప్పక నేర్పించాలన్నారు. తద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని మూఢనమ్మకాలకు దూరంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు కోరారు. కోశాధికారి జి. తులసీరామ్ మాట్లాడుతూ మూడేండ్లుగా అనేక సైన్స్ కార్యక్రమాలతో పాటు సమాజసేవ, మూఢనమ్మకాల నిర్మూలన కోసం విజ్ఞాన దర్శిని సంస్థ అనే ప్రదర్శనలు చాలా చోట్ల నిర్వహించిందన్నారు. సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలన జరిగేందుకు తన వంతు కృషి చేస్తుందని అందుకోసం ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ విజ్ఞానాన్ని జోడించి పిల్లలకు విద్యాభ్యాసం చేయాలని, అలా చేస్తేనే వారికి సమాజం పట్ల సేవా దృక్పథం అలవడి మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు.

ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, ప్రొ.కె సుజాత మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దాదాపు 200 ఏండ్ల కిందటే వివక్షను ఎదుర్కొని అనేక సమస్యలను ఛేదించారని గుర్తుచేశారు. మహిళా విద్య కోసం తన ఇల్లునే పాఠశాలగా మార్చి మహిళలందరికీ విద్యాబోధన చేసేవారని ఈక్రమంలో చాలాసార్లు దాడులు జరిగాయన్నారు. వాటిని గట్టిగా ఎదుర్కొన్న మహిళగా నేడు మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ఆమె చరిత్రలో నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో విజ్ఞానదర్శిని సంస్థ నాయకులు నాస్తిక్ సూర్య, శోభారాణి, శ్రీతేజ, శివరాం, పరమేష్, విష్ణువర్ధన్, మహేష్, ఆఫ్రీన్, ఆలీ, సాగర్ పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

- జలమండలి ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, బోయినపల్లి వినోద్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మిక పక్షపాతి అని, హైదరాబాద్ నగర జలమండలి ఉద్యోగులు, కార్మికులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం జలమండలి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అనేక జీవోలు తెచ్చి అమలు చేస్తున్నారని అన్నారు. వాటర్ వర్క్స్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచే ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పులిమామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల మారయ్య, యూనియన్ నాయకులు సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు, ఆంజనేయులు, యాదగిరి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని ఓయూ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ అన్నారు. సోమవారం రాత్రి హబ్సిగూడా స్ట్రీట్ 8లోని గాంధీ గిరిజన బస్తీలో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరాల నియంత్రణ కోసం ప్రతి కాలనీ, వీధి, అపార్టుమెంట్స్‌లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.భార్గవి, జ్యోతి, ఉమా, స్వాతి, రమాదేవి పాల్గొన్నారు.

కమిట్‌మెంట్‌తో పనిచేయాలి: సీపీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర పోలీస్ కమిషనరేట్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని టీఎస్‌పీఐసీసీలోని ఆడిటోరియంలో మినిస్ట్రీయల్ స్టాఫ్, ఐటీ సెల్ స్టాఫ్, పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీ సీవీ ఆనంద్ ప్రతీ ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. ప్రతీ ఒక్కరు విధులతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. లైఫ్‌స్టైయిల్‌లో డైట్ చేయాలని కోరారు. మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్లాన్నారు. ఈ మధ్యకాలంలో ప్రారంభించిన 'ఫిట్ కాప్' గురించి వివరించారు. త్వరలోనే ట్విన్ టవర్స్‌లో క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గతేడాది ఎన్నో సవాళ్లను అధిగమించామని, ఈ ఏడాదికి సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేయాలన్నారు. ఈ ఏడాది పాత రికార్డులన్నీటినీ డిజిటలైజ్ చేస్తామని, సకాలంలో ఫైల్స్‌ను క్లియరెన్స్ చేయాలన్నారు. విధుల్లో ప్రతిభకనబర్చిన వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగుల కోసం మెట్రో స్టేషన్ నుంచి టీఎస్‌పీఐసీసీకి షటిల్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రంసింగ్ మెన్నన్, జాయింట్ సీపీలు ఎం.రమేష్, పి.విశ్వప్రసాద్, డీసీపీలు డి. సునితారెడ్డి, అలెక్స్, స్టేట్‌పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై.గోపిరెడ్డి, హైదరాబాద్ అధ్యక్షులు ఎస్.శంకర్‌రెడ్డితోపాటు సెక్షన్ సూపరింటెండెంట్స్, ఇతర విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, రంగోలి పోటీలు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాల చరిత్ర శాఖ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, రంగోలి పోటీలు నిర్వహించారు. హెడ్ ప్రొఫెసర్ జి.అంజయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదంచేస్తాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 4న మధ్యాహ్నం బహుమతులు అందజేయనునట్లు చెప్పారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ బి.లావణ్య, డా.ఇందిరా, ఈసీ మెంబర్ తలత్ సుల్తాన, డా.స్వాతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

- బీఆర్ఎస్వీ సీనియర్ నాయకుడు నల్ల మిథున్ ప్రసాద్

నవతెలంగాణ-ఓయూ

సీఎం కేసీఆర్ జన్మదినం (ఫిబ్రవరి 17) సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో త్వరలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్వీ సీనియర్ నాయకుడు నల్ల మిథున్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన 1వ, 2వ,3వ బహుమతులు ఇస్తున్నట్టు చెప్పారు. వివరాలు, నిర్వహిచబోయే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నల్లకుంట కార్పొరేటర్ వై అమృత అన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక శానిటేషన్ సిబ్బందితో కలిసి రోడ్ల పైన ఉన్న చెత్తని తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీల్లో ఎప్పటికప్పుడు నీట్‌గా ఉంచాలని సీజన్ వ్యాధులపైన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్

- క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మెన్ వి.హన్మంతరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఈనెల 19వ తేదీ నుంచి 40వ రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా అండర్-19 డే అండ్ నైట్ టీ20 క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మెన్ వి.హన్మంతరావు తెలిపారు. సోమవారం ఫతే మైదాన్ క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా వేదికగా గ్రామీణ, జిల్లా, రాష్ట్ర, జాతీయ, స్థాయిలో క్రీడా వేదికగా నిలుస్తుందని అన్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు శ్రీలంక, బంగ్లాదేశ్, తమిళనాడు, బెంగుళూర్, కర్ణాటక, తెలంగాణ, హర్యానా, ఢిల్లీ, బీహార్, విదర్భ, చెన్నై, మహారాష్ట్ర, సీఎఫ్ఐ, హైదరాబాద్, జట్లు పాల్గొంటాయని తెలిపారు. జనవరి 19 తేదీన టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ హైదరాబాద్ జట్టు శ్రీలంక జట్టుతో ఆడుతుందని చెప్పారు. అంబర్‌పేట జల మండలి క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎల్‌బీ స్టేడియం విజయానంద్ గ్రౌండ్స్, అంబర్‌పేట జల మండలి గ్రౌండ్‌లలో జనవరి 19 నుంచి 22 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జర్నల్ సెక్రెటరీ తారీక్ అన్వర్ హాజరవుతారని చెప్పారు కార్యక్రమంలో పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆది, అవినాష్, జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్‌గౌడ్, లక్ష్మణ్ యాదవ్, పి.నారాయణస్వామి, సద్గురు, రజినీకాంత్, మహేందర్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ మహంకాళి టెంపుల్ చైర్మెన్ ఎయిర్టెల్ రాజు ఆధ్వర్యంలో సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు మరింత సుఖ సంతోషంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓయూ: నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శోభన్ రెడ్డి డిప్యూటీ స్పీకర్ పద్మ రావు గౌడ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్ దత్‌ను ఓయూ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయిక్ మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో శాంతిభద్రతల సంరక్షణ కోసం కృషి చేయాలని కోరారు.

సుల్తాన్‌బజార్: తెలంగాణ ఉద్యమ నేత, గోషామహల్ నియోజకవర్గ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఆర్‌వీ మహేందర్ కుమార్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.







ఆలయాల్లో 'వైకుంఠ' శోభ



నవతెలంగాణ-బంజారాహిల్స్

శ్రీనగర్ కాలనీ సత్యసాయిని నిగమంలో ముఖ్యమంత్రి సతీమణి శోభా దేవి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు కార్పొరేటర్లు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, సామాజికవేత్తలు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

హిమాయత్‌నగర్: ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి ఉత్తర ద్వారా దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో హిమాయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు నర్సింగ్, నగర నాయకులు ప్రసాద్, లక్ష్మణ్ రావు, రామస్వామి, గోపి, సుధాకర్, శివ, సందీప్, కవిత, మాధవి, జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని గోల్నాక డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ వెంకటేశ్వర స్వామి గుడిలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీరామాంజనేయస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, దేవస్థాన కమిటీ సభ్యులు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్, నాయకులు రాగుల ప్రవీణ్‌పటేల్, దయాకర్‌యాదవ్, చీమ సురేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌గుప్త, ఆకుల మల్లేష్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.













నేడు ఉత్తమ పరిశోధనా అవార్డులు ప్రదానం

- యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో మెరుగైన పరిశోధనల దిశగా, అధ్యాపకులను ప్రోత్సహించేందుకు ఉత్తమ పరిశోధనా అవార్డును నేడు ప్రదానం చేయనున్నట్లు యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం తెలిపారు. ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించనున్న ఈకార్యక్రమానికి రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, డీఆర్డీఓ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ రెడ్డి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ బీజే రావు, సీనియర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రఘు కల్లూరి, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరుకానున్నారని చెప్పారు. పోటీతత్వం పెరిగేలా మెరుగైన పరిశోధనలు జరిగేలా అధ్యాపకులు, పరిశోధకుల మధ్య సహృద్భావ పోటీ పెంచేందుకు ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ గతేడాది నుంచి ఉత్తమ పరిశోధనా అవార్డు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. 2022లో ఈ అవార్డుకు గాను పదివేల రూపాయల నగదు, ప్రశంసాపత్రం, మెమెంటో ఇవ్వగా 2023కు గాను నగదు బహుమతిని రూ.25వేలలకు పెంచారు. కేవలం ఉస్మానియా అధ్యాపకులకే ప్రారంభించిన ఈ అవార్డును అనుబంధ కళాశాలలకు కూడా విస్తరించారు. ఈఏడాది 6 విభాగాల్లో ఈ అవార్డు ఇవ్వనున్నారు. అనుబంధ కళాశాలల వివిధ విభాగాల నుంచి దాదాపు 50 మంది అధ్యాపకులు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోగా క్యాంపస్ కళాశాలల నుంచి ఆయా విభాగాల డీన్లు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఏదైనా పరిశోధనకుగాను పేటెంట్ హక్కు పొందిన వారికి, విజయవంతంగా ప్రాజెక్టు పూర్తి చేసిన వారికి అదనంగా ఉపకులపతి ఉత్తమ రీసెర్చ్ అవార్డు ఇస్తున్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్‌లను ఆ సంఘం స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ యూనిట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కే.ఆర్. రాజ్ కుమార్, ఎం భాస్కర్ వారి కార్యవర్గం పూల బోకే అందించి శాలుతో ఘనంగా సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చందు, జాయింట్ సెక్రటరీ ఖలీద్ అహ్మద్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ బి. రవి, రుగేష్, జాయింట్ సెక్రటరీ ముక్తాదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫిరోజ్, ప్రచార విభాగం సెక్రటరీ ఎంవై రవి, ఈసీ సభ్యులు ప్రియదేవ్ ఠాకూర్, ముజాహిద్ అలీ, మొయినుద్దీన్, బి.కిరణ్, జంబయ్య, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో మాజీ సైనికుడు హఠాన్మరణం



నవతెలంగాణ-బాలానగర్

మిలటరీలో పనిచేసిన మాజీ సైనికుడు బూదాల లైమాన్ (64) సోమవారం తన నివాసంలో హఠాన్మరణం చెందారు. మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్.బి. శాస్త్రి నగర్‌లో నివాసముంటున్న లైమాన్‌కు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన కొంత కాలంగా ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలలో పాల్గొని అనేక అంశాలపై పోరాడారని జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు గుర్తు చేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వివిధ ప్రాంతాల దళిత సంఘాల నాయకులు ఆయన మతదేహం వద్ద నివాళులు అర్పించారు.

నిజాలు నిర్భయంగా రాసే పత్రిక నవతెలంగాణ

- గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు
- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అనుదినం జన స్వరంతో మీడియాలో పెరుగుతున్న పోటీ ప్రపంచంలో నిజాలు నిర్భయంగా రాస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేసే దిన పత్రిక నవతెలంగాణ అని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి రావు అన్నారు. సోమవారం నవతెలంగాణ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గాజుల రామారం డివిజన్ మహదేవపురంలోని శ్రీ మాత యోగా అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో సీనియర్ రిపోర్టర్ సరస్వతి నరేందర్ రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలబడుతూ సంచలమైన వార్త కథనాలు రాయడంలో నవ తెలంగాణకు సాటి మరొకటి లేదన్నారు. పాఠకుల మనోభావాలకు ను ఆకర్షించే విధంగా కథనాలు రాస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తుందన్నారు. నవతెలంగాణ యాజమాన్యం కరోనా విపత్కర సమయంలో సామాజిక సేవ కార్యక్రమాల చేయడంతోపాటు .సిబ్బందికి పేద ప్రజలకు నిత్యావసర సరుకుల తో పాటు పలు రకాలుగా సహాయ సహకారాలు అందించడం. అభినందనీయమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు. రావుల రాజు, శివకుమార్, మధు, నరసింహ, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



యువత క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యువత క్రీడల్లో ప్రతిభ కనబర్చి అనుకున్న గమ్యాన్ని చేరాలని బిగ్ బ్లాస్ట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు మహమ్మద్ నాహీద్, మహమ్మద్ హాజీలు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బిగ్ బ్లాస్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్‌ను రంగారెడ్డి నగర్ డివిజన్ గురుమూర్తి నగర్ లోని ఈద్గా మైదానంలో నిర్వహించారు. సుమారు 35 జట్ల వరకు ఈ పోటీల్లో పాల్గొన్నాయని తెలిపారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాబి టీం విజేతలుగా, ఈశ్వర్ టీంలు రన్నర్స్‌గా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సమయాన్ని వథా చేసుకోకుండా చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకొని ముందు కెళ్లాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దేహ దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన టీములకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని 14, 15 తేదీల్లో మరోసారి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని వారు తెలిపారు.

అంతర్గత రోడ్ల నిర్మాణాలతో సాఫీగా ప్రయాణం

- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా సాఫీగా ప్రయాణం సాగించాలని అంతర్గత రహదారుల నిర్మాణాలను నిర్మిస్తున్నామని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. సోమవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ శివాలయం వీధిలో నూతనంగా రూ. 20 లక్షల వ్యయంతో వేసిన వీడీసీసీ రోడ్డు పూర్తి కావడంతో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జీహెచ్ఎంసీ ఏఈ మహమ్మద్ రషీద్, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కష్ణారావు సహకారంతో నిధులు వెచ్చించి దశలవారీగా అభివద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా సంక్షేమ పథకాల ఎలాంటి వివక్షకు తావివ్వకుండా అన్ని వర్గాల వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సురేందర్ రెడ్డి, సదానంద, యాదయ్య, పొట్ట శంకర్ గౌడ్, మల్లారెడ్డి, ఎడ్ల అశోక్, నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, కృష్ణమూర్తి, సభాపతి రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో కాంగ్రెస్ నాయకుల అరెస్టు



నవతెలంగాణ-బాలానగర్

కాంగ్రెస్ పార్టీ సోమవారం తలపెట్టిన ధర్నా నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ మేరకు బాలానగర్ 120 డివిజన్ కాంగ్రెస్ నాయకులను బాలానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలానగర్ హడక్ కమిటీ అధ్యక్షులు మట్టె ప్రసన్న కుమార్, ముత్యాలు ముదిరాజ్, నాగరాజు, ఎండి. ఇమ్రాన్, పరశురాం, యుగంధర్, సాయి తదితరులు ఉన్నారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలి వేశారు.

జీవో 59 చలాన్ చెల్లింపు రేట్లపై గందరగోళంలో ప్రజలు

- సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్
- అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన జీఓ 59తో ఎంతో మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు అధికారులు చలాన్ రూపంలో నోటీసులు పంపించిన తీరుపై బెంబేలెత్తిపోతున్నారని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సైతం అధికారులు చలానా విషయంలో ఎక్కడ పొంతన లేకుండా ప్రజలకు నోటీసులు జారి చేశారని ఇప్పటికైనా అధికారులు పునర్ పరిశీలించాలని కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలోని ప్రజావాణిలో ఆయన నేతృత్వంలో అడిషనల్ కలెక్టర్ ఏనుగుల నర్సింహ రెడ్డికి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 59లో అనేక అవకతవకలు ఉన్నాయన్నారు. వాటిని సరిచేసి ప్రజలు ఆందోళన చెందకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. బాచుపల్లి మండల పరిధిలో ప్రభుత్వ లెక్కల ప్రకారం గజం స్థలం రూ. 21000 ఉందన్నారు. అయితే చాల మందికి నోటీస్‌లో తప్పుడు లెక్కలు వచ్చాయని దాంతో ప్రజలు గందరగోళంలో ఉన్నారన్నారు. మూడు నుండి ఐదు లక్షలు వచ్చిందని అన్నారు. 2014 ప్రభుత్వం లెక్కల ప్రకారం ఎంత ఉంటే అందులో 25 శాతం మాత్రమే నోటీసులో పంపాల్సి ఉండగా ప్రస్తుతం ఉన్న రేటుకు 100 శాతం వేసి నోటీసులు పంపారని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం, ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కారించి ప్రజలు ఆందోళన చెందకుండా చూసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ. యాదయ్య, బాలానర్సమ్మ ఏ. నగేష్, తదితరులు పాల్గొన్నారు.



టీఎస్‌యూటీఎఫ్ క్యాలండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-శామీర్‌పేట

మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ దాసరి ఎల్లూభాయిబాబు శామీర్‌పేట ఎం ఈ ఓ వసంత కుమారి, టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహ రెడ్డి లతో కలిసి టీఎస్‌టీ యూటీఎఫ్ 2023 క్యాలండర్‌ను ఎంపీపీ ఎల్లూభాయిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు సూపరింటెండెంట్ సంపత్ కుమార్, టీఎస్‌టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు తిరుమలేష్ , ఉపాధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి కుమార్, జిల్లా కార్యదర్శి నర్సింగ్ రావు, లాల్ గడి మలక్‌పేట్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు గురుచారి, ఉపాధ్యాయులు నాగ పూర్ణిమ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి



నవతెలంగాణ-శామీర్ పేట

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడానికి పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తుందని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ అన్నారు. మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షులు పి. మల్లికార్జున రావు అధ్యక్షతన సోమవారం మూడుచింతలపల్లి మండల శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి. భిక్షపతి పీఆర్‌టీయూటీఎస్ మూడుచింతలపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు సి.రాజిరెడ్డి, టి. శ్రీనివాసబాబు, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీ యూటీఎస్ మూడు చింతలపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఎన్నికైన భిక్షపతికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

మెట్రోలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలానగర్ అని రావాలి

- అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం



నవతెలంగాణ-బాలానగర్

మెట్రో రైలు లోపల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలానగర్ అని వాయిస్ రూపంలో ప్రకటన వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం కోరారు. బేగంపేటలోని మెట్రో రైల్ భవనంలో మెట్రో రైల్ ఎండి ఎన్.వి.ఎస్.రెడ్డిని సోమవారం ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దళిత ప్రజా సంఘాల పోరాటం ఫలితంగా ఈ స్టేషన్‌కు ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలానగర్ స్టేషన్‌గా నామకరణం చేసిందన్నారు. కానీ మెట్రో రైల్ లోపల వచ్చే వాయిస్ ప్రకటనలో కేవలం బాలానగర్ అనే మాత్రమే వస్తుందన్నారు. అలాకాకుండా ప్రభుత్వ నిర్ణయం మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలానగర్ స్టేషన్ అనే ప్రకటన వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిత్తారి అశోక్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొవొల్ల విజయ్ కుమార్, అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర కార్యదర్శి బి.నాగ శ్రీనివాస్, రాష్ట్ర యువజన కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, అంబేద్కర్ ప్రజా సంఘం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ జెడి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించండి

- టీపీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

కాంగ్రెస్ నాయకుల అరెస్టును టీపీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తుంటే పోరాటాన్ని అణచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం వారిని అరెస్ట్ చేయడం చాలా దారుణమన్నారు. సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, వారికి నిధులు వచ్చేదాకా పోరాటం చేస్తుందన్నారు. అనేక మంది సర్పంచులు నిధుల కోసం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. దానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్నారు. అనేక మంది సర్పంచులు భిక్షాటన చేస్తున్నారని, దీనికి బాధ్యత వహించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని తెలిపారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి సర్పంచ్‌లను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం దుర్మార్గం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివా రెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపేందుకు వస్తున్న సర్పంచులను, వారికి మద్దతు తెలిపేందుకు వస్తున్న ఎంపీ రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను, ఎక్కడికక్కడ బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దురదృష్టకరమని కందాడి జ్యోత్స్న శివారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నేతలను అరెస్టు చేయడం, కాంగ్రెస్ నేతలను హౌస్ అరెస్టులు చేసి విపక్షాలను అడ్డుకోవడం చాలా దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు ప్రతీ ఒక్కరికి ఉంటుందని, శాంతియుతంగా నిరసన తెలిపేవారి నోరు నొక్కేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం దిగివచ్చే వరకు, సర్పంచులకు రావలసిన నిధులు ఇచ్చేవరకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్న శివా రెడ్డి హెచ్చరించారు.



నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోరదల నరేష్ సోమవారం తన కార్యాలయంలో వివేకానంద డిగ్రీ కాలేజ్ ,సంఘమిత్ర కాలేజ్‌ల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ మని భూషణ్ చారి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి హరికష్ణ, ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, నవీన్ భూపాల్ రెడ్డి, నర్సింగ్ రావు, గోపాలరావు, రాజు, రాజిరెడ్డి, లత తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలకు సందర్శకుల తాకిడి


కుత్బుల్లాపూర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వైకుంఠ ఏకాదశి వేళ జంట సర్కిలలోని ఆలయాల్లో సందర్శకుల తాకిడి పెరిగింది. గాజులరామారం సర్కిల్‌లోని ప్రముఖ దేవాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. కుత్బుల్లాపూర్ గ్రామంలో గల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్ర మాలకు ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ శ్రీ వేణుగోపాల స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని వేడుకుంటు న్నామన్నారు. వేడుకలను నిర్వహించిన యువ నేస్తం ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మేడ్చల్

మేడ్చల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ లక్ష్మీ నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ మండల రవీందర్ గౌడ్,మున్సిపల్ కో అప్షన్ సభ్యులు సొంగరి జయశ్రీ జనార్ధన్ రెడ్డి, ఆలయ కమిటి డైరెక్టర్ దొడ్ల మధుసూదన్, అర్చకులు శ్రీనివాస్ చారి, శ్రీనికేతన్ తదితరులు పాల్గొన్నారు.


దుండిగల్

దుండిగల్ : నిజాంపేట్ లోని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన నిజాంపేట్ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయములో విశేషంగా ఆలయ ధర్మకర్త, చైర్మెన్ కొలను శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూలవిరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఉత్సవ విగ్రహంను కూడా ప్రత్యేక పూజల నిర్వహించారు. బౌరంపేట్ 16 వార్డు కౌన్సిలర్ నర్సిగారి శ్రీనివాస్ రెడ్డి , బాచుపల్లి ఎస్సై, లాలయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

డ్రగ్స్ కేసులో ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

డ్రగ్స్ కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరిని నార్కొటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్టు చేశారు. కొద్ది నెలల క్రితం బంజారాహిల్స్‌లో డ్రగ్స్ తీసుకున్నారని పబ్‌పై కేసునమోదు చేసిన విషయం తెలిసిందే. కొండాపూర్‌కు చెందిన మోతీ అగర్వాల్, బంజారాహిల్స్‌కు చెందిన మన్యం క్రిష్ణ కిషోర్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు గ్రాముల కొకైన్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సీలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలి

నవతెలంగాణ-దుండిగల్

ఎస్సీలకు సాగు కోసం ప్రభుత్వం అనేక సంవత్సరాల క్రితం ఇచ్చి మరల అసైన్డ్ భూమి పేరుతో తిరిగి తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు చేపట్టిందని, బాధితులకు భూమికి బదు లు ఆ ఇండ్లను కేటాయించాలని సీపీఐ బాచుపల్లి మండల కార్య దర్శి పాల బిందెల శ్రీనివాస్ తెలిపారు. బాచుపల్లి మండల పరిధి లోని సర్వే నెంబర్ 186లోని 2 ఎకరాల ఎస్సీలకు (మాదిగలకు) సంబంధించిన లావుని పట్టాపై సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అధ్వర్యంలో బాధితులతో కలిసి ప్రజావాణిలో ఆడిషనల్ కలెక్టర్ ఏనుగుల నర్సింహ రెడ్డికి పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని సర్వే నెంబర్ 186లో గల ఎస్సీలకు సంబంధించిన లావణ్య పట్ట 2 ఎకరాలు గత చాల ఏండ్లుగా సాగు చేసుకొని బతుకుతూ ఉన్నారని అలాంటి స్థలంలో ప్రభుత్వం అసైన్డ్ భూమి పేరుతో వారి నుండి తిరిగి లాక్కొని డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించడం జరిగిందని తెలిపారు. సాగుకు కేటాయించిన వారికీ సంబంధించిన 2 ఎకరాల లావుని పట్టాకు బదులుగా డబుల్ బెడ్ రూమ్ లు వారికీ కేటాయింపులు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.బాలానర్సమ్మ ఏ. నగేష్, ఏ.దీప, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు చర్యలు


నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సందర్శకులు పోటెత్తారు. కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆయన సతీమణి కొలుకుల శశికళ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు . ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ నెల చివరి వారంలో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తగిన ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ ఈవో కృష్ణమాచార్యులు, మాజీ ఆలయ చైర్మెన్ సుధాకర్ రావు, యూత్ నాయకులు కొలుకుల జైహింద్, ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషిని రామా చార్యులు, డివిజన్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్, మహిళ అధ్యక్షు రాలు బింగి ఇంద్ర శ్రీహరి గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధ గాని మల్లేష్ గౌడ్, గుజ్జుల పాపిరెడ్డి, పేర్తి విఠల్, మునిపల్లి జనార్ధన్, మాయకోటి ప్రభాకర్, వెంకటేష్, ఆలయ సిబ్బంది నాగేష్ పాల్గొన్నారు.



విజయశాంతిని కలిసిన కార్పొరేటర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ పాలక్‌గా బీజేపీ సీనియర్ నాయకురాలు, విజయశాంతిని నియమిం చగా వారి నివాసంలో కార్పొరేటర్ కోడిచెర్ల మహేం దర్ బీజేపీ డివిజన్ నాయకులు కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాన్ని సందర్శించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ వైకుంఠ ఏకాదశి సందర్భంగా జగద్గిరి గుట్టలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి సత్యనారా యణకు వేదాశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు అంద జేశారు.





కొత్త ఏడాదిలో నయా పంథా!

- పొట్టి ఫార్మాట్‌లో సరికొత్తగా భారత జట్టు
- భారత్, శ్రీలంక తొలి టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

2023 వన్డే వరల్డ్‌కప్ ఏడాది. టీ20లకు పెద్దగా ప్రాధాన్యత ఉండదు. అయినా, కొత్త ఏడాదిలో టీమ్ ఇండియా పొట్టి పోరు ఆసక్తి సంతరించుకుంది. యువ జట్టుతో కూడిన టీమ్ ఇండియా.. 20 ఓవర్ల ఆటలో సరికొత్త పంథాలో దూసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. భయమెరుగని క్రికెట్, బ్రేకుల్లేని దూకుడు ఆట తీరుకు శ్రీలంకతో సిరీస్‌లో నాంది పడనుంది!. ఆసియా చాంపియన్స్ శ్రీలంకతో భారత్ తొలి టీ20 పోరు నేడు.

నవతెలంగాణ-ముంబయి

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ షమి, జశ్‌ప్రీత్ బుమ్రా.. భారత ప్రథమ ప్రాధాన్య ఆటగాళ్లు. శ్రీలంకతో టీ20 సిరీస్‌లో ఈ ఆటగాళ్లు ఎవరూ లేరు. విభిన్న కారణాలతో టీ20 సిరీస్‌కు దూరమైనా.. యువ జట్టును బరిలోకి దిగనుండటం యాదృచ్ఛికం కాదు. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ దిశగా టీమ్ ఇండియా యువ క్రికెటర్లతో కూడిన జట్టును సిద్ధం చేయటంలో భాగంగానే ఈ సిరీస్‌ను చూడాలి. యువ నాయకుడు హార్దిక్ పాండ్య సారథ్యంలో భారత్ నూతన ఏడాదిని విజయంతో మొదలుపెట్టేందుకు ఎదురుచూస్తోంది. దశున్ శనక నాయకత్వంలోని లంకేయుల సేన సవాల్ విసిరేందుకు సిద్ధంగా ఉండగా.. నేడు వాంఖడేలో భారత్, శ్రీలంక తొలి టీ20 మ్యాచ్.



యువ జోరు

వరుసగా రెండు ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లలో పేలవ ప్రదర్శన చేసిన భారత్.. 2024 టీ20 ప్రపంచకప్‌కు ముందు చూపుతో వెళ్లనుంది. సీనియర్ ఆటగాళ్లను పక్కనపెట్టి యువ జట్టును వచ్చే ఏడాది మెగా వార్‌కు సన్నద్ధం చేయనుంది. ఈ ప్రక్రియకు శ్రీలంకతో టీ20 సిరీస్ నాంది కానుంది. నిరుడు జూన్‌లో దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో సీనియర్ ఓపెనర్లు అందుబాటులో లేని వేళ రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ ఆరంభించారు. బంగ్లాదేశ్‌పై ధనాధన్ ద్వి శతకంతో ఇషాన్ కిషన్ జట్టు మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని సంపాదించాడు. రుతురాజ్ గైక్వాడ్ దేశవాళీ సీజన్‌లో శతకాల మోత మోగించాడు. ఈ ఇద్దరూ నేడు ఓపెనర్లుగా రానున్నారు. శుభ్‌మన్ గిల్ అరంగేట్రం కోసం వేచి చూడక తప్పదు. అయితే తొలి 10 బంతుల్లో రుతురాజ్ 98.33, కిషన్ 111.26 స్ట్రయిక్‌రేట్ కలిగి ఉన్నారు. దూకుడు మంత్ర పఠించే యువ జట్టు ఓపెనర్లుగా ఈ జోడీ తొలి బంతి నుంచీ ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నించాలి. పొట్టి ఫార్మాట్ ఉత్తమ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ భారత్‌కు కీలకం. సంజు శాంసన్, హార్దిక్ పాండ్య, దీపక్ హుడాలు బ్యాట్‌తో కీలకం కానున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ తుది జట్టులో నిలువనున్నాడు. ఆరు మాసాల క్రితమే అరంగేట్రం చేసిన యువ పేసర్ అర్షదీప్ సింగ్ నేడు భారత పేస్ దళానికి సారథ్యం వహించనున్నాడు. ఉమ్రాన్ మాలిక్, హర్షల్ పటేల్‌తో కలిసి పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో బెంచ్‌కే పరిమితమైన యుజ్వేంద్ర చాహల్.. అక్షర్ పటేల్‌తో పోటీపడుతున్నాడు. లోతైన బ్యాటింగ్ లైనప్ అవసరమైతే అక్షర్ పటేల్‌ను ఎంచుకునే వీలుంది. రాహుల్ త్రిపాఠికి ఈ సిరీస్‌లో కచ్చితంగా ఓ అవకాశం దక్కనుంది.



ఆసియా ఉత్సాహం

2022 టీ20 ప్రపంచకప్ అనంతరం శ్రీలంక జట్టు పొట్టి ఫార్మాట్‌లో ఆడలేదు. భారత్ ఆసీస్ నుంచి నేరుగా న్యూజిలాండ్‌కు వెళ్లింది. అక్కడ టీ20 సిరీస్‌లో పైచేయి సాధించింది. ప్రపంచకప్‌లో తేలిపోయినా.. దశున్ శనక సారథ్యంలోని శ్రీలంక మెరుగైన జట్టు. యువ క్రికెటర్లతో కూడిన భారత్ కొత్త బాధ్యతలకు అలవాటు పడేందుకు సమయం పట్టవచ్చు. కానీ శ్రీలంకకు అటువంటి పరిస్థితి లేదు. అండర్‌డాగ్‌గా బరిలో నిలిచి ఆసియా చాంపియన్‌గా అవతరించిన సైతం టీ20 సిరీస్‌లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. నిశాంక, కుశాల్ మెండిస్, అసలంకకు తోడు భానుక రాజపక్స, శనకలు ఆ జట్టుకు కీలకం కానున్నారు. ఇక స్పిన్నర్ వానిందు హసరంగ భారత్‌కు సవాల్ విసరనున్నాడు. భారత్‌పై ఏడు టీ20ల్లో 10 వికెట్లు పడగొట్టిన హసరంగ 6.79 ఎకానమీతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. లోయర్ ఆర్డర్‌లో హిట్టింగ్ చేయగల హసరంగను నేడు భారత్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. మహీశ్ తీక్షణ తోడుగా హసరంగ స్పిన్ మాయ చేయనున్నాడు. దిల్షాన్ మధుశంక, లహిరు కుమారలు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

పిచ్, వాతావరణం

వాంఖడే పిచ్ సహజంగానే పరుగుల వరదకు చిరునామా. ఇక్కడి చిన్న బౌండరీలు బ్యాటర్లకు రెట్టింపు ఉత్సాహం అందిస్తాయి. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్టుకు విజయావకాశాలు అధికం. గత రెండేండ్లలో ఇక్కడ జరిగిన 41 టీ20ల్లో 24 మ్యాచుల్లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన విజయం సాధించింది. భారత్, శ్రీలంక టీ20 మ్యాచ్‌లోనూ అటువంటి ఫలితమే పునరావృతం కావచ్చు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. ఎటువంటి వర్షం సూచనలు కనిపించటం లేదు!.

తుది జట్లు (అంచనా)

భారత్ : ఇషాన్ కిషన్, రుతురాజ్ గైక్వాడ్, సూర్యకుమార్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య (కెప్టెన్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, హర్షల్ పటేల్, అర్షదీప్ సింగ్, ఉమ్రాన్ మాలిక్, యుజ్వేంద్ర చాహల్.

శ్రీలంక : నిశాంక, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), ధనంజయ డిసిల్వ, చరిత్ అసలంక, భానుక రాజపక్స, ధసున్ శనక (కెప్టెన్), వానిందు హసరంగ, చామిక కరుణరత్నె, మహీశ్ తీక్షణ, దిల్షాన్ మధుశంక, లహిరు కుమార.

ఇక కిల్లర్ జెర్సీ

నూతన ఏడాదిలో భారత క్రికెట్ జట్టు కిట్, లోగో స్పాన్సర్‌షిప్ చేతులు మారింది. శ్రీలంకతో తొలి టీ20 మ్యాచ్‌లో భారత క్రికెటర్లు నూతన జెర్సీలు ధరించనున్నారు. డిజైన్ పరంగా ఎటువంటి మార్పులు లేకపోయినా.. కిట్ స్పాన్సర్, లోగో స్పాన్సర్‌గా ఎంపీఎల్ స్థానంలో కిల్లర్ రానుంది. కెవాల్ కిరణ్ క్లాతింగ్ కంపెనీ లిమిటెడ్‌కు ఈ ఏడాది డిసెంబర్ వరకు హక్కులు బదలాయిస్తూ ఎంపీఎల్ నిశ్చయించింది. మార్చి వరకు కొనసాగాలని బోర్డు కోరినా.. ఎంపీఎల్ విముఖత చూపింది. దీంతో కిల్లర్ జీన్స్ వేర్ తయారీ సంస్థ కిట్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. మరో స్పాన్సర్ బైజూస్ సైతం వైదొలిగేందుకు సిద్ధంగా ఉంది. మార్చి అనంతరం బీసీసీఐ కొత్త స్పాన్సర్‌షిప్ కోసం టెండర్లు పిలిచే అవకాశం కనిపిస్తోంది.



శాట్స్ చైర్మెన్‌గా ఆంజనేయ గౌడ్

- నియమించిన ముఖ్యమంత్రి కెసిఆర్
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్‌గా ఈడిగ ఆంజేయ గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు శనివారం ప్రగతి భవన్‌లో నియామక పత్రాన్ని ఆంజేయగౌడ్‌కు అందజేశారు. గతంలో బిసి కమిషన్ సభ్యులుగా పనిచేసిన ఆంజనేయ గౌడ్ రెండేండ్ల పాటు పదవిలో ఉండనున్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆంజనేయ గౌడ్ తెలిపారు.

నవ్రతిలోవాకు క్యాన్సర్



న్యూఢిల్లీ : టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నం.1 మార్టినా నవ్రతిలోవా క్యాన్సర్ బారిన పడింది. సోమవారం నిర్వహించిన వైద్య పరీక్షల్లో నవ్రతిలో వాకు గొంతు, రొమ్ము క్యాన్సర్ ఉన్నట్టు బయటపడింది. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో కలిపి 59 గ్రాండ్‌స్లామ్ విజయాలు సాధిం చిన మార్టినా నవ్రతిలోవా అత్యు త్తమ టెన్నిస్ క్రీడాకారుల్లో ఒకరు. చెక్‌రిపబ్లిక్ కు చెందిన మార్టినా నవ్రతి లోవా 1981లో అమెరికా పౌరసత్వం తీసుకుంది. 2010లో రొమ్ము క్యాన్సర్‌ను జయించిన నవ్రతిలోవా వచ్చే వారం నుంచి చికిత్స అందుకోనుంది.

తేలాల్సింది గాయాలే?

ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు
నిలకడగా రిషబ్ పంత్ ఆరోగ్యం



డెహ్రాడూన్ : భారత యువ క్రికెటర్ రిషబ్ పంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రిషబ్ పంత్‌ను ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) నుంచి సాధారణ వార్డుకు మార్చారు. డిసెంబర్ 30న రిషబ్ పంత్‌కు ఎంఆర్ఐ స్కాన్ చేశారు. మెదడు, వెన్నుపూసకు సంబంధిత పరీక్షలు నిర్వహించి ఎటువంటి అపాయం లేదని నిర్ధారించారు. అయితే, రిషబ్ పంత్ ఇప్పటికీ నడువలేని స్థితిలో ఉన్నాడు. దీంతో వైద్యులు పంత్‌కు చేయాల్సిన మరిన్ని స్కానింగ్స్ చేయలేదు. రోడ్డు ప్రమాదంలో రిషబ్ పంత్ మోకాలు, చీలమండ, కాలు బొటనవేలుకు గాయమైందని ప్రాథమికంగా వైద్యులు వెల్లడించారు. గాయం తీవ్రత తెలుసుకునేందుకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయాల్సి ఉంది. ఇందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. రిషబ్ పంత్ ఆరోగ్య పర్యవేక్షణకు బీసీసీఐ వైద్య కమిటీని నియమించింది. డెహ్రాడూన్‌లోని మాక్స్ హాస్పిటల్ వైద్యబృందంతో కలిసి బీసీసీఐ మెడికల్ టీమ్ పంత్ చికిత్సను పర్యవేక్షిస్తోంది. ముఖంపై గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ చేసినా.. పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు ఎంత సమయం పట్టనుందని ఎంఆర్ఐ స్కాన్ నివేదికల అనంతరమే తేలనుంది. భారత క్రికెట్ ఈ ఏడాది బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్, వన్డే వరల్డ్‌కప్ సహా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ కోసం సిద్ధమవుతోంది. ఈ మూడు ప్రణాళికల్లోనూ రిషబ్ పంత్ కీలకం. ఇక, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్సీ వహిస్తున్న రిషబ్ పంత్ ఈ ఏడాది సీజన్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

నవచిత్రం

పండగలాంటి సినిమా



చిరంజీవి


చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి (కెఎస్ రవీంద్ర) కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. అభిమానులకు, ప్రేక్షకులకు థియేటర్లలో పూనకాలు తెప్పించడానికి ఈ సినిమా సిద్ధంగా ఉంది. చిరంజీవి, రవితేజ పాత్రల ఇంట్రడక్షన్ గ్లింప్సెస్‌తో పాటు, ఇద్దరూ కలసి అలరించిన 'పూనకాలు లోడింగ్' పాటకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇక ఆల్బమ్‌లోని 'బాస్ పార్టీ, నువ్వు శ్రీదేవి నేను చిరంజీవి, వాల్తేరు వీరయ్య టైటిల్ ట్రాక్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'వాల్తేరు వీరయ్య' తాజాగా సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికేట్ ఇచ్చింది.

పాటలు, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్ సీక్వెన్స్, ఎమోషన్స్ అద్భుతంగా ఉన్నాయని, చిరంజీవి, రవితేజలని కలసి తెరపై చూడటం పండగలా ఉందని సెన్సార్ బోర్డ్ సభ్యులు ఈ చిత్ర యూనిట్‌ని అభినందించారు అని మేకర్స్ తెలిపారు.

చిరంజీవి సరసన శృతిహాసన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. జికె మోహన్ సహ నిర్మాత. ఆర్థర్ ఎ విల్సన్ కెమెరామెన్‌గా, నిరంజన్ దేవరమానె ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్న ఈ చిత్రానికి సుష్మిత కొణిదెల కాస్ట్యూమ్ డిజైనర్.

ఈ చిత్రానికి బాబీ కథ, మాటలు రాయగా, కోన వెంకట్, కె చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.

విజువల్ ఫీస్ట్‌లా వీరసింహారెడ్డి



రిషి పంజాబీ

బాలకృష్ణ కథానాయకుడిగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'వీరసింహారెడ్డి'. శ్రుతిహాసన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీగా నిర్మిస్తున్నారు. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పని చేసిన రిషి పంజాబీ విలేఖరుల సమావేశంలో ఈ చిత్ర విశేషాలను పంచుకున్నారు.

"వీరసింహారెడ్డి' లార్జర్ దెన్ లైఫ్ మూవీ. యాక్షన్, ఎమోషన్స్, విజువల్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటాయి. ప్రేక్షకులకు సినిమా విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. సినిమా చూస్తున్నపుడు చాలా చోట్ల గూస్ బంప్స్ వస్తాయి. 'వీరసింహారెడ్డి' బిగ్ బ్లాస్టింగ్ ఎంటర్‌టైనర్. బాలకృష్ణతో పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. టెక్నీషియన్స్‌ని చాలా గొప్పగా అర్థం చేసుకుంటారు. ఈ సినిమాలో రగ్గడ్ నెస్ కావాలి. దాని కోసం టీం అంతా చాలా హార్డ్ వర్క్ చేసి దాన్ని ఎచీవ్ చేశాం. బాలకృష్ణ పర్సోనా లార్జర్ దెన్ లైఫ్. దాన్ని తెరపై ఎంత గొప్పగా ఆవిష్కరించాలనే దానిపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాం. లండన్ నుండి తీసుకొచ్చిన న్యూ సెటప్ లెన్స్‌లు వాడాం. కలర్స్ అద్భుతంగా ఉంటాయి. సినిమా విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. గోపీచంద్ మలినేని యంగ్ అండ్ డైనమిక్ వండర్‌ఫుల్ డైరెక్టర్. తనకి చాలా మంచి భవిష్యత్ ఉంటుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు రవి, నవీన్ అద్భుతమైన నిర్మాతలు. వారి సపోర్ట్ మర్చిపోలేను. ఇంత గొప్ప నిర్మాతలని నేను చూడలేదు. వారికి సినిమా పట్ల గొప్ప ప్యాషన్ ఉంది' అని తెలిపారు.



సమంత, దేవ్ మోహన్

అద్భుత పౌరాణిక దృశ్య కావ్యం

అద్భుతమైన విజువల్స్, భారీ బడ్జెట్‌తో సినిమాలను రూపొందించే దర్శకుడు గుణ శేఖర్ సిల్వర్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తున్న అద్భుతమైన పౌరాణిక దృశ్య కావ్యం 'శాకుంతలం'. భారతీయ సినీ ప్రేక్షకులు ఈ ఏడాదిలో చూడాలనుకుని ఆసక్తిగా ఎదురు చూస్తున్న విజువల్ వండర్‌గా 'శాకుంతలం' తనదైన ప్రత్యేకతను సంపాదించుకుంది. సమంత టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మిస్తున్నారు.

ప్రముఖ కవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని గుణ శేఖర్ తెరకెక్కిస్తున్నారు. శకుంతల, దుష్యంత మహారాజు అజరామరమైన ప్రేమ కథ ఇది. ఇందులో శకుంతలగా సమంత.. దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించారు.

చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకునే పనిలో ఉంది. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా నిర్మాతలు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ఎటనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 17న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను అందించటానికి ఈ సినిమాను త్రీడీలో రూపొందిస్తున్నారు.

నయా సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్



పంజా వైష్ణవ్ తేజ్

పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా సితార ఎంటర్ టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్త నిర్మాణంలో రూపుదిద్దు కుంటున్న సినిమా షూటింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగు తున్నాయి. శ్రీకాంత్.ఎన్.రెడ్డి దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. కథానాయికగా 'శ్రీ లీల' నటిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాతలు ఎస్.నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ చిత్ర సమర్ప కులుగా వ్యవహరిస్తున్నారు. ఆంగ్ల సంవత్సరాది శుభ వేళ ఈ చిత్రానికి సంబంధించిన ఓ ప్రచార చిత్రాన్ని సోమవారం విడుదల చేసింది చిత్ర యూనిట్. ఏప్రిల్ 29న ఈ చిత్రం విడుదల అనేది ఈ ప్రచార చిత్రంలో గమనించవచ్చు. తొలిచిత్రంతోనే స్టార్‌గా ప్రేక్షక హృదయాలలో బలమైన స్థానాన్ని సంపాదించుకున్న వైష్ణవ్ తేజ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపించనున్నారని ఈ ప్రచార చిత్రం చూస్తే అనిపిస్తుంది. పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని చిత్ర దర్శక,నిర్మాతలు తెలిపారు. ఇప్పటికే చిత్రం చాలా భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. చిత్ర టైటిల్‌తోపాటు చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

దశాబ్ద కాల ప్రేమ ప్రయాణం..



నాగశౌర్య, మాళవిక నాయర్

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఫీల్ గుడ్ రొమాంటిక్ ఫిల్మ్ 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహిస్తున్నారు. 'కళ్యాణ వైభోగమే' చిత్రంతో వెండితెరపై మ్యాజిక్ చేసిన హిట్ పెయిర్ నాగశౌర్య, మాళవిక నాయర్ ఈ చిత్రంలో హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'గూఢచారి, ఓ బేబీ' వంటి అనేక విజయాలను పొందిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 2022లో 'ధమాకా', 'కార్తికేయ 2' చిత్రాలతో మరో రెండు భారీ విజయాలను అందుకుంది.

నాగశౌర్య, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల కలిసి గతంలో 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' అనే రెండు గుర్తుండిపోయే చిత్రాలను అందించారు. ఇప్పుడు ఈ చిత్రంలో వీరి కాంబినేషన్ హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడానికి సిద్ధమవుతోంది.

ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. నాగ శౌర్య, మాళవిక నాయర్ ఇద్దరూ ఫార్మల్ వింటర్‌వేర్ ధరించి, ప్రయాణంలో ఒకరిపై ఒకరు వాలిపోయి సంగీతం వింటూ కనిపించారు. పోస్టర్‌లో అందమైన వస్త్రధారణతో, అంతకంటే అందంగా ఉన్న ఆ జంటను చూస్తుంటే.. ఈ ఫీల్ గుడ్ ఫిల్మ్‌ని ఎప్పుడెప్పుడా చూస్తామా అనే ఆసక్తి కలగక మానదు.

న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఎనౌన్స్‌మెంట్ వీడియోకి కూడా మంచి స్పందన లభించింది. ఆ వీడియోలో శ్రీనివాస్ అవసరాలతో కాల్ మాట్లాడిన హీరో,హీరోయిన్లు సినిమా గురించి ఎటువంటి అప్‌డేట్‌లు లేకపోవడంపై చర్చించారు. 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' అనేది ఒక దశాబ్దం పాటు ఓ జంట మధ్య సాగే ప్రేమ ప్రయాణం. హెచ్చు తగ్గులతో కూడిన ఆ ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చిత్రం 18 సంవత్సరాల నుండి 28 సంవత్సరాల వయస్సు వరకు సాగే వారి ప్రయాణంలోకి ప్రేక్షకులను తీసుకువెళుతుంది. ఇందులో ప్రేమ సన్నివేశాలు చాలా సహజంగా హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. ఈ చిత్రంలో ప్రేమను ఇంద్రధనస్సు లాగా ఏడు విభిన్న రంగులలో ప్రదర్శించబోతున్నట్లు దర్శకుడు శ్రీనివాస్ అవసరాల తెలిపారు. ఆయన రాసిన సంభాషణలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర నిర్మాతలు చెబుతున్నారు.

గతంలో నాగశౌర్య-శ్రీనివాస్ అవసరాల కలయికలో వచ్చిన రెండు చిత్రాలకు అద్భుతమైన సంగీతం అందించిన కళ్యాణి మాలిక్, ఈ చిత్రానికీ సంగీతం అందిస్తుండటం విశేషం. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. విడుదల తేదీతో పాటు సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్



అజయ్

సహస్ర క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మాత సావిత్రి నిర్మిస్తున్న చిత్రం 'చక్రవ్యూహం' (ది ట్రాప్ అనేది ట్యాగ్‌లైన్). ఎన్నో సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విలక్షణ నటుడు అజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకి చెట్కూరి మధుసూధన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు సినిమా ఖ్యాతిని, తెలుగు సినిమా స్థాయిని పెంచారు సూపర్ స్టార్ కృష్ణ. తెలుగు తెరపై ఆయనే తొలి కౌబాయ్, ఆయనే మొదటి జేమ్స్ బాండ్, ఆయనే ఫస్ట్ సినిమా స్కోప్ హీరో, ఆయనే తొలి 70 ఎం.ఎం. మూవీ డైరెక్టర్ కమ్ హీరో. చిత్రసీమలో డేరింగ్ డాషింగ్ అనే పదాలకు నిలువెత్తు నిర్వచనంగా మారి, తెలుగు చిత్రపరిశ్రమకు ఒక సరికొత్త సాంకేతికతను పరిచయం చేసిన కృష్ణ చివరగా ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ పోస్టర్‌ను లాంచ్ చేసిన ఆయన ఈ చిత్ర బృందానికి ఆశీస్సులు అందించారు. ఈ లాంచ్ చేసిన పోస్టర్‌లో పోలీస్ పాత్రలో ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్న అజయ్‌ను మనం గమనించవచ్చు.

ఈ సినిమా మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి రచన -దర్శకత్వం: చెట్కూరి మధుసూధన్, నిర్మాత: శ్రీమతి.సావిత్రి, సహ నిర్మాతలు: వెంకటేష్, అనూష, సంగీత దర్శకుడు: భరత్ మంచిరాజు, సినిమాటోగ్రఫీ: జివి అజయ్, ఎడిటర్: జెస్విన్ ప్రభు, ఫైట్స్: రాబిన్ సుబ్బు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: అజయ్, మహేష్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

కొత్త ఏడాది గడ్డు కాలమే

- మాంద్యంలోకి మూడోవంతు దేశాలు
- సంక్షోభం అంచున అమెరికా : ఐఎంఎఫ్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాదిలో ప్రపంచంలోని మూడో వంతు దేశాలు ఆర్థిక మాద్యంలో చిక్కుకోనున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా హెచ్చరించారు. 2023లో మాంద్యం సంభవించనుందని విశ్లేషించారు. సిబిఎస్ న్యూస్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జార్జివా మాట్లాడుతూ.. "గత ఏడాదితో పోలిస్తే.. 2023లో మరింత గడ్డు పరిస్థితులు చోటు చేసుకోనున్నాయి. అమెరికా, యురోపియన్ దేశాలతో పాటు చైనా తదితర ఆర్థిక వ్యవస్థలు మందగిస్తున్నాయి. ఇప్పటికే ఉక్రెయిన్ యుద్ధం, అధిక ధరలు, వడ్డీ రేట్లు, చైనాలో మళ్లీ కరోనా లాంటి పరిస్థితులు అనేక దేశాల్ని ఇబ్బందిపెడుతున్నాయి. ఆర్థిక మాంద్యం లేని దేశాల్లో కూడా ఈ ఏడాది లక్షలాది మంది ఆ ప్రభావానికి గురైయ్యే అవకాశాలు ఉన్నాయి." అని పేర్కొన్నారు. 10 నెలలు గడుస్తున్నా రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతుండడం, ద్రవ్యోల్బణం అధిక వడ్డీ రేట్లు, చైనాలో కరోనా కేసుల పెరుగుదల వంటి పరిస్థితుల నేపథ్యంలో జార్జివా ఈ వ్యాఖ్యలు చేశారు."అమెరికా ఆర్థిక మాంద్యం అంచుల్లో ఉంది. ఇక యూరోప్ దేశాలు కూడా ఆ ప్రమాదం నుంచి గట్టెక్కడం అసాధ్యమే. మరికొన్ని నెలల పాటు చైనాలోనూ కఠిన పరిస్థితులు ఉండొచ్చు. అది చైనా వృద్ధి పైనా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పైనా ప్రతికూల ప్రభావాన్ని చూపించనుంది." అని జార్జియా పేర్కొన్నారు. ఇటీవల అక్టోబర్‌లో ప్రపంచ వృద్ధి రేటు అంచనాలకు ఐఎంఎఫ్ కోత పెట్టింది. 2021లో 6 శాతంగా ఉన్న ప్రపంచ వృద్ధి రేటు 2022లో 3.2 శాతానికి పడిపోనుందని అంచనా వేసింది. 2023లో ఏకంగా 2.7 శాతానికి క్షీణించొచ్చని ఐఎంఎఫ్ విశ్లేషించింది. 2008 ఆర్థిక మాంద్యం, కరోనా పరిస్థితులను మినహాయిస్తే 2001 తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయిలో వద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి కానుందని ఐఎంఎఫ్ వెల్లడించింది. ఇప్పటికే అనేక ఆర్థిక వ్యవస్థలు హెచ్చు ద్రవ్యోల్బణంతో ఆర్థిక సంక్షోభ అంచుల్లో ఉన్నాయని అంతర్జతీయ ఏజెన్సీలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

మార్కెట్లకు తొలి సెషన్‌లో లాభాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త ఏడాది తొలి సెషన్‌లో లాభాలు సాధించాయి. కొనుగోళ్ళ మద్దతుతో సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 327 పాయింట్లు పెరిగి 61,168కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 92 పాయింట్ల లాభంతో 18,197 వద్ద ముగిసింది. స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.8 శాతం, 0.6 శాతం చొప్పున రాణించాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన మార్కెట్లు క్రమంగా పుంజుకొని ఇంట్రాడేలో గరిష్టాలకు చేరుకొన్నాయి. లోహ, మౌలిక రంగాల షేర్లు అధికంగా లాభపడ్డాయి.

వడ్డీ రేట్ల పెంపు ఉండకపోవచ్చు : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంక్‌లు వడ్డీ రేట్ల పెంపును ఇక నిలిపివేయనున్నాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. మందగమనం చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వడ్డీ రేట్ల పెంపునపై వెనక్కి తగ్గనున్నాయని పేర్కొంది. అధిక వ్యయాల నేపథ్యంలో పెట్టుబడులు తగ్గిపోవడంతో వృద్ధిపై మరింత ప్రభావం పడనుందని తెలిపింది. ఈ క్రమంలో వడ్డీ రేట్ల పెంపునకు ఇక స్వస్తి చెప్పనున్నాయని ఎస్‌బిఐ అంచనా వేసింది.

ద్విచక్ర వాహన అమ్మకాలు డీలా


న్యూఢిల్లీ : దేశంలోని అధిక ధరలు ద్విచక్ర వాహన మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. 2022 డిసెంబర్‌లో ద్విచక్ర వాహన అమ్మకాలు స్తబ్దుగా నమోదయ్యాయి. ఈ రంగంలోని హీరో మోటో కార్ప్, టివిఎస్ మోటర్, బజాజ్ ఆటో, రాయల్ ఎన్‌ఫీల్డ్, సుజుకి మోటార్ సైకిల్ కంపెనీ ల అమ్మకాలు 7,68,985 యూనిట్లుగా నమోదయ్యాయి. 2021 డిసెంబర్ మాసం అమ్మకాలతో పోల్చితే కేవలం మూడు శాతం మాత్రమే పెరిగాయి. అధిక ధరలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక సవాళ్ల అమ్మకాల ను దెబ్బతీశాయని ఆ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గడిచిన నెలలో హీరో మోటో అమ్మకాల్లో 1.84 శాతం, టివిఎస్ మోటార్ 9.95 శాతం, సుజుకి మోటార్ సైకిల్ అమ్మకాలు 25.67 చొప్పున పెరిగాయి. మరోవైపు బజాజ్ ఆటో విక్రయాలు 1.62 శాతం, రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 8.25 శాతం చొప్పున తగ్గాయి.

గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై లైంగిక దాడి

- నిందితునిపై ఫోక్సో కేసు నమోదు
- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

నవతెలంగాణ- తుంగతుర్తి

గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై లైంగికదాడి జరిగింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని గురుకులంలో ఆలస్యంగా వెలుగు జూసింది. ఎస్ఐ డానియల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని తుంగతుర్తిలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఒంటెద్దు నాగేందర్‌తో విద్యార్థినికి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అతను ఆదివారం రాత్రి కళాశాల వద్దకు వచ్చి ఆమెను బయటకు రావాలని కోరాడు. తాను రానని ఆమె నిరాకరించడంతో.. బ్లాక్‌మెయిల్ చేశాడు. 'నీవు రాకుంటే నేను చనిపోతానని' బెదిరించాడు. దాంతో విద్యార్థిని బయటకు వచ్చింది. ఆ తర్వాత ఆమెను కొట్టి లైంగికదాడికి ఒడిగట్టాడు. అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం ఆమె కళాశాలకు వెళ్లి తనపై జరిగిన దాడి గురించి ప్రిన్సిపాల్ దుర్గాభవానికి చెప్పినా నిర్లక్ష్యం వహించారు. మరుసటి రోజు తల్లిదండ్రులను పిలిపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నాగేందర్‌పై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ దుర్గాభవాని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండటంతో.. వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురుకులం నుంచి విద్యార్థిని ఎలా బయటకు వెళ్లింది.. నిర్వాహకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



ద.మ.రైల్వే ఏజీఎమ్‌గా పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1986 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఐఆర్ఎస్ఎంఈ) విభాగానికి చెందినవారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. 1983లో జమాల్‌పూర్‌లో స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటీస్‌గా ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగంలో చేరారు.

ప్రమాదంలో లౌకికతత్త్వం

- సీఐటీయూ ఏపీ రాష్ట్ర మహాసభ ప్రారంభం
- భీమవరంలో భారీ బహిరంగ సభ, మహా ప్రదర్శన

ఉద్యమాల పురిటిగడ్డ... రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం ఎరుపురంగు పులుముకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్మికుల నినాదాలతో పట్టణమంతా మార్మోగింది. భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు తలపెట్టిన సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభ పతాకావిష్కరణతో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమైంది. మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన వివిధ తరగతుల కార్మికులతో పట్టణం కిటకిటలాడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జిస్తూ అత్యంత క్రమశిక్షణాయుతంగా సాగిన మహాప్రదర్శన ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. ప్రారంభ సభ, బహిరంగ సభల్లో జాతీయ, రాష్ట్ర నాయకుల ప్రసంగాలు కార్మిక లోకానికి దిశానిర్దేశం చేసేలా సాగాయి. మూడు రోజులపాటు సాగనున్న మహాసభలో తొలిరోజు చైతన్యవంతంగా, సమరశీలంగా సాగగా, మంగళ, బుధవారాల్లో కార్మిక, ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించడంతోపాటు వాటి పరిష్కారానికి డిమాండ్ల రూపంలో పలు తీర్మానాలను ఆమోదించనున్నారు.





ఏలూరు : దేశంలో అనేక భాషలు, రకరకాల ఆహారపు అలవాట్లు, అనేక విధాలుగా వస్త్రధారణ పద్ధతులు ఉన్నప్పటికీ అంతా కలిసిమెలిసి జీవిస్తుండడం ఒక ప్రత్యేకతగా ఉందని, అలాంటి లౌకికతత్వానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ రూపంలో ప్రమాదం ఏర్పడుతుందని కేరళ న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ తెలిపారు. సీఐటీయూ 16వ ఏపీ రాష్ట్ర మహాసభ సందర్భంగా సోమవారం సాయంత్రం భీమవరంలోని కేశవరావు హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరిగింది.

తొలుత పాత బస్టాండ్ నుంచి జువ్వలపాలెం రోడ్డు, నటరాజ్ థియేటర్, వెంకటేశ్వరస్వామి గుడి, ఉండి రోడ్డు గుండా బొంబే స్వీట్స్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, పోలీసు బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ మీదుగా కొత్త బస్టాండ్ వరకూ వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలో జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు, వేలాది కార్మికులు పాల్గొన్నారు. సుభాని, సూర్యనారాయణ స్మారక ప్రాంగణం (కేశవరావు గ్రౌండ్)లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథి పి.రాజీవ్ మాట్లాడుతూ బానిసలుగా ఉంటామని బ్రిటీష్ వాళ్ల కాళ్లు పట్టుకుని బతిమాలినోళ్లు, స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేనోళ్లు నేడు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. 1925లో ఏర్పడిన ఆర్ఎస్ఎస్... ప్రజాస్వామిక, లౌకిక దేశంగా ఉన్న భారత్‌ను హిందూ దేశంగా మార్చాలని చూస్తోందన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రమాదమన్నారు.

ప్రధాని సైతం హిందూ దేశంగా చెబుతారని, అయితే రాజ్యాంగ కమిటీలో దీనిపై అప్పట్లో చర్చ జరిగిందని, చర్చల తర్వాత భారతదేశంగా రాజ్యాంగ సభ నిర్ణయించిందని గుర్తు చేశారు. అనేక భాషలు, మతాలు ఉండడంతో రాజ్యాంగంలో మనం అనే సంబోధన ఉండాలని నిర్ణయించారన్నారు. రాజ్యాంగంలో జాతీయ భాషగా హిందీ అని ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. దేశంలో అనేక భాషలను జనం మాట్లాడడంతో 22 భాషలు అధికారిక భాషలుగా ఉన్నాయన్నారు. ప్రాంతీయ భాషలు అని ఎక్కడా లేదని తెలిపారు. హిందీని బలవంతంగా రుద్దేందుకు చూస్తున్నారన్నారు. రాజ్యాంగంలోని క్రిమినల్ సివిల్ కోడ్‌ను సవరించి హిందూ, ముస్లిములకు ఒకే చట్టం అమలుకు పూనుకున్నారని విమర్శించారు. పౌరసత్వం మతాల ఆధారంగా లేదని, పాకిస్తాన్, బర్మా వంటి దేశాల నుంచి వస్తున్న వారికి పౌరసత్వం ఇవ్వకపోవడం రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని తెలిపారు. ఉదారవాద విధానాలు తెచ్చి దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు.

కేరళ మోడల్ ఇదే..

కేరళలో దఫదఫాలుగా వామపక్ష ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలు గెలిపించారని, 2021లో మాత్రం చరిత్ర తిరగరాశారని పి.రాజీవ్ పేర్కొన్నారు. భూపంపిణీ, నాణ్యమైన ఆరోగ్యం, విద్య వంటి విధానాలు కేరళలో అమలు చేశామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూళ్ల ఏర్పాటుతో పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం ఖరీదైందని తెలిపారు. కేరళలో గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం అందించడమే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో గుండెమార్పిడి, వైద్యకళాశాలల్లో అవయవ మార్పిడులు జరుగుతున్నాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం అందుతోందని తెలిపారు. శిశుమరణాల్లో అమెరికాతో సమానంగా ఉందన్నారు. ఇది కేరళ మోడల్ అని వివరించారు. ఇతర రంగాల్లోనూ కేరళ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 42 ప్రభుత్వ పరిశ్రమల్లో 22 లాభాల్లో ఉన్నాయన్నారు. మూసివేస్తానన్న కేంద్ర సంస్థలను సైతం రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమి కొరత ఉందని, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కేరళలో ప్రతి ఏడాదీ ఒక ప్రణాళిక ప్రకటించి అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ ప్రయివేటీకరణ పేరుతో కేంద్రం ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తోందన్నారు. నిరుద్యోగం 8.3 శాతానికి పెరిగిందని తెలిపారు. పన్నుల పెంపుతో ఈ ఏడాది జిఎస్‌టి రూ.1.5 లక్షల కోట్లు వచ్చిందన్నారు. అయినా, పేదలపై భారాలు మోపుతున్నారన్నారు. సీఐటీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, బేబిరాణి తదితర నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఉపాధ్యక్షులు సాయిబాబు, నాయకులు మంతెన సీతారాం, ఆర్.లక్ష్మయ్య, వి.ఉమామహేశ్వరరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, డిఎన్‌విడి.ప్రసాద్, జెఎన్‌వి.గోపాలన్, బి.బలరాం, ఆర్.లింగరాజు, బి.వాసుదేవరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'దిశ ఎన్‌కౌంటర్'పై విచారణ 23కు వాయిదా

నవతెలంగాణ - హైదరాబాద్

దిశ ఎన్‌కౌంటర్ ఘటనపై దాఖలైన కేసులో పిటిషనర్ల వాదనలు ముగిశాయి. పోలీసుల వాదనల కోసం విచారణను కోర్టు ఈ నెల 23కి వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ భాస్కర్‌రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చటాన్‌పల్లి వద్ద ఓ వైద్యురాలు (దిశ) హత్యాచారానికి గురైన కేసులో నలుగురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలికి వారిని తీసుకెళ్లినప్పుడు తమపై దాడికి ప్రయత్నించిన కారణంగా ఎన్‌కౌంటర్ చేశామంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో కమిషన్ ఏర్పాటైంది. ఎన్‌కౌంటర్‌పై సందేహాలను వ్యక్తం చేస్తూ ఆ కమిషన్ రిపోర్టు ఇచ్చింది. దీంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు విచారించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పది మంది పోలీసులపై కేసు నమోదు చేయాలని బృందా కోరారు. ఇనిస్టెంట్ జడ్జిమెంట్ పేరుతో పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నలుగురు అమాయకుల ప్రాణాలు తీశారనీ, దీనికి ఎన్‌కౌంటర్ అనే పేరు పెట్టారంటూ వాదించారు.

మెమో రద్దు కరెక్టే...

ఎమ్మెల్యేల ఎర కేసుకు సంబంధించిన నిందితులుగా బీఎల్ సంతోష్, ఇతరులను చేర్చుతూ సిట్ వేసిన మెమోను ఏసీబీ కోర్టు రద్దు చేయడాన్ని హైకోర్టు ఆమోదించింది. ఈ కారణంగా మెమోను సిట్ సవాల్ చేసిన కేసు నిష్ప్రయోజనమే అవుతుందని తెలిపింది. మెమోను ఏసీబీ కొట్టేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమంటూ జస్టిస్ నాగార్జున సోమవారం తీర్పు వెలువరించారు. ఇదే కేసులో బీఎల్ సంతోష్, తుషార్, జగ్గుస్వామి, శ్రీనివాస్‌కు సిట్ ఇటీవల ఇచ్చిన 41ఎ నోటీసుల అమలును నిలిపివేస్తూ గత స్టే ఉత్తర్వులను జస్టిస్ సురేందర్ సోమవారం పొడిగించారు.

గ్రామంలో సామాజిక బహిష్కరణపై రిట్...

గ్రామాభివృద్ధికి రూ.10 లక్షల నిధులు ఇవ్వకపోవడంతో సామాజిక బహిష్కరణ చేశారనే కేసులో అధికారులు సత్వరమే స్పందించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌ను, ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. ఆ జిల్లాలోని జాక్రాన్‌పల్లి మండలానికి చెందిన ఎ.శంకర్‌గౌడ్ మరో నలుగురి విషయంలో గ్రామ కమిటీ తీసుకున్న సామాజిక బహిష్కరణ నిర్ణయంపై దాఖలైన రిట్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారించారు. కల్లు గీతకు అధికారిక అనుమతులు పొందినా గ్రామ కమిటీ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరితే ఇవ్వలేదని, దీంతో తమకు గ్రామంలో ఎవరైనా, ఎలాంటి సహాయ సహకారాలు అందించినా వాళ్లకు జరిమానా విధిస్తామంటూ కమిటీ హుకూం జారీ చేసిందని పిటిషనర్ తరపు లాయర్ కోర్టుకు తెలిపారు. ప్రభుత్వంతోపాటు కమిటీలోని తొమ్మిది మందికి నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

ప్రారంభమైన న్యాయ సేవాధికార సంస్థలు...

కొత్తగా ఏర్పాటైన 23 జిల్లాల్లో న్యాయ సేవాధికార సంస్థలు సోమవారం ప్రారంభమయ్యాయి. హైకోర్టు నుంచి ఆన్‌లైన్ ద్వారా చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వాటిని ప్రారంభించారు. ఆ వెంటనే అవన్నీ విధుల్లోకి వచ్చాయి.

అడవుల రక్షణ, పచ్చదనమే ప్రాధాన్యం

పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అడవుల రక్షణ, పచ్చదనం పెంపునే తమ మొదటి ప్రాధాన్యమని పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో నూతన సంవత్స రపు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ కేక్ కట్ చేశారు. అటవీ అధికారుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. పచ్చదనం పెంపునకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం, దేశంలో మరే ఇతర రాష్ట్రమూ ఇవ్వటం లేదన్న విషయాన్ని గుర్తించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ జాయింట్ సెక్రటరీ ఎం.ప్రశాంతి, పీసీసీఎఫ్ (కంపా) లోకేశ్ జైస్వాల్, పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఎలూసింగ్ మేరు, పీసీసీఎఫ్ (ఎఫ్‌పీసీ) ఎంసీ. పర్గెయిన్, అదనపు పీసీసీఎఫ్ వినయ్ కుమార్, హైదరాబాద్ డీఎఫ్‌ఓ ఎం. జోజి, ఇతర ఉన్నతాధి కారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన పీసీసీఎఫ్

అటవీ పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్ కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మతోన్మాదంపై కలిసికట్టుగా పోరాటం

- దేశ సేవక్ పత్రిక వ్యవస్థాపక దినోత్సవంలో తరిగామి

చండీగడ్ : మనందరం కలిసికట్టుగా ఆలోచిస్తూ, కలిసి జీవిస్తూ, కలలు గంటూ, మతోన్మాద, ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ యూసుఫ్ తరిగామి పిలుపునిచ్చారు. పంజాబ్ దినపత్రిక దేశ్ సేవక్ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని చండీగఢ్‌లోని బాబా సోహన్ సింగ్ భక్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 1920ల్లో జలంధర్ నుంచి వెలువడే ఆ పత్రిక, ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం నుండి ఒత్తిళ్ల ఎదురైనా తన వార్తలు, సంపాదకీయ విధానంలో ఎలాంటి రాజీ ధోరణి కనబరచలేదని తరిగామి ప్రశంసించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నాల్గవ ఎస్టేట్ అయిన పత్రికా రంగం తన అస్తిత్వాన్ని, అధికారాన్ని కోల్పోతోందంటూ విచారం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళుతున్న మీడియా గోడీ మీడియాగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాల సమస్యలను నిర్భయంగా ప్రస్తావిస్తున్నందుకు ఆయన దేశ సేవక్‌ను అభినందించారు. జమ్ముకాశ్మీర్ పరిస్థితులపై వ్యాఖ్యానిస్తూ ఆయన, దేశంలోని ఇతర పౌరుల మాదిరిగానే మనమూ కూడానని, మనకు కూడా వారిలాగే కలలు, ఆకాంక్షలు వున్నాయని, మనకూ మంచి విద్య, వైద్యం, అన్నింటినీ మించి పరువు, మర్యాదలతో కూడిన జీవితం వుండాలని అన్నారు. భూప్ చంద్ చన్నో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుఖ్విందర్‌సింగ్ షెకాన్, గురుదర్శన్ సింగ్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామికి.. బంగారు కిరీటాన్ని అందజేసిన మంత్రి

- భక్తిశ్రద్ధలతో ఉత్తరద్వార దర్శనం



నవ తెలంగాణ-సిద్దిపేట

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని మోహింపురలో గల వెంకటేశ్వర దేవాలయంలో సోమవారం సందర్శకులు భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. దాతలు, మంత్రి సహకారంతో సుమారు రెండు కిలోల బంగారు కిరీటాన్ని ఆలయ కమిటీ చేయించింది. మంత్రి హరీశ్‌రావు బంగారు కిరీటాన్ని స్వామివారికి అందజేశారు. అంతకుముందు మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈవో విశ్వనాథ శర్మ, చైర్మెన్ అమరేష్ విష్ణు ప్రసాదాలను అందజేశారు. పోలీసులు దేవాలయ పరిసర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాలమూరు-రంగారెడ్డిపై విచారణ వాయిదా

- పిటిషనర్ వాదనలు వినాల్సి ఉంది...
- రెండువారాల తర్వాతపరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ (పిటిషనర్ మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి తరపు న్యాయవాది) వాదనలు వినాల్సి ఉందని సుప్రీం కోర్టు తెలిపింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో అవినీతి చోటు చేసుకుందంటూ నాగం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ హిమా కోహ్లితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. వేలాది మంది ప్రజలపై ప్రభావం చూపే ప్రాజెక్టుపై ఒక పిటిషన్ తరువాత మరో పిటిషన్ దాఖలు చేస్తున్నారనీ, ముందు పిటిషన్ విచారణలో ఉన్న విషయాన్ని పిటిషనర్ తెలియజేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ దశలో జోక్యం చేసుకున్న జస్టిస్ అబ్దుల్ నజీర్ తాము ఉత్తర్వులు ఇచ్చే ముందు ప్రశాంత్ భూషణ్ వాదనలు వినాల్సి ఉందన్నారు. తాము పిటిషన్లకు సంబంధించిన సమాచారాన్ని కలిపి అందించేందుకు అనుమతించాలని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విన్నవించారు. అందుకు సమ్మతించిన ధర్మాసనం కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

8,694 మందికి పోస్టల్ 'వైకుంఠ' ప్రసాదాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పోస్టల్ శాఖ ద్వారా రాష్ట్రంలో 8,694 మంది భక్తులకు ప్రసాదాలు అందించినట్టు ఆ శాఖ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ మహంతి సంతోష్‌కుమార్ నరహరి తెలిపారు. అంతరాలయ అర్చన పేరుతో వారి గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు చేయించి, పోస్టు ద్వారానే ప్రసాదాలు అందచేశామన్నారు. భద్రాచలం నుంచి 2,773 మంది, యాదాద్రి నుంచి 5,051 మంది, ధర్మపురి దేవస్థానం నుంచి 870 మంది ఈ సేవల్ని వినియోగించుకున్నట్టు పేర్కొన్నారు. పసుపు, కుంకుమ, మిస్రీ, డ్రై ఫ్రూట్స్, పాకెట్ సైజ్ లామినేటెడ్ ఫోటోలు స్పీడ్ పోస్టు ద్వారా వారికి అందచేశామన్నారు. 6,208 పోస్టాఫీసుల్లో ఈ సేవలు బుక్ చేసుకొనురనీ, ఎస్ఎమ్ఎస్ అలర్ట్ ద్వారా భక్తులకు వీటిని అందచేశామని వివరించారు. అన్ని శుభదినాల్లోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.